సంపుటి : 78 సంచిక : 42 పుటలు : 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ అషాఢ బహుళ పంచమి
3-9 ఆగస్ట్ 2026
వెల : ₹20/-

మాతృత్వం నాగరికతకు పునాది

దేశానికి పరీక్షాసమయం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.



సమాజ హితానికి దృఢ సంకల్పం

హరియాణా: జూలై 24న ప్రారంభమైన రాష్ట్ర సేవికాసమితి అఖిల భారతీయ కార్యకారిణి, ప్రతినిధి మండలి ప్రథమ అర్ధవార్షిక సమావేశం హరియాణాలోని సమాల్ఖాలో జూలై 26న విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశంలో సమితి ప్రముఖ సంచాలిక శాంతాకుమారి, అఖిల భారతీయ ప్రముఖ కార్యవాహిక సీతా గాయత్రీతో పాటు దేశంలోని 40 ప్రాంతాల నుండి 488 మంది విభాగ్, ప్రాంత, క్షేత్ర స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ఫిబ్రవరి 2026 నుండి ఇప్పటివరకు వివిధస్థాయిలలో జరిగిన సమితి కార్యకలాపాలను సమీక్షించారు. గత ఆరు నెలల్లో కార్యయుక్త జిల్లాల సంఖ్యతో పాటు శాఖలు, మిలన్ల సంఖ్య కూడా పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 852 జిల్లాల్లో 4,886 శాఖలు, 1,173 మిలన్లు, 1,332 సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయి.

రాష్ట్ర సేవికా సమితి ప్రారంభమై 90 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కార్య విస్తరణ కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై చర్చించారు. అలాగే ప్రస్తుత సామాజిక పరిస్థితులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగింది.

జనాభా అసమతుల్యతకు కారణాలు, దాని ప్రభావాలపై చర్చించి,ఈ అంశంపై తీవ్రఆందోళన వ్యక్తంచేస్తూ ఈ సందర్భంగా ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఆ తీర్మానంలో దేశ, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాలకూ సమానంగా వర్తించే జాతీయ జనాభా విధానం, ఉమ్మడి పౌర స్మృతి (Uniform Civil Code)ని అమలు చేయాలని కోరారు.

ముగింపు సందర్భంగా మార్గదర్శనం చేసిన ప్రముఖ సంచాలిక శాంతాకుమారిగారు మాట్లాడుతూ, కురుక్షేత్ర భూమి మనలోని అంతర్గత ద్వంద్వాలను తొలగించి, స్థిరచిత్తంతో సమాజహితం కోసం దృఢ సంకల్పంతో పని చేయాలని సందేశమిస్తుంది అన్నారు.

ధర్మస్థాపన కోసం సర్వస్వాన్ని అర్పించాలనే స్ఫూర్తిని అందించే ఈ పవిత్ర భూమి నుండి ప్రేరణ పొందుతూ, నాణ్యమైన కార్యవిస్తరణకు దృఢమైన సంకల్పాన్ని కలిగి ఉండాలని సూచించారు. అలాగే కార్యకర్తలుగా మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకొని, కార్యానికి అనుకూలంగా మనలను మనం సిద్ధం చేసుకోవాలన్నారు. 90 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తిచేసి శతాబ్దివైపు అడుగులువేస్తున్న సందర్భంలో, మన ధ్యేయ సాధనకు నిబద్ధతతో నిరంతరం ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.

భారతీయ సాహితీ ద్రష్ట
భండారు సదాశివరావుగారి స్మారక
కథల పోటీ-2026

జాగృతి వారపత్రిక దీపావళి సందర్భంగా ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు గారి స్మారక 'కథల పోటీ' నిర్వహిస్తున్నది. రచయితలకు ఆహ్వానం..

ప్రథమ బహుమతి : రూ. 12000/-
ద్వితీయ బహుమతి : రూ. 7000/-
తృతీయ బహుమతి : రూ. 5000/-

నిబంధనలు :

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు పారితోషికం ఉంటుంది.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే.
8. ఈ కథలను దీపావళి సంచిక నుంచి వరుసగా ప్రచురిస్తాం.

కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 22 ఆగస్టు, 2026

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Managing Editor : Kurra Durga Reddy.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం
9959991304
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

డిజైనర్ : చిగుళ్ల కుమార్

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా దేశరాజధాని ఢిల్లీలో జరిగిన నిరసన ప్రదర్శనలలో యువత చురుగ్గా పాల్గొనడం ఒక ఎత్తు అయితే, వారు మీడియా కెమెరాల ముందు వాడిన భాషతో దేశం యావత్ బిత్తరపోయింది. ముఖ్యంగా యువతులు ఉపయోగించిన పదాలు, హావభావాలతో అందరి దృష్టి వారి తల్లిదండ్రుల పెంపకంపైకి మళ్లింది. నిరసనలు చేయవద్దని ఎవరూ చెప్పరు, నాయకులను విమర్శించడాన్ని ఎవరూ కాదనరు. మన రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ కూడా. అయితే ఈ స్వేచ్ఛకు పరిమితులు ఉంటాయి. ఉన్నత విద్యను అభ్యసిస్తున్నవారు, అభ్యసించాలనుకుంటున్న వారూ, సివిలైజ్డ్ అని భావించే యువత అలాంటి భాషను ఉపయోగించడానికి కారణం ఏమిటి? కుటుంబానికి కూడా ఇబ్బందికరంగా పరిణమిస్తున్న ఈ ప్రవర్తనను నిలవరించడానికి, ఆ కుటుంబమే బాధ్యత తీసుకోవాలన్నది నిస్సందేహం. తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించకపోవడం, విలువలు నేర్పకపోవడంతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నది నిర్వివాదం.

ప్రతి తరం తనకంటూ ఒక ప్రత్యేక స్వభావాన్ని కలిగి ఉంటుంది. నేటి యువత సమాచార విస్ఫోటన యుగంలో పెరుగుతోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండడం కారణంగా ప్రపంచం మొత్తం వారి ముందే ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం "మేము చెప్పిందే చేయాలి" అనే ధోరణి ఆశించిన ఫలితాలను ఇవ్వదని తల్లిదండ్రులు గుర్తించాలి. వారి మనసును గెలవాలంటే ముందుగా వారిని అర్థం చేసుకోవాలి.

కుటుంబం అనేది పిల్లలకు మొదటి పాఠశాల. తల్లిదండ్రులే తొలి గురువులు. అయితే గురువు అంటే కేవలం ఆదేశాలు ఇచ్చేవాడు కాదు; సందేహాలను పోగొట్టేవాడు, ఆలోచింపజేసేవాడు. పిల్లల ప్రశ్నలకు సమాధానంచెప్పే సహనం తల్లిదండ్రులకు ఉండాలి. నేడు కుటుంబసభ్యులు ఒకే ఇంట్లోఉన్నా, అందరూ మొబైల్‌లో మునిగిపోతున్నారు. మాటలుతగ్గుతున్నాయి. సంభాషణ లేకపోవడంవల్ల అపార్థాలు పెరుగుతున్నాయి.అలాంటి సమయంలో కుటుంబసభ్యులు ప్రతిరోజూ కొంత సమయం కలిసి కూర్చొని మాట్లాడుకోవడం, పిల్లలభావాలను తెలుసుకోవడం

శాలివాహన 1948 శ్రీ పరాభవ ఆషాఢ బహుళ పంచమి

లోపలి పేజీలలో...

6లో

ముఖపత్ర కథనం

దేశానికి పరీక్షాసమయం

ధారావాహిక నవల

47 గణపతిదేవుడు

(ముగింపు)

- మత్తి భానుమూర్తి

20లో

ప్రత్యేక వ్యాసం

దేవాలయాలలో శాస్త్రీయత

26లో

జాగృతి

సంపాదకీయం

ఎంతో అవసరం.

యువతకు విలువలు నేర్పాలంటే ఉపన్యాసాల కంటే ఆచరణ గొప్పది. నిజాయితీ, క్రమశిక్షణ, పరస్పర గౌరవంవంటి విలువలను తల్లిదండ్రులు తమ జీవితంలో పాటిస్తే పిల్లలు వాటిని సహజంగానే అలవర్చుకుంటారు. భారతీయ కుటుంబ వ్యవస్థ బలమైన బంధాలపై నిర్మితమైంది. ఆ బంధాలను నిలబెట్టేది ప్రేమ, పరస్పర గౌరవం, సంభాషణ. ఆదేశాలు భయాన్ని కలిగించవచ్చు; కానీ సంభాషణ విశ్వాసాన్ని పెంచుతుంది. విశ్వాసమే కుటుంబాలను బలంగా నిలబెడుతుంది.

యువత పయనమెటు?

నేటి సమాజంలో యువతను సరైన దిశలో నడిపించాలంటే వారి భావాలను వినడం, వారితో మాట్లాడడం, వారి ఆలోచనలకు గౌరవం ఇవ్వడం అనివార్యం. కుటుంబంలో సంభాషణ సంస్కృతి పెరిగితేనే బాధ్యతాయుతమైన, విలువలతో కూడిన కొత్తతరం రూపుదిద్దుకుంటుంది. అదే సమాజానికి, దేశానికి శుభపరిణామం అని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్‌భాగవత్ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు.

ఇటీవల కాలంలో దేశంలో అనేక రాష్ట్రాలలో ప్రశ్నాపత్రాలు లీకు కావడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ విషయంలో కలతచెందిన కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. సాధారణంగా అవినీతి అంటే డబ్బు విషయానికి సంబంధించినది అని భావిస్తుంటాం. ఈ అవినీతి ఇతర పనులలో కూడా గమనిస్తుంటాం. కేవలం చట్టాలు మాత్రమే అవినీతిని అరికట్టలేవు. కుటుంబం నుండే జీవన విలువలు నేర్పబడాలి. చిన్న చిన్న పనులు కూడా నీతివంతంగా జరిగేటట్లు బాల్యంలోనే తల్లిదండ్రులు తర్ఫీదు ఇవ్వాలి. మొక్కై వంగనిది మానై వంగునా అన్న సామెత ప్రకారం ప్రతి మంచి అలవాటును బాల్యం నుండే నాటుకునేటట్లు చూసే బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది.

ఈ క్రమంలో డా॥ కలాంను ఒకసారి గుర్తు చేసుకోవాలి. లక్షమంది విద్యార్థులలో 'శాస్త్రీయ దృక్పథం', అంకురింపచేసి, వారు దేశానికి ఉపయోగపడే 'దేశభక్తులు'గా తయారుచేయాలనే ఉద్దేశ్యంతో ఒక 'ఉద్యమం' సాగించారు. అందుకని తరచుగా పిల్లలూ, యువకులతో సమయం వచ్చినప్పుడల్లా సమావేశాలు నిర్వహిస్తూ వారి సందేహాలు తెలుసుకునేవారు, సమాధానాలు ఇచ్చేవారు. డా॥ కలాం ఒక్కొక్కప్పుడు, వారి సందేహాలను ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా తెలుసుకొని, వారి అనుమానలు నివృత్తి చేయడంలో ఎంతో శ్రద్ధ చూపేవారు. ఇలా పిల్లలకు, యువకులకు దగ్గరగా ఉండి, డా॥కలాం తప్పవారి అభిప్రాయాలకు గొప్ప విలువనిచ్చిన నాయకులూ, అధికారులెవ్వరూ లేరు. అందుకే పిల్లలు, ఆయనతో ఎంతో చనువుగా ఉండి, నిర్భయంగా ప్రశ్నలు వేసేవారు. డా॥ కలాంవలె బాలలతో, యువకులతో 'మన్ కీ బాత్' వంటి కార్యక్రమాల ద్వారా సంభాషించడంలో మోదీ కొంతవరకు కృతకృత్యులవుతున్నారు. నీట్ నిరసన సమయంలో కూడా యువత అధికంగా ఉండే ఇన్‌స్టాగ్రామ్‌లో తన సందేశాన్ని పోస్ట్ చేయడం ద్వారా వారిని చేరుకునే యత్నం ప్రధాని చేసి, యువత నుంచి ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే. అయితే, రాజకీయనాయకులకన్నా సమాజంలోని ప్రాథమిక యూనిట్ అయిన కుటుంబం, దాని విలువల ప్రభావం యువతపై అధికంగా ఉంటే, దేశ భవిష్యత్తుకు ఢోకా ఉండదన్నది ఖాయం. ★

40లో

కథ

ధర్మ గంట మోగింది

-కలశపూడి శ్రీనివాసరావు

రోదసీలో స్వావలంబన (సాధన) - 15
'మాతృత్వం నాగరికతకు పునాది' (పిలుపు) - 17
మార్మిజం-శ్రీరామరాజ్యం-47 - 23
నావికుల మరణాలు, దౌత్య చిక్కులు (అంతర్జాతీయం) - 24
ఒకే దేశం : ఏకాత్మతా స్తోత్రం సందేశం (ఆర్ఎస్ఎస్-100) - 28
పోరాట స్ఫూర్తికి ప్రతీకలు (మహిళ) - 29
మానవ మనుగడకే సవాలా? (గళమెత్తిన గతం) - 30
అలంకార ప్రాయం.. ఆరోగ్య కార్డులు (తెలంగాణ) - 32
గజరాజుల నియంత్రణకు 'కుంకీలు' (ఆంధ్రప్రదేశ్) - 34
యువ తపస్వి! (యువవాణి) - 36
భారత క్రికెట్‌కు 'హాల్ ఆఫ్ ఫేమ్' ఖ్యాతి! (క్రీడ) - 43
నిరాశపరచిన 'జన నాయకుడు' (సినిమా) - 50

విద్యార్థుల న్యాయమైన సమస్యలను ఆలకించడం ప్రభుత్వ బాధ్యత. అయితే అదే సమయంలో ఆందోళనను హింస, వదంతులు, అధికారం కోసం జరిగే పోరాటంగా మార్చే ప్రయత్నాలను గుర్తించడం కూడా అంతే అవసరం. ఒక పరీక్ష విశ్వసనీయత అనేది కేవలం ఒక అభ్యర్థి ఫలితానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. అది ప్రతిభ, సమాన అవకాశాలు, ప్రభుత్వ సంస్థల ప్రతిష్ట, దేశ భవిష్యత్తు మానవ వనరులతో ముడిపడి ఉన్న ఒక విస్తృతమైన జాతీయ అంశం. ప్రస్తుత విద్యార్థి ఉద్యమం వెనుక ఉన్న ప్రధాన సమస్య వాస్తవమైనది. వాస్తవికతపై ఆధారపడి ఉంది. పరీక్షల సమగ్రత, ఫలితాల విశ్వసనీయత, డిగ్రీల ప్రామాణికత, నియామక ప్రక్రియలలోని నిష్పాక్షికత ఒక యువతి లేదా యువకుడి జీవితాన్ని నిర్ణయిస్తాయి అనడంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ఆ క్రమంలో పరీక్షల సంస్కరణల కమిటీ ఏర్పాటు, పర్యవేక్షణ యంత్రాంగాలు, వేగవంతమైన విచారణ కోర్టుల ఏర్పాటు వంటి కీలక చర్యలను ప్రభుత్వం చేపట్టింది. అయితే నిర్ణయాత్మక చర్యల అమలులో జాప్యం కారణంగా విద్యార్థులలో నెలకొన్న అసంతృప్తి దేశం నలుచెరుగులా విస్తరించడానికి అవకాశం ఏర్పడింది. మరోవైపు రాజకీయ పార్టీలు, భావజాల ఆధారిత సమూహాలు ,సోషల్ మీడియా నెట్‌వర్క్‌లు విద్యార్థుల నిజమైన అసంతృప్తిని తమ విస్తృత అధికార పోరాటాలతో ముడిపెట్టడానికి ప్రయత్నించాయి. ఇంతటి భావోద్వేగపూరితమైన వాతావరణం నుంచి పుట్టుకొచ్చిన అద్వితీయమైన యువశక్తిని సంస్కరణలు, చర్చలు, వ్యవస్థాగత పరిష్కారాల దిశగా మళ్లించవలసిన బాధ్యత ప్రస్తుతం ప్రభుత్వం, నిరసన తెలుపుతున్న యువత, జాతీయ పౌర సమాజ సంస్థలు అనే ఈ మూడింటిపైన ఉంది.

దేశానికి పరీక్షాసమయం!

"పేపర్ లీక్ అనేది ఒక సాధారణమైన విషయం కాదు. అది లక్షలాది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అత్యంత బాధాకరమైనది. ఆ కారణంగానే రెండున్నర నెలలుగా అనేక చర్యలు చేపట్టాము. నిందితులను అదుపులోకి తీసుకున్నాము. ప్రస్తుతం వారు చెరసాలలో ఉన్నారు. విద్యార్థులు వారి విలువైన సమయాన్ని నష్టపోకుండా చూడటం మా బాధ్యత. అందుకనే అతి తక్కువ కాలంలోనే 22 లక్షలమంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించాము. ఫలితాలు కూడా వచ్చాయి. అలాగని మేం దీనితో సంబరపడిపోయేవారము కాము. ఆ కారణంగానే ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ఆదేశించాం"

నా యువ మిత్రులారా,

నాలుగు దశాబ్దాలకు పైగా విద్యార్థులు, బోధన, విద్యా సంస్కరణల కోసం నన్ను నేను అంకితం చేసుకున్నాను. ఒక బలమైన, సమ్మిళితమైన, దూరదృష్టితో కూడిన విద్యా వ్యవస్థే ఒక బలమైన దేశానికి పునాది అని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను.

దేశ యువత ఆశయాలు, భావోద్వేగాలు, న్యాయమైన ఆకాంక్షలను నేను ఎంతగానో గౌరవిస్తాను. భారత యువత కలలను సాకారం చేయడం అనేది మా రాజకీయ, సామాజిక జీవితాల్లో ఒక నైతిక బాధ్యతగా ఉంటూ వచ్చింది. గౌరవనీయులైన ప్రధానమంత్రి గారి దూరదృష్టితో కూడిన నాయకత్వంలో దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అయితే, మే 3, 2026న జరిగిన నీట్ పరీక్షకు సంబంధించి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయాన్ని వెంటనే పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, దీనిపై దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. పరీక్షను రద్దు చేయడంతో పాటు పునఃపరీక్ష తేదీని కూడా ప్రకటించింది. అంతేకాకుండా, వచ్చే ఏడాది నుండి ఈ పరీక్షను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలని నిర్ణయించింది.

ఈ యావత్ ప్రక్రియలో 20 లక్షల మందికి పైగా విద్యార్థులకు పరీక్షను సజావుగా నిర్వహించడమే మా ప్రధాన ప్రాధాన్యతగా ఉన్నది. దీనిని సాధించడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా జిల్లా యంత్రాంగాలను కలుపుకొని ఒక సమగ్రమైన ప్రభుత్వ విధానాన్ని అనుసరించాము. చివరికి, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో జూన్ 21, 2026న పరీక్ష విజయవంతంగా ముగిసింది.

మొదటి రోజు నుంచే నేను ఈ వ్యవహారంలో బాధ్యత తీసుకున్నాను. అలా తీసుకున్న బాధ్యత నుంచి ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. 'పరీక్షల మాఫియా' వల్ల ఏ ప్రతిభావంతుడైన విద్యార్థి భవిష్యత్తు దెబ్బతినకూడదని, అలాగే ఏ విద్యార్థికి అన్యాయం జరగకూడదనే ఒక దృఢమైన నిశ్చయంతో నేను ఉన్నాను.

జూలై 16న ప్రకటించిన నీట్ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. వెనుకబడిన వర్గాలకు చెందిన అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా ఇందులో విజయం సాధించారు.

అయితే, ఈ కాలంలో కూడా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న కొందరు వ్యక్తులు అనేకమంది విద్యార్థులను తప్పుదోవ పట్టించేలా అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించారు. ఇది నాలో తీవ్ర ఆవేదనకు కారణమైంది.

మన ప్రజాస్వామ్య శక్తిపై నాకు ఎల్లప్పుడూ అచంచలమైన విశ్వాసం ఉంది. అలాగే యువత ఆశయాలు, కలలు ఆకాంక్షల పట్ల నాకు ప్రగాఢమైన గౌరవం ఉంది. వారు కేవలం భారతదేశ భవిష్యత్తు మాత్రమే కాదు. వారు నవ, వికసిత భారత్‌కు దిక్సూచులు, నిర్మాతలు, రూపకర్తలు కూడా.

గత పది రోజులుగా జరిగిన పరిణామాలు నన్ను బాధించాయి. ఇది నాకు వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదు.

భారతదేశ యువశక్తే దేశానికి నిజమైన బలం.

దేశ యువత గందరగోళ వలయంలో చిక్కుకుపోకుండా చూడాలన్నది నా సంకల్పం.

జంతర్ మంతర్ వద్ద, దేశవ్యాప్తంగా తలెత్తిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, దేశ వ్యతిరేక శక్తులు దీనిని తమకు అనుకూలంగా మలుచుకోకుండా అడ్డుకోవడం, జాతీయ సమైక్యతను కాపాడటం, ఏ ఒక్క భారతీయ విద్యార్థి భవిష్యత్తు కూడా చట్టపరమైన చిక్కుల్లో పడకుండా చూడటం, అలాగే మన పిల్లలు తమ సమయాన్ని చదువులకు కేటాయించి కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి సారించేలా చేయడం వంటి లక్ష్యాలతో నేను గౌరవనీయులైన ప్రధానమంత్రికి నా రాజీనామాను సమర్పించాను.

గౌరవనీయులైన ప్రధానమంత్రిగారి మార్గదర్శకత్వం, విశ్వాసం, నిరంతర మద్దతుకు వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే, మంత్రివర్గంలోని నా సహచరులు, మంత్రిత్వ శాఖ అధికారులు, సిబ్బందికి, నాతో కలిసి పనిచేసిన వారందరికీ నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా జీవితంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా దేశ సేవ ఉంది. దీనిపట్ల నేను ఎల్లప్పుడూ అంకిత భావంతో ఉంటాను.

జగన్నాథ స్వామి ఆశీస్సులతో, భారతమాత, ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడానికి అన్ని విధాలుగా నన్ను నేను అంకితం చేసుకుంటూనే ఉంటాను.

మీ,

ధర్మేంద్ర ప్రధాన్

ప్రజాస్వామ్యంలో అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, విధానాలను విమర్శించడం, తమ డిమాండ్లను శాంతియుతంగా తెలియజేయడం వంటి రాజ్యాంగబద్ధమైన హక్కులు పౌరులకు ఉన్నాయి. ప్రజాస్వామ్య సమాజంలో విద్యార్థి ఉద్యమాలు అత్యంత సహజమైన వ్యక్తీకరణలలో ఒకటిగా వర్ధిల్లుతున్నాయి. ఎందుకంటే, తమ జీవితాలను తీర్చిదిద్దే వ్యవస్థలలోని లోపాలను అందరికంటే ముందుగా యువతకు అనుభవంలోకి వస్తుంది. వాటి దుష్ప్రభావానికి పెను బాధితులుగా నిలిచేది యువతే. ప్రస్తుత ఉద్యమాన్ని కేవలం ప్రభుత్వంపై వ్యతిరేకత గానో లేదా సోషల్ మీడియా కారణంగా తలెత్తిన తాత్కాలిక అసంతృప్తిగానో కొట్టిపారేయడం పెద్ద పొరపాటు అవుతుంది. దీని మూలాల్లో పరీక్షల

విశ్వసనీయత, ఫలితాల్లో ఆరోపిత అక్రమాలు, నియామక ప్రక్రియల్లో పారదర్శకత, నిరుద్యోగం, విద్యావ్యవస్థలో జవాబుదారీతనం వంటి కీలకమైన అంశాలు ఉన్నాయి. విద్యాసంస్కరణలు, నీట్ ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరుద్యోగానికి సంబంధించిన ఆందోళనలతో ఈ ఉద్యమం ప్రారంభమైనప్పటికీ కాలక్రమేణా దీనికి రాజకీయ డిమాండ్లు, ఇతర అంశాలు కూడా జతకూడాయి.

పరీక్షాపత్రం లీక్ అయినప్పుడు, దానివల్ల కలిగే నష్టం కేవలం ఆ రోజు పరీక్ష రాసే అభ్యర్థులకే పరిమితం కాదు. విద్యార్థి వెచ్చించిన సమయం, కుటుంబం కడుపు కట్టుకొని మరీ పైసా పైసా పొదుపు చేసి కూడబెట్టిన సొమ్ము, కోచింగ్ కోసం ఖర్చు చేసిన డబ్బు, వయోపరిమితి అర్హత ,మానసిక శ్రమ.. ఇలా ఇవన్నీ ఒకేసారి దెబ్బతింటాయి. అనేక పోటీ పరీక్షలకు పరిమిత సంఖ్యలోనే ప్రయత్న అవకాశాలు ఉంటాయి. కాబట్టి, పరీక్ష రద్దు కావడం లేదా ఏళ్ల తరబడి న్యాయపరమైన వివాదాల్లో చిక్కుకుపోవడం అనేది ఒక అభ్యర్థి జీవితంలో ఒక పూర్తి అవకాశాన్ని కోల్పోవడంతో సమానం.

అదేవిధంగా, నకిలీ డిగ్రీ అనేది కేవలం పత్రపరమైన నేరం మాత్రమే కాదు. నకిలీ సర్టిఫికేట్ ఆధారంగా ఉద్యోగం సంపాదించిన వ్యక్తి, చట్టబద్ధమైన చదువు, శిక్షణ, పరీక్ష ప్రక్రియలను పూర్తి చేసిన అర్హతగల అభ్యర్థి హక్కులను హరిస్తాడు. ఒకవేళ అర్హత లేని వ్యక్తి డాక్టర్, ఉపాధ్యాయుడు, ఇంజనీర్, న్యాయవాది, పాత్రికేయుడు లేదా సాంకేతిక నిపుణుడు వంటి వృత్తిలోకి ప్రవేశిస్తే, ఆ ప్రమాదం కేవలం ఉపాధి వ్యవస్థకే పరిమితం కాదు. అది ప్రజారోగ్యం, న్యాయం, విద్య, మౌలిక సదుపాయాలు, పరిపాలన చివరికి సామాజిక విశ్వాసంపై కూడా ప్రభావం చూపుతుంది. కాబట్టి, పరీక్షా విధానం విశ్వసనీయతను కేవలం విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఒక చిన్న అంశంగా పరిగణించలేము. ఇది సమాన అవకాశాల రాజ్యాంగ సూత్రం, పరిపాలనాపరమైన చిత్తశుద్ధి, దేశ నైపుణ్య సామర్థ్యానికి సంబంధించిన విషయం. పరీక్షావ్యవస్థపై నమ్మకం సన్నగిల్లిన దేశంలో ప్రతిభావంతులు నిరాశకు గురవుతారు. అవినీతికర శక్తులు బలపడతాయి .సంస్థల పట్ల సామాజిక విశ్వసనీయత తగ్గుతుంది.

చర్చలతోనే పరిష్కారం

జూలై 24న ప్రభుత్వం, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) మధ్య చర్చలు జరిగాయి. ఈ సమావేశం అనంతరం, రాజీనామాల డిమాండ్‌పై స్పందించేందుకు ప్రభుత్వం జూలై 25 మధ్యాహ్నం వరకు సమయం కోరిందని సీజేపీ తెలిపింది. ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థుల కుటుంబాలకు పరిహారం అందించడం, విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, న్యాయపరమైన కేసులను ఉప సంహరించుకోవడం అనే రెండు డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించింది. సీజేపీతో సమావేశం దాదాపు రెండు గంటలపాటు కొనసాగిందని ప్రభుత్వం తెలిపింది. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. పరీక్షల సంస్కరణలకు సంబంధించి వారు మూడు ప్రధాన డిమాండ్లను, ఐదు సూచనలను సమర్పించారు. చర్చల ఫలితాలను వారికి తెలియజేయడానికి మళ్లీ సమావేశమవుతామని వారికి చెప్పాము అని ప్రభుత్వం వెల్లడించింది. దీనికి ముందు ఎక్కడ చర్చలు జరపాలనే విషయమై వివాదం నెలకొంది. సామాజిక రంగ నిపుణుల ప్రకారం ప్రభుత్వం చర్చల ప్రక్రియను ప్రతిష్టాత్మక అంశంగా మార్చుకోకూడదు. అదే సమయంలో, చర్చలు ఎక్కడ జరగాలనే దానిపై తలెత్తే చిన్నపాటి వివాదాలు అసలు చర్చలకు ఆటంకం కలిగించకుండా ఉద్యమ నాయకత్వం చూసుకోవాలి. సమస్యకు పరిష్కారం చర్చల వేదికపైనే లభిస్తుంది. ఆ పరిష్కారం కోసం ఒత్తిడిని పెంచడానికి మాత్రమే వీధి పోరాటాలు ఉపయోగపడతాయి.

పరస్పర అంగీకారంతోనే ప్రయోజనం

విద్యార్థుల అసంతృప్తికి ఒక వాస్తవమైన కారణం ఉందని అంగీకరించడానికి ప్రభుత్వ మద్దతుదారులు వెనుకాడకూడదు. అదేవిధంగా, ఒక నిజమైన సమస్య ఉందన్నంత మాత్రాన ఆ ఉద్యమానికి సంబంధించిన ప్రతి వాదన, వ్యక్తి, నినాదం లేదా రాజకీయ వ్యూహం సరైనవిగా ఉంటాయని అనుకోవడానికి వీలులేదనే విషయాన్ని ఉద్యమ మద్దతుదారులు కూడా అంగీకరించాలి. ఈ రెండు వాస్తవాలను గుర్తించడంలోనే జాతీయ ప్రయోజనాలకు అనుగుణమైన సమతుల్య దృక్పథం ఇమిడి ఉంది. పరీక్షలో అవకతవకలు జరిగితే, జవాబుదారీతనాన్ని నిర్ధారించాలి. పోలీసులు ఎక్కడైనా మితిమీరిన బలప్రయోగం చేస్తే ఆ విషయంపై నిష్పాక్షిక విచారణ జరపాలి. అదేవిధంగా నిరసనకారులు బారికేడ్లను ఛేదించినా, పోలీసు సిబ్బందిపై గానీ, పాత్రికేయులపై గానీ దాడి చేసినా, లేదా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా, అటువంటి చర్యలను కేవలం విద్యార్థుల అశాంతి అని ముద్ర వేసి సమర్థించలేము.

జూలై 20న ఢిల్లీలో పార్లమెంటు దిశగా నిరసన కారులు సాగిన తీరు ఈ సంక్లిష్టతకు ఒక ఉదాహరణగా నిలిచింది. నిరసనకారులు పార్లమెంటు వైపు ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు, భాష్పవాయుగోళాలు, లాఠీలు ఉపయోగించారు. దీంతో హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. నిరసనకారులు, పోలీసు సిబ్బంది, ఇతరులు సహా పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే రాజకీయ వాతావరణం నెలకొన్న

ప్రస్తుత పరిస్థితుల్లో, ఈ ఘటనలకు సంబంధించి తుది, నిష్పాక్షిక నిర్ణయం అనేది కేవలం కొన్ని ఎంపిక చేసిన వీడియో క్లిప్‌లు లేదా రాజకీయ ప్రకటనల ఆధారంగా కాకుండా, సమగ్ర విచారణ ఆధారంగా జరగాలి. ఉద్యమ ప్రతినిధులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్న సమయంలోనే, గుంపులోని ఒక వర్గం పార్లమెంట్ వైపు కదలడంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది.రాళ్ల దాడి, పాత్రికేయులపై దాడులు, పోలీసు చర్యల మధ్య, అసంపూర్ణమైన లేదా స్వప్రయోజనపూరితమైన సోషల్ మీడియా కథనాలు పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేశాయి. పోలీసు రికార్డులు, వైద్య నివేదికలు, ఎఫ్ఐఆర్‌లు, స్వతంత్ర వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల వివరాలతో ఈ వాదన లను సరిచూసుకోవడం ఇప్పటికీ అత్యవసరమే.

విద్యార్థుల ఆవేదనను గౌరవిస్తూనే, దానికి ఒక స్పష్టమైన లక్ష్మణ రేఖ ఉండాలనేది తల్లిదండ్రుల అభిప్రాయంగా వినిపిస్తున్నది. శాంతియుత నిరసన అనేది ప్రజాస్వామ్య హక్కు. కానీ హింస వల్ల ఉద్యమ నైతిక బలం పెరగదు. అలాగని ప్రభుత్వ బాధ్యతను కూడా అది ఏమాత్రం తగ్గించదు. అంతిమంగా, హింస అసలు సమస్యను పక్కన పెడుతుంది. పరిష్కారం కంటే ఘర్షణకే ప్రాధాన్యత నిచ్చే రాజకీయ శక్తులను తెరపైకి తెస్తుంది.

పార్లమెంట్‌కు వీధులు ప్రత్యామ్నాయం కాదు

ఈ ఉద్యమ నేపథ్యంలో, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ చేసిన ఒక వ్యాఖ్య ప్రత్యేకంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆయన చేసిన ఈ వ్యాఖ్యను అరాచకవాద ప్రకటనగా పరిగణించాలి. "ఇకపై ఈ దేశంలో ప్రజాస్వామ్యం భవిష్యత్తును పార్లమెంటు నిర్ణయించదు, అది వీధులే నిర్ణయిస్తాయి. దీనిని ఎన్నికలు కాకుండా ప్రతిఘటన నిర్ణయిస్తుంది. జూలై 20న మనం దానిని కొంతమేర చూశాము" అని ఆయన అన్నారు. రానున్న కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాట వేదిక పార్లమెంటు కాకుండా వీధులే అవుతాయని యోగేంద్ర యాదవ్ గతంలో రాశారు. ఆ వ్యాసంలో ఆయన సంస్కృతి, రాజ్యాంగ విలువల కోసం సాగే పోరాటాన్ని కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ పోరాటం పార్ల మెంటు, వీధుల పరిధిని దాటి విస్తరించి ఉంటుందని అభిప్రాయపడ్డారు. సందర్భం ఏదైనప్పటికీ, పార్లమెంటుకు, వీధులకు మధ్య ఉన్న సంబంధం గురించి తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో వీధులకు ఒక స్థానం ఉంది. స్వాతంత్ర్యం కోసం, అవినీతికి వ్యతిరేకంగా, రైతులు, కార్మికుల హక్కుల కోసం, సామాజిక సంస్కరణల కోసం జరిగిన ఉద్యమాలన్నీ ప్రజా ఒత్తిడి వల్లే వీధుల్లో ముందుకు సాగాయి. అయితే, వీధులు పార్లమెంటుకు ప్రత్యామ్నాయం కాదనే విషయాన్ని మనం ఇక్కడ గమనంలోకి తీసుకోవాలి. సార్వత్రిక వయోజన ఓటు హక్కు ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధుల రాజ్యాంగబద్ధమైన వేదిక పార్లమెంటు. వీధుల్లో ఎంత పెద్ద జనసమూహం గుమిగూడినా, అది దేశంలోని మొత్తం ఓటర్ల స్థానాన్ని భర్తీ చేయలేదు. నిరసనలు ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకురాగలవు. ప్రజాభిప్రాయాన్ని మార్చగలవు. విధానాల పునఃపరిశీలనకు దారితీయగలవు. పార్లమెంటులో చర్చ జరిగేలా చేయగలవు.అయితే, చట్టాలను రూపొందించడం, ప్రభుత్వాలను కూలదోయడం లేదా రాజ్యాంగ బద్ధమైన సంస్థలను నిర్వీర్యం చేయడం వంటి అధికారాలను వీధి పోరాటం పొందలేదు. అత్యధిక జనసందోహాన్ని సమీకరించి, తీవ్రమైన ఒత్తిడిని ప్రయోగించే సమూహమే ప్రజాస్వామ్య చట్టబద్ధతకు అసలైన మూలం అనే సూత్రాన్ని గనుక అంగీకరిస్తే, ప్రతి ఎన్నికల తర్వాత ఓడిపోయిన పక్షం వీధుల్లో 'రెండవ ఎన్నిక'ను నిర్వహించడం మొదలుపెడు తుంది. అప్పుడు ప్రజాస్వామ్యం అనేది చర్చలు, ఓటు ద్వారా కాకుండా, దిగ్బంధనాలు, ముట్టడి సంఖ్యా పరమైన బల ప్రదర్శనల ద్వారా నడిచే పరిస్థితి ఏర్పడుతుంది. యువత ఈ వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాలి. రాజ్యాంగం వారికి నిరసన తెలిపే హక్కును కల్పిస్తుంది. అదే సమయంలో, వ్యవస్థ పట్ల పూర్తి అపనమ్మకాన్ని కలిగించే రాజకీయ ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, యువత హక్కులకు అదే రాజ్యాంగం, సంబంధిత సంస్థలు రక్షణ కల్పిస్తాయి. వ్యవస్థలో సంస్కరణలు కోరడం, ఆ వ్యవస్థనే పూర్తిగా చట్టవిరుద్ధమని ప్రకటించడం.. ఈ రెండూ కూడా భిన్నమైన రాజకీయ వైఖరులనే విషయాన్ని యువత అవగతం చేసుకోవాలి. ఒక ఉద్యమం లక్ష్యం ఒక సంస్థను జవాబుదారీగా మార్చడమే కానీ, దానిని నాశనం చేయడం కాదని రచయిత డాక్టర్ ఆనంద్ సింగ్ రాణా పేర్కొన్నారు. పార్లమెంటరీ చర్చ, వీధుల్లోని ప్రజా ఒత్తిడి పరస్పర ఆధారితాలుగా ఉండగలవు. అదే ఆ రెండూ నువ్వా.. నేనా? అంటూ ఒకదానికి ఒకటి వ్యతిరేకంగా నిలబెడితే అలాంటి విపరిణామం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందే తప్ప ఎవరికీ ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చదు.

ఎన్‌టీఏ నిర్మాణాత్మక బలహీనత

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాటు ఒక అవసరమైన సంస్కరణే అయినప్పటికీ, ఒక సంస్థ ఉపయోగం దాని పేరు మీద కాకుండా దాని సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటుంది. జూలై, 2026లో రాజ్యసభకు సమర్పించిన సమాచారం ప్రకారం, ఆవిర్భావించిన నాటి నుంచి 270కు పైగా పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహించింది. 6.6 కోట్లకు పైగా అభ్యర్థుల నమోదు ప్రక్రియను చేపట్టింది. అయినప్పటికీ, ఆ సంస్థలో శాశ్వత అధికారులు 24 మంది మాత్రమే ఉన్నారు. ఆ సంస్థ 197 మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్స్ సిబ్బందిపై ఆధారపడింది. ఈ నిష్పత్తి తీవ్రమైన సమీక్షకు అర్హమైనది. లక్షలాది మంది అభ్యర్థులు, వేలాది కేంద్రాలు, కీలకమైన ప్రశ్నపత్రాలు, డేటా భద్రత, సైబర్ నిఘా, సేవా ప్రదాతలతో కూడిన ఒక విస్తారమైన నెట్‌వర్క్‌ను ఇంత పరిమితమైన శాశ్వత సిబ్బందితో నిర్వహించడం సంస్థాగత ప్రమాదాన్ని సృష్టిస్తుంది. అవుట్‌సోర్సింగ్ స్వతహాగా తప్పు కాదు. అయితే, ఒక రహస్య పరిశీలన ప్రక్రియలో బాధ్యతల గొలుసు ఎంత పొడవుగా ఉంటే, సమాచార లీకేజీలు, కుమ్మక్కు, సాంకేతిక లోపాలు, జవాబుదారీతనం నుండి తప్పించుకునే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి. అందువల్ల, ఎన్‌టీఏ చేపట్టే సంస్కరణలు కేవలం కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయడం లేదా అదనపు సీసీటీవీ కెమెరాలను అమర్చడానికి మాత్రమే పరిమితం కాకూడదు. దీనికి శాశ్వత పరీక్షా భద్రతా విభాగం, సైబర్ ఫోరెన్సిక్స్ విభాగం, అంతర్గత నిఘా వ్యవస్థ, ప్రశ్నపత్రాల ముద్రణకు సురక్షితమైన విధానం, సేవా ప్రదాతల ఆడిటింగ్, డేటా లాగ్ భద్రపరచడం, రాష్ట్ర పోలీసులతో శాశ్వత సమన్వయం అవసరం. అలాగే, ప్రతి ప్రధాన పరీక్ష తర్వాత భద్రతా ఆడిట్‌లు, ఫలితాలకు సంబంధించిన నివేదికలను ప్రజాబాహుళ్యంలో ఉంచాలి.

ఒక వ్యాఖ్యతో మొదలు

'కా'క్రోచ్ జనతా పార్టీ' పేరుతో ఆవిర్భవించిన ఉద్యమానికి సుప్రీంకోర్టులో చేసిన ఒక మౌఖిక వ్యాఖ్యే తక్షణ ప్రేరకంగా నిలిచింది. మీడియాలో వచ్చిన వార్తలు, సోషల్ మీడియా పోస్టులు ఈ వ్యాఖ్యను నిరుద్యోగ యువతను ఉద్దేశించినదిగా విస్తృతంగా అన్వయించాయి. సహజంగానే, ఇది తీవ్రమైన ప్రతిచర్యను రేకెత్తించింది. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఉపయోగించిన భాషను యువత అవమానకరంగా భావిస్తే, దానిపై సున్నితమైన సమీక్ష జరగాలి. ఈ వివాదానికి మరో కోణం కూడా ఉంది. మే 16న తన వ్యాఖ్యలు దేశంలోని సాధారణ నిరుద్యోగ యువతను లేదా విద్యార్థులను ఉద్దేశించినవి కావని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. నకిలీ లేదా బూటకపు డిగ్రీల ఆధారంగా న్యాయవాద, పాత్రికేయ లేదా ఇతర వృత్తులలోకి ప్రవేశించి వ్యవస్థను దుర్వినియోగం చేసే వ్యక్తులపైనే ఆ విమర్శలు చేశానని పేర్కొన్నారు. యువతను 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం)కు పునాదిగా అభివర్ణించారు. మీడియాలో తన వ్యాఖ్యలను అసంపూర్ణంగా ప్రస్తావించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ పదవులలో ఉన్న వ్యక్తులు పలికే మాటలు సమాజంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి, ఈ వివరణ వివాదాన్ని పూర్తిగా పరిష్కరించదు. అయినప్పటికీ, అసలు వ్యాఖ్య, దాని సందర్భం, తదనంతర వివరణ అన్నీ కూడా నిష్పాక్షికమైన చర్చలో ప్రస్తావనకు నోచుకోవాలి. నిజమైన అర్హతలు కలిగిన యువతకు సంబంధించి ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం ఉంది. నకిలీ డిగ్రీల ఆధారంగా వృత్తిలోకి ప్రవేశించిన వారిపై విచారణ జరిపితే, నిజమైన పరీక్షలో ఉత్తీర్ణులై, సరైన శిక్షణ పొంది, కఠిన శ్రమతో అర్హతలు సాధించిన వ్యక్తే ప్రధానంగా లబ్ధి పొందుతారు. అందువల్ల, అభ్యంతరకరమైన భాషపై విమర్శలు సమంజసమే అయినప్పటికీ, నకిలీ డిగ్రీలు, బూటకపు ధృవపత్రాలపై జరుగుతున్న విచారణను వ్యతిరేకించడం మాత్రం యువత ప్రయోజనాలకు అనుకూలమైన చర్యగా పరిగణించలేము. ఒక నిర్దిష్ట వ్యాఖ్య పట్ల కలిగే ఆగ్రహం కారణంగా, అర్హులైన, కష్టపడి పనిచేసే యువతకు మేలు చేసే సంస్కరణలనే వ్యతిరేకించే పరిస్థితి రాకుండా యువజన ఉద్యమం జాగ్రత్త వహించాలని ఢిల్లీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వివేకానంద పేర్కొన్నారు. భాషలో హుందాతనాన్ని పాటించాలని కోరుతూనే, అదే సమయంలో మోసపూరిత అర్హతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం సాధ్యమేనని అన్నారు.



డిజిటల్ పోరాటం

ప్రస్తుత ఉద్యమంలో గణనీయమైన భాగం సోషల్ మీడియా ద్వారా రూపుదిద్దుకుని ముందుకు సాగింది. ఇది వేగంగా పరస్పరం అనుసంధానం కావడానికి, తమ సమస్యలను పంచుకోవడానికి, జాతీయ స్థాయిలో దృష్టిని ఆకర్షించడానికి యువతకు ఒక అవకాశాన్ని కల్పించింది. ఈ సాంకేతికత ఉద్యమం ఒక బలంగా మారినప్పటికీ, అదే సమయంలో తప్పుడు సమాచారం, ఎడిట్ చేసిన వీడియోలు, రెచ్చగొట్టే కంటెంట్‌కు సంబంధించిన ముప్పును కూడా ఇది పెంచిపోషించింది. అనుమానాస్పద మరణాలు, జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) ప్రయోగం, నిర్బంధంలో ఉన్న వేలాది మంది విద్యార్థులకు ఆహారం, నీరు నిరాకరించడం, అలాగే పోలీసు చర్యలకు సంబంధించి సోషల్ మీడియాలో వివిధ వదంతులు వ్యాపించాయి. వీటిలో కొన్నింటిని అవాస్తవమని ఢిల్లీ పోలీసులు కొట్టిపారేశారు. సంబంధిత పోస్ట్‌లను తొలగించారు. ధృవీకరణ లేకుండా ప్రచారంలోకి వచ్చిన రాజకీయ పోస్టులను కూడా సాక్ష్యంగా పరిగణించలేము. అరెస్టులు, విడుదలకు సంబంధించిన గణాంకాలు, గాయపడిన వారి అధికారిక వివరాలు, నమోదైన ఎఫ్ఐఆర్‌లు, ఆసుపత్రుల స్థితిగతులను ప్రభుత్వం సకాలంలో బహిరంగపరచాలి. సమాచార శూన్యతే పుకార్లకు అత్యంత సారవంతమైన నేల అవుతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు.

విదేశీ జోక్యం.. జాతీయ భద్రతకు ముప్పు

నిరసనల సమయంలో సంభవించిన మరణం కారణంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోందనే నకిలీ సమాచారం లేదా హింస కోసం ముందుగా పన్నిన ప్రణాళికను సూచిస్తున్న కొన్ని వాట్సాప్ చాట్‌లను, లోతైన విశ్లేషణ లేకుండా పూర్తిగా కొట్టిపారేయడం సరికాదు. పరికరాలు, ఫోన్‌లు, మెటాడేటా, గ్రూప్ నిర్వాహకులు, సందేశాల టైమ్‌స్టాంప్‌లు, పంపినవారి గుర్తింపునకు సంబంధించిన ఫోరెన్సిక్ పరీక్ష అత్యవసరంగా జరపాలి. ఏది సరైనది, ఏది తప్పు అనేది కేవలం ఒక విచారణ మాత్రమే నిర్ధారించగలదు. నిజమైన నేరపూరిత సంభాషణలను కేవలం రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం, వాటిని పరిగణనలోకి తీసుకోకపోవడం పెను ముప్పులకు దారితీయవచ్చు.విదేశీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా తప్పుదోవ పట్టించే కంటెంట్ వ్యాప్తి చెందుతోందని ఢిల్లీ పోలీసులు ఆరోపించారు. ఈ ఆరోపణను అంతర్జాతీయ మీడియాలో కూడా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, విదేశీ జోక్యం ఆరోపణలపై ఖాతా వివరాలు, డిజిటల్ ఫోరెన్సిక్స్, సమన్వయ ప్రవర్తనకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలి. డిజిటల్ రంగంలోని అంతర్గత అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవడానికి భారత వ్యతిరేక శక్తులు ప్రయత్నించవచ్చు. ఇది జాతీయ భద్రతకు ముప్పును కలిగిస్తుంది.

న్యాయవ్యవస్థ వర్సెస్ యువత కారాదు

జూలై 20న పోలీసు చర్య నేపథ్యంలో, సుప్రీంకోర్టు తక్షణ జోక్యాన్ని కోరుతూ కోర్టులో ఒక సాధారణ పిటిషన్ దాఖలైందని, దానిని విచారించడానికి ప్రధాన న్యాయమూర్తి నిరాకరించారనే మీడియా కథనాలు విస్తృతంగా వ్యాపించాయి. జూలై 24న, ఈ కథనాలను తప్పుగా న్యాయస్థానంలో ప్రధానన్యాయమూర్తి పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ప్రకారం ఎటువంటి అధికారిక రిట్ పిటిషన్ దాఖలు కాలేదు. కేవలం లేఖ రూపంలో సమర్పించిన విన్నపం గురించి ఒక న్యాయవాది మౌఖికంగా ప్రస్తావించారు. ఒక వీడియోను పరిశీలించి, ఈ అంశంపై తక్షణమే విచారణకు చేపట్టాలని కోర్టును అభ్యర్థించారు. అధికారిక పిటిషన్, అవసరమైన చట్టపరమైన ప్రక్రియ లేకుండా ఒక లేఖను సుమోటో రిట్ పిటిషన్‌గా పరిగణించలేమని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సంఘటనపై వచ్చిన వార్తలను బాధ్యతారహితమైనవిగా తప్పుదోవ పట్టించేవిగా అభివర్ణించారు. ఈలోగా, పోలీసు చర్యను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఖండించింది. న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేసింది. విద్యార్థులు, యువతపై మితిమీరిన బలప్రయోగం జరిగిందన్న ఆరోపణలపై సుప్రీం కోర్టు అడ్వకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనలను కేవలం "న్యాయ వ్యవస్థ వర్సెస్ యువత" అనే సరళమైన విభజనకు పరిమితం చేయకూడదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది యోగేష్ దహియా పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో కూడా దీనిపై భిన్నమైన సంస్థాగత స్పందనలు వ్యక్తమయ్యాయి. ఒకవైపు చట్టపరమైన ప్రక్రియకు సంబంధించిన అంశం ఉంటే, మరోవైపు పోలీసు చర్యల సమంజసత (proportionality), పౌర హక్కులకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో, ఈ రెండింటిపైనా స్వతంత్ర పరిశీలన సాధ్యమే అనే వాస్తవాన్ని గమనంలోకి తీసుకోవాలి.

జూలై 20

దేశ చరిత్రలో దుర్దినం

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన జూలై 20న సీజేపీ నిర్వహించిన చలో సంసద్ మార్చ్ దేశరాజధాని నడిబొడ్డున హింసాత్మకంగా మారింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ నిరసనకారులు పార్లమెంటు వైపు కదలడానికి ప్రయత్నించి భద్రతాసిబ్బందితో ఘర్షణకు దిగారు. ఈ సంఘటనలో 118 మందికి పైగా పోలీసు, పారామిలటరీ సిబ్బంది గాయపడగా సుమారు 60 మంది నిరసనకారులు కూడా గాయపడ్డారు. పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన జరిగింది. ఇది పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజున జరగడంతో దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ పోలీసుల ప్రకారం వేలాది మంది నిరసనకారులు జంతర్ మంతర్ వద్ద గుమిగూడి పార్లమెంటు వైపు రావడానికి ప్రయత్నించారు. భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 163 అమలులో ఉన్నప్పటికీ, మార్చ్‌కు అనుమతి లేనప్పటికీ ఇలా జరిగింది.

పార్లమెంటు స్ట్రీట్, పటేల్ చౌక్, కాన్స్టిట్యూషన్ క్లబ్, శాస్త్రి భవన్ వంటి పటిష్టమైన భద్రతను సంతరించుకున్న ప్రాంతాల చుట్టూ ఏర్పాటు చేసిన బహుళ అంచెల బారికేడ్లను పదేపదే దాటడానికి నిరసనకారులు ప్రయత్నించారు. కొందరు రాళ్లు విసరడం, భద్రతా సిబ్బందిపై దాడి చేయడం వంటి చర్యలకు పాల్పడినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. దీంతో పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు. ఘర్షణలు అనేక గంటలపాటు కొనసాగాయి.

సామాజిక మాధ్యమాల్లో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చూపించే వీడియోలు వ్యాప్తి చెందాయి. వాటి ప్రామాణికతను పరిశీలిస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

ఢిల్లీ పోలీసులు తర్వాత గాయపడినవారి సంఖ్యను సవరించి 118 మందికి పైగా పోలీసు, పారామిలటరీ సిబ్బంది గాయపడినట్లు తెలిపారు. వీరిలో స్పెషల్ కమిషనర్, జాయింట్ కమిషనర్, అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషన ర్, అడిషనల్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారులు ,మహిళా పోలీసు సిబ్బంది ఉన్నారు. షాంగ్రీలా హోటల్ సమీపంలో హింసాత్మక గుంపు పోలీసు వాహనంపై దాడి చేయడంతో ఒక మహిళా హెడ్ కాన్స్టేబుల్ గాయపడ్డారు. గాయపడిన 60 మంది నిరసనకారులను కూడా ఆసుపత్రులకు తరలించారు.

నిరసనకారులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీసులకు చెందిన రెండు బస్సుల అద్దాలు పగిలిపోయాయి. 15 నుంచి 20 ప్రభుత్వ వాహనాలు దెబ్బతిన్నాయి. జన్‌పథ్‌లో కొన్ని దుకాణాలు కూడా ధ్వంసమై పోయాయి.

70 మందికి పైగా నిరసనకారులను నిర్బంధించారు. పార్లమెంటు స్ట్రీట్ ,పటేల్ చౌక్, కాన్స్టిట్యూషన్ క్లబ్, శాస్త్రి భవన్ ప్రాంతాల నుంచి 100 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. వారిని వివిధ పోలీసుస్టేషన్లు తాత్కాలిక నిర్బంధ కేంద్రాలకు తరలించారు.

పార్లమెంటు వైపునకు నిరసనకారులు రాకుండా నివారించేందుకు దేశ రాజధానిలో అపూర్వమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 5000 మందికి పైగా

పోలీసు, పారామిలటరీ, రాపిడ్ రెస్పాన్స్ బలగాలను మోహరింపజేశారు. పార్లమెంటు, సెంట్రల్ విస్తా, జంతర్ మంతర్, కనాట్ ప్లేస్ వైపు వెళ్లే రోడ్లను మూసివేశారు. రాజీవ్ చౌక్, జన్‌పథ్, పటేల్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్ ,సేవా తీర్థ్ వంటి మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేశారు.

సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారాన్ని ఢిల్లీ పోలీసులు తిరస్కరించారు. పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి అంగ్మోపై దాడి జరిగినట్లు చేసిన ఆరోపణలను నిరాకరించారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను నిర్బంధించినట్లు చేసిన ప్రచారాలను కూడా తిరస్కరించారు. ఆయన నిరసన ప్రదేశంలోనే ఉన్నట్లు తెలిపారు. అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ ఘర్షణలు రాజకీయ అంశంగా మారాయి. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా నిరసనకారులపై బలప్రయోగాన్ని ఖండించారు. ప్రజాస్వామ్య నిరసనలను అణచివేస్తున్నారని వామపక్షాలు ఆరోపించాయి. నిరసనకారులు హింసాత్మకంగా మారి భద్రతా సిబ్బందిపై దాడి చేసి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసి, బారికేడ్లను దాటడానికి పదేపదే ప్రయత్నించిన తర్వాతే వారిపై చర్యలు తీసుకున్నామని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు.

పరీక్షలకు టాస్క్‌ఫోర్స్.. స్వాగతించిన ఏబీవీపీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో సమగ్ర సంస్కరణలను చేపట్టేందుకు బహుళ-విభాగాల ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) స్వాగతించింది. నీట్ సహా వివిధ పోటీ పరీక్షలలో చోటుచేసుకున్న అక్రమాల నేపథ్యంలో, దేశంలోని పరీక్షా విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం, విశ్వసనీయతను పెంపొందించేలా సంస్థాగత సంస్కరణలు చేపట్టాలని ఏబీవీపీ నిరంతరం డిమాండ్ చేస్తూ వచ్చింది. ఈ నిరంతర పోరాటంలో భాగంగా, పోటీ పరీక్షల విధానాన్ని సమగ్రంగా సమీక్షించి, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన నిర్మాణాత్మక సంస్కరణలను సూచించేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ఏబీవీపీ గట్టిగా కోరింది. కాబట్టి, విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఈ ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు ఒక ముఖ్యమైన, స్వాగతించదగిన నిర్ణయం అని ఏబీవీపీ పేర్కొంది. అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం మాత్రమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ఇంకా కఠినమైన చర్యలు చాలా అవసరమని ఏబీవీపీ విశ్వసిస్తోంది. సమర్థవంతమైన అమలుతో కూడిన సమగ్ర సంస్థాగత, నిర్మాణాత్మక, సాంకేతిక, పరిపాలనా సంస్కరణలు అవసరమని పేర్కొంది. ఇటీవలి నెలల్లో, పరీక్షల మాఫియాను అరికట్టడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు, పరిపాలనా సంస్కరణలు, పటిష్టమైన శాసన నిబంధనల కోసం చేపట్టిన కార్యక్రమాలు, సాంకేతిక నిపుణుడు, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, నందన్ నీలేకని అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం వంటివన్నీ కలిసి పరీక్షా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా తీసుకున్న ముఖ్యమైన చర్యలను సూచిస్తున్నాయని ఏబీవీపీ అభిప్రాయపడింది.

ఈ టాస్క్ ఫోర్స్‌లో సభ్యులుగా ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ దేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోటి, విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనిత కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణులు అమృత్ లాల్ మీనా ఉన్నారు.

పరీక్షా విధానాన్ని మరింత పారదర్శకంగా, సురక్షితంగా, జవాబుదారీగా, సాంకేతికత ఆధారితంగా, విద్యార్థి కేంద్రీకృతంగా మార్చేందుకు, టాస్క్ ఫోర్స్ నిర్దేశిత కాలపరిమితిలోగా తన సిఫార్సులను సమర్పించి, నిర్దిష్ట సంస్కరణలను సులభతరం చేస్తుందని ఏబీవీపీ ఆశిస్తోంది.

ఇదే విషయమై ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరేంద్ర సింగ్ సోలంకి

మాట్లాడుతూ, "తమ కష్టానికి ఒక నిష్పక్షపాతమైన, పారదర్శకమైన, విశ్వసనీయమైన వ్యవస్థ ద్వారా మూల్యాంకనం జరుగుతుందనే నమ్మకంతో దేశంలోని ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరవుతారు. అందువల్ల, పరీక్షా ప్రక్రియ సమగ్రతను కాపాడటం ఒక సామూహిక బాధ్యత. ఎన్‌టీఏలో సమగ్ర సంస్కరణల కోసం ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఒక ముఖ్యమైన ముందడుగు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సంస్థాగత సంస్కరణల కోసం ఏబీవీపీ నిరంతరం వాదిస్తూ వస్తోంది. పరీక్షా ప్రక్రియను మరింత విశ్వసనీయంగా, సురక్షితంగా, సాంకేతికత ఆధారితంగా, విద్యార్థి కేంద్రీకృతంగా మార్చడంలో కీలక పాత్ర పోషించే సకాల, ప్రభావవంతమైన సిఫార్సులను ఈ టాస్క్ ఫోర్స్ సమర్పిస్తుందని మేము విశ్వసిస్తున్నాము. జాతీయ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థుల న్యాయబద్ధమైన ఆందోళనలను పరిష్కరించడానికి ఏబీవీపీ ఎల్లప్పుడూ నిర్మాణాత్మక సంభాషణలు, అర్థవంతమైన సంస్కరణల ద్వారా పనిచేసింది. అదే నిబద్ధతతో ముందుకు సాగుతుంది" అని తెలిపారు.

జంతర్ మంతర్‌లో పాశ్చాత్య మీడియా ఆగడాలు

దేశరాజధాని, జంతర్ మంతర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), సామాజిక కార్యకర్తగా చెప్పుకునే సోనమ్ వాంగ్‌చుక్ నిరసన చేపట్టినప్పుడు మన దేశంలోని సామాజిక రాజకీయ పరిణామాలపై పాశ్చాత్య మీడియా కవరేజీ దారుణాతి దారుణంగా ఉంది. దేశ సార్వభౌమత్వం, రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నది. నకిలీ కథనాల నెట్‌వర్క్‌ను నడిపింది. భారత సమాజంలో చీలికలను తేవడానికి శాయశక్తులా ప్రయత్నించింది. ఇలాంటి ఒక కుట్రపూరితమైన కార్యక్రమాన్ని కొనసాగించడంలో అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోలేనంతగా బరి తెగించింది. నిరసన తీవ్రమవుతున్నప్పుడు అంతర్జాతీయంగా పేరున్న పాత్రికేయులు వీధుల్లోకి వచ్చి కట్టుకథలను వార్తలుగా వండి వడ్డించారు. వారు తమను తాము భారత్ యువత గొంతుకగా చిత్రీకరించుకున్నారు. అయితే వారు అమలు చేసింది భారత్‌ను అన్నివిధాలుగా అతలాకుతలం చేయడానికి అజ్ఞానంతో కూడుకున్న అజెండా మాత్రమే.

వాంగ్‌చుక్ తరలింపుపై అసత్య కథనం

అంతర్జాతీయ వార్తాసంస్థ రాయిటర్స్ సోనమ్ వాంగ్‌చుక్‌ను పర్యావరణవేత్త, విద్యా సంస్కర్తగా కొనియాడింది. ప్రధానమంత్రి రాజీనామా కోరుతున్న జెన్ జడ్ ఉద్యమ ముఖంగా ఆయన్ను ప్రశంసించింది. మూడు వారాల నిరాహార దీక్ష తర్వాత సోనమ్ వాంగ్‌చుక్‌ను ప్రభుత్వం నిర్బంధంగా ఆసుపత్రికి తరలించిందని రాయిటర్స్, బీబీసీ రాసుకొచ్చాయి. ఇలాంటి నిర్బంధపు ఆసుపత్రి చేరిక కథనంతో భారతదేశంలో మానవ హక్కులు, ప్రజాస్వామ్య హక్కులు క్షీణిస్తున్నాయని ప్రచారం చేయడమే లక్ష్యంగా పాశ్చాత్య మీడియా పెట్టుకుంది.

అయితే వాస్తవానికి సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆసుపత్రికి తరలించారు. ఇది నిరసన కారుని ఆరోగ్యాన్ని రక్షించే చర్య. నిరాహార దీక్ష ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నందున ఆయన ప్రాణాలను కాపాడే చర్య ఇది. తర్వాత ఢిల్లీ హైకోర్టు సోనమ్ వాంగ్‌చుక్‌ను ప్రభుత్వం నిర్వహణలోని నడిపే సర్దార్‌జంగ్ ఆసుపత్రి నుంచి గురుగ్రామ్‌లోని మెదాంతా ఆసుపత్రికి తరలించాలని కూడా ఆదేశించింది. ఈ ఆసుపత్రిని సోనమ్ వాంగ్‌చుక్, ఆయన సహచరులు చికిత్స కోసం ఎంచుకున్నారు. ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశాలను పాశ్చాత్య మీడియా పూర్తిగా విస్మరించి చింది. సోనమ్ వాంగ్‌చుక్‌ను నిర్బంధంగా ఆసుపత్రికి తీసుకెళ్లారని నకిలీ కథనాలను ప్రచారం చేసింది.

సినిమాతో సోనమ్‌కు అనుసంధానం

సోనమ్ వాంగ్‌చుక్‌ను బాలీవుడ్ సినిమా 3 ఇడియట్స్‌తో కూడా రాయిటర్స్ కథనాలు అనుసంధానించాయి. ఆ సినిమాలోని ప్రధాన పాత్ర సోనమ్ వనుల నుంచి ప్రేరణ పొందిందని పేర్కొన్నాయి. అయితే సినిమా తీసేటప్పుడు సోనమ్ వాంగ్‌చుక్ ఎవరో తనకు తెలియదని సినిమా ప్రధాన నటుడు ఆమిర్ ఖాన్ స్పష్టం చేశారు. తన పాత్ర సోనమ్ వాంగ్‌చుక్ నుంచి ప్రేరణ పొందిందన్న వాదనలను కూడా ఆయన తిరస్కరించారు.

పోలీసులపై అపవాదు

నిరసనకారులపై పోలీసులు, భద్రతా సిబ్బంది హింసాత్మక చర్యలు చేపట్టారని కూడా పాశ్చాత్య మీడియా నివేదిస్తుంది. ఉదాహరణకు వాంగ్‌చుక్ నిద్రిస్తున్న వేదికపైకి డజన్ల కొద్దీ పోలీసులు, పారామిలటరీ సిబ్బంది దూసుకెళ్లారని బీబీసీ నివేదించింది. వారిని ఆపాలని ప్రయత్నించిన నిరసనకారులను తోసేశారు. ఆయన్ను దుప్పట్లు, కర్టెన్లతో కప్పి వేదిక నుంచి తప్పించారు. కొన్ని నిమిషాల్లోనే అంబులెన్స్ వేగంగా వెళ్లిపోయినట్లు కనిపించిందని పేర్కొంది. బీబీసీ ఇలాంటి తీవ్రమైన భాషను ఉపయోగించడం ద్వారా భారతదేశంలో పోలీసులు ఎలా ప్రవర్తించిందీ, సోనమ్ వాంగ్‌చుక్‌ను నిర్బంధంగా ఆసువత్రికి తీసుకెళ్లారంటూ అతిశయోక్తిగా చూపించడానికి బీబీసీ ప్రయత్నించింది. అయితే కోర్టు ఆదేశాలు, ఆరోగ్యం పట్ల పెరుగుతున్న ఆందోళనల మధ్య ఆయన్ను ఆసుపత్రికి తీసుకెళ్లారన్న విషయాన్ని మాటవరసకు కూడా చెప్పలేదు.

న్యూయార్క్ టైమ్స్ అత్యుత్సాహం

అదేవిధంగా నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు భాష్పవాయుగోళాలు, లాఠీలు ఉపయోగించారని న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. అయితే అదే పాశ్చాత్య మీడియా నిరసనకారులు హింసాత్మకంగా మారి రాళ్లు విసిరి దాడులు చేసినప్పుడు పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది గాయపడిన విషయాన్ని ప్రస్తావించలేదు. న్యూయార్క్ టైమ్స్ తప్పుడు సంఖ్యలను కూడా ప్రదర్శించింది.

60 మందికి పైగా అరెస్టయ్యారని పేర్కొంది. పోలీసు చర్యలో తీవ్ర గాయాలు కావడంతో 100 మందికి పైగా ఆసుపత్రిలో చేరారంటూ అంతర్జాతీయ వేదికపై భారత్‌ను అప్రతిష్ట పాల్జేయడంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది.

వివాదాస్పద ప్రాంతంగా లడఖ్

సోనమ్ వాంగ్‌చుక్ మూలాలను వివరిస్తూ లడఖ్‌ను భారత్ పాలనలోని వివాదాస్పద ప్రాంతంగా బీబీసీ పేర్కొంది. లడఖ్‌ను వివాదాస్పద ప్రాంతంగా పేర్కొనడం భారత సార్వభౌమత్వం, భూభాగ సమగ్రతకు స్పష్టంగా ఉల్లంఘించడం తప్ప మరొకటి కాదు. లడఖ్ చైనాతో సరిహద్దు కలిగి ఉంది . భారత జాతీయ భద్రతకు అది కీలకమైనది. ఈ ప్రాంతం గురించి ఏదైనా ప్రతికూల ప్రకటన చేయడం భారత భూభాగ సమగ్రతను తప్పు పట్టడంతో సమానం. కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్ మనదేశంలో అంతర్భాగం. వివాదాస్పద ప్రాంతం కాదు. భారత్–చైనా మధ్య భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇలాంటి నకిలీ నివేదికలు కనిపిస్తాయి.

యువతను రెచ్చగొట్టే కథనాలు

అసోసియేటెడ్ ప్రెస్, రాయిటర్స్, ది గార్డియన్, డాయిష్ వెల్లే, ది వాల్ స్ట్రీట్ జర్నల్, న్యూయార్క్ టైమ్స్ వంటి అమెరికా, ఐరోపాలకు చెందిన వార్తాపత్రికలు, వార్తాసంస్థలు భారత్‌ను అప్రతిష్టపాల్జేసే వార్తలను ప్రచురించాయి. సీజేపీ నిరసనను భారతదేశంలోని విద్య, నిరుద్యోగం, పాలన సమస్యలకు అనుసంధానించాయి. ఇది తీవ్రమైన నిర్మాణాత్మక సమస్యగా రాసుకొచ్చాయి. తద్వారా యువతను రెచ్చగొట్టి, ప్రభుత్వంపై ఉసిగొల్పడంలో చేయవలసినది అంతా చేశాయి.

డీప్ స్టేట్ సాధనాలు

సోనమ్ వాంగ్‌చుక్, సీజేపీపై అంతర్జాతీయ ప్రెస్ కవరేజీ నిరసనను సంస్థాగత వైఫల్యాల నేపథ్యంలో భారీ ప్రభుత్వ వ్యతిరేక సమీకరణగా చూపడమే లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో నిరసనకారుల ఆరోపిత విదేశీ లింకులు, ఫోర్డ్ ,సోరోస్ ఫౌండేషన్ నిధులు వంటి అంశాలను విస్మరిస్తుంది. ఈ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా డీప్ స్టేట్ సాధనాలుగా కీర్తి పొందాయి.

పాశాత్య నిధుల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ భారత్ జాతీయ భద్రత, సార్వభౌమత్వానికి ఎందుకు కీలకమనే విషయాన్ని కూడా పాశ్చాత్య మీడియా తెలివిగా దాటవేస్తుంది. ఇది దేశ సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలకు ముప్పుగా పరిణమించే కార్యకలాపాలకు నిధుల మార్గాలను కత్తిరించడానికి ఉద్దేశించింది. దేశ నాగరికతా మూలాలను రక్షించడానికి నిధుల మార్గాలు, వాటి ఉద్దేశిత ఉపయోగాన్ని మరింత పరిశీలించడం ఈ చట్టం లక్ష్యం.

జాతీయ గౌరవం అవమాన నివారణ సవరణ బిల్లు–2026ను పార్లమెంటు సమయం వృథా చేసే హాస్యాస్పదమైన విషయంగా పాశ్చాత్య మీడియా సంస్థలు విమర్శిస్తాయి. ఆ బిల్లుకు చట్టబద్ధత కల్పించిన పక్షంలో అది పోలీసులకు శక్తివంతమైన ఆయుధంగా మారే అవకాశం ఉన్నదనే దుష్ప్రచారం చేస్తాయి. అయితే వాస్తవంలో ఈ చట్టం జెండా, చిహ్నాలు, రాజ్యాంగం, జాతీయ గీతం వంటి జాతీయ చిహ్నాలపై ఉద్దేశపూర్వక అగౌరవాన్ని నిషేధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇప్పటికే ప్రాథమిక కర్తవ్యంగా పాతుకుపోయి ఉంది.

భారతదేశాన్ని, ప్రస్తుత ప్రభుత్వాన్ని చిన్నాభిన్నం చేయడం, దేశంలో చీలికలు, విభేదాలను పెంచడం, సుస్థిరమైన ప్రజాస్వామ్య, పాలనా యంత్రాంగంతో ప్రపంచ వేదికపై అద్వితీయ శక్తిగా ఎదుగుతున్న భారత్ ప్రతిష్ఠను దెబ్బతీయడం పాశ్చాత్య మీడియా అంతిమ లక్ష్యం. ఈ దిశగా అంతర్జాతీయ మీడియా నకిలీ కథనాలు, తప్పుడు వార్తలను విశ్వవ్యాపితం చేయడంలో అది నిరంతరం నిమగ్నమై ఉంటుంది.

– జాగృతి డెస్క్

రోదసీలో స్వావలంబన

భారత అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా సరికొత్త చరిత్ర నెలకొంది. జూలై 18న దేశ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్–1 విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ మహత్తరమైన ఘట్టానికి ఆంధ్రప్రదేశ్, శ్రీహరికోట, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో మొదటి లాంచ్ పాడ్ వేదికగా మారింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ రాకెట్ రూపుదిద్దుకుంది. పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని సంతరించుకుంది. నిర్దేశించిన అన్ని లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. పేలోడ్‌లను భూకక్ష్యలో ప్రవేశపెట్టింది. దీంతో భారత్ ప్రైవేట్ అంతరిక్ష రంగం అధికారికంగా ఆర్బిటల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెట్టినట్టయింది.

ఈ విజయం అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో మనదేశానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన ప్రయోగం ఇంధన వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయింది. అయితే శాస్త్రవేత్తలు 35 నిమిషాల్లోనే లోపాన్ని సరిచేశారు. మధ్యాహ్నం 12.05 గంటలకు రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. రాకెట్‌లో నాలుగు దశలు నిర్దేశించిన విధంగా పనిచేసి మిషన్‌ను విజయవంతం చేశాయి. భారత్ ప్రైవేట్ అంతరిక్ష రంగంలో ఆర్బిటల్ ప్రయోగాలకు నాంది పలుకుతున్న ఈ ప్రయోగానికి మిషన్ ఆగమన్ అని స్కైరూట్ నామకరణం చేసింది. 2022లో మిషన్ ప్రారంభ్‌తో విక్రమ్-ఎస్ ద్వారా తొలి అడుగు వేసింది. ఇప్పుడు విక్రమ్-1 విజయంతో మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. ఈ రాకెట్ ద్వారా మొత్తం ఆరు పేలోడ్‌లను కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. భారత్ సంస్థలకు చెందిన ఐదు పేలోడ్‌లతో పాటు ఆరవ పేలోడ్‌గా జర్మనీకి చెందిన డీక్యూబ్డ్ జీఎంబీహెచ్‌ను ప్రవేశపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో రాసిన వందేమాతరం పోస్టుకార్డు, కాస్మిక్ బ్లూమ్ ఆర్ట్ వర్క్, భారత్ అంతరిక్ష రంగానికి ఎనలేని సేవలు అందించిన విక్రమ్ సారాభాయ్, సర్ సీవీ రామన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ ప్రతిరూపాలను కూడా రోదసిలోకి పంపించారు.

స్పేస్‌ఎక్స్‌ను తలదన్నిన స్కైరూట్

ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో ఇలాంటి విజయం సాధించడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. అమెరికాకు చెందిన ఎలాన్ మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్ ఎదుర్కొన్న ప్రారంభ వైఫల్యాలకు భిన్నంగా ఈ కంపెనీ అద్భుతమైన విజయాన్ని సాధించింది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తన స్పేస్‌ఎక్స్‌తో చేసిన మూడు ప్రయత్నాల్లోనూ అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపించలేకపోయారు. ఎలాన్ మస్క్ సాధించలేని దానిని పవన్ కుమార్ చందన నేతృత్వంలోని స్కైరూట్ ఏరోస్పేస్ సాధించింది. యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఈ రాకెట్ స్వదేశీ, విదేశీ వినియోగదారులకు సేవలు అందించనుంది. అంతరిక్ష ప్రయోగ సాంకేతికతలో ప్రపంచ అగ్రగామి ప్రైవేట్ సంస్థగా ఉన్న స్పేస్‌ఎక్స్ 2008లో తన ఫాల్కన్-1 రాకెట్‌ను విజయవంతంగా రోదసిలోకి పంపించడానికి ముందు మూడుసార్లు ప్రయోగాలు చేసి విఫలమైంది. అదే ఒక భారతీయ స్టార్టప్ సంస్థ తన తొలి ప్రయత్నంలోనే నింగిలోకి రాకెట్‌ను పంపించింది. చరిత్రను సృష్టించింది. విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్‌తో నిర్మితమైన నాలుగు దశల రాకెట్. ఇది కక్ష్యలోకి ప్రవేశించడంలో మూడు ఘన ఇంధన దశలు, ఒక ద్రవ ఇంధన ఆర్బిటల్ అడ్జెస్ట్‌మెంట్ శక్తిని అందిస్తాయి. దీనిని 450 కి.మీ.ల వరకు భూకక్ష్యలోకి గరిష్టంగా 350 కేజీల పేలోడ్‌లను మోసుకొని వెళ్లేలా తయారు చేశారు.

టీ-హబ్‌లో స్కైరూట్‌కు పునాది

ఇస్రోలో పనిచేసిన పవన్‌కుమార్ చందన తన తోటి ఇస్రో ఇంజినీర్ నాగభరత్ డాకాతో కలిసి 2018లో స్కైరూట్‌ను ప్రారంభించారు. దీనిని హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో అంకుర సంస్థగా మొదలుపెట్టారు. అంతకుముందు ఆయన ఆరు సంవత్సరాలపాటు శాస్త్రవేత్త హోదాలో ఇస్రోలో పనిచేశారు.అంతరిక్ష ప్రయోగాలను తక్కువ ఖర్చుతో, వేగంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ స్టార్టప్ ప్రారంభమైంది. 2020లో దేశంలో మొదటిసారిగా ప్రైవేటుగా పరీక్షించిన రాకెట్ ఇంజిన్‌ను స్కైరూట్ సమర్పించింది. నవంబర్, 2022లో దేశంలో మొట్టమొదటి ప్రైవేటు సబ్

ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-ఎస్‌ను ప్రారంభ్ మిషన్ పేరుతో ప్రయోగించింది. విజయం సాధించింది. స్కైరూట్ ప్రస్తుతం విక్రమ్-1 పేరిట చిన్న ఉపగ్రహాలను భూకక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు, మధ్యస్థ సామర్థ్యం కలిగిన ఉపగ్రహాల కోసం విక్రమ్-2, భారీ పేలోడ్‌ల కోసం విక్రమ్-3 అనే మూడు రాకెట్‌లను అభివృద్ధి చేస్తున్నది. మే, 2026లో 60 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. దీని తర్వాత స్కైరూట్ విలువ 1.1 బిలియన్ డాలర్లుగా ఉంది.

ఇది 28 ఏళ్ల యువత ఘనత: ప్రధాని మోదీ

హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష రంగ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' విజయవంతంగా రాకెట్‌ను ప్రయోగించిన సందర్భంగా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఈ విజయం సగటున 28 ఏళ్ల వయసున్న యువ ఆవిష్కర్తల బృందానికి దక్కుతుందని, "56 ఏళ్ల వయసున్న యువకుడికి" కాదని ఆయన పేర్కొన్నారు.

జూలై 20న పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు చేసిన సంప్రదాయ ప్రసంగంలో దేశంలోని స్టార్టప్ వ్యవస్థను ప్రధాని మోదీ ప్రశంసించారు. స్కైరూట్ సాధించిన మైలురాయిని భారత యువతకు గర్వకారణమైన ఘట్టంగా అభివర్ణించారు. "అంతరిక్షంలోకి ఒక కొత్త ప్రయాణాన్ని భారత యువత ప్రారంభించింది. 'స్కైరూట్' స్టార్టప్‌లో పనిచేస్తున్న మొత్తం బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు అని నాకు తెలిసింది. ఇలాంటి యువతే ఈ ఘనతను సాధించారు. నేను 56 ఏళ్ల వయసున్న యువకుడి గురించి మాట్లాడటం లేదు" అని ఆయన అన్నారు. ఆయన రాహుల్ గాంధీ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఈ వ్యాఖ్యలు స్పష్టంగా 56 ఏళ్ల వయసున్న కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిని ఉద్దేశించి చేసినవేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. "ప్రపంచంలో చాలా తక్కువ దేశాలు మాత్రమే ఇలాంటి ప్రైవేట్ రంగ కృషిని చూశాయి. ఇది అద్భుతమైన విజయం. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు గుర్తింపు, ఆదరణ లభిస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆశయాలు అంతరిక్షం అంత విశాలమైనవనే బలమైన సందేశాన్ని ఈ విజయం ప్రపంచానికి ఇచ్చింది" అని మోదీ అన్నారు. దేశంలోనూ, విదేశాల్లోనూ భారతదేశ ప్రతిష్టను పెంచే అనేక మైలురాళ్లతో గత నెల నిలిచిపోయిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు."కేవలం ఒక్క నెలలోనే దేశం అనేక మైలురాళ్లను అధిగమించింది. ఈ విజయాలు ప్రతి భారతీయుడికి గర్వకారణంగా నిలిచాయి. జాతీయ స్థాయి కావచ్చు, అంతర్జాతీయ వేదిక కావచ్చు లేదా ఇప్పుడు అంతరిక్ష రంగం కావచ్చు... ఇవన్నీ భారతదేశానికి నిజంగా గర్వించదగ్గ క్షణాలు" అని మోదీ అన్నారు.

"ప్రపంచంలో చాలా తక్కువ దేశాలకు మాత్రమే ఈ సామర్థ్యం ఉంది. దేశం కోసం ఒకే లక్ష్యంతో పనిచేస్తున్న భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, కార్మికుల అంకితభావానికి ఈ విజయం ఒక నిదర్శనం" అని ప్రశంసించారు. ప్రభుత్వ సంస్కరణల ఎజెండాతో ఈ విజయాలను ముడిపెట్టిన ప్రధానమంత్రి, విధానపరమైన సంస్కరణల ద్వారా ఏర్పడిన వ్యవస్థ నుండి దేశంలోని యువ ఆవిష్కర్తలు ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు.

'సంస్కరణల ప్రయాణం'లో దేశం భాగం కావడంవల్లే, భారతీయ యువత ఇంతటి ధైర్యాన్ని ప్రదర్శించి విజయాలు సాధించగలుగుతున్నారు" అని అన్నారు.

ఇటీవలి మౌలిక సదుపాయాలు, సాంకేతిక విజయాలను ప్రస్తావిస్తూ, రాజస్థాన్‌లో ఒక భారీ చమురు శుద్ధికర్మాగారం, దేశంలో మూడవ సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభమైందని తెలిపారు. దేశంలో తొలి హైడ్రోజన్ రైలుకు పచ్చజెండా చూపినట్టు ప్రధాని పేర్కొన్నారు.

– జాగృతి డెస్క్

‘మాతృత్వం నాగరికతకు పునాది’

వక్రీకరించిన కథనాలను సరిదిద్దాలని డాక్టర్ మోహన్ భాగవత్ సమాజానికి విజ్ఞప్తి

“విశ్వ సృష్టితోనే మాతృత్వం ప్రారంభమైంది. ఇది అత్యంత శాశ్వతమైనది, ప్రకృతి సహజమైన ప్రవృత్తి. సృష్టి ఆవిర్భవించినప్పటి నుండి విస్తరిస్తూనే ఉన్నప్పటికీ, మాతృత్వం లేకుండా సృష్టి ప్రక్రియ ముందుకు సాగదు,” అని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ అన్నారు. సృష్టికి, పోషణకు, మానవ మనుగడ కొనసాగింపు నకు మాతృత్వమే ప్రాథమిక ఆధారమని అభివర్ణిస్తూ, అది నాగరికతకు పునాదిగా నిలుస్తుందని ఆయన నొక్కి చెప్పారు.

జూలై 26న భాగ్యనగర్‌లో విశ్వమాంగళ్య సభ నిర్వహించిన రెండు రోజుల దక్షిణ భారత్ ప్రబోధన్ సమావేశంలో ముగింపు ప్రసంగం చేస్తూ డాక్టర్ భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు. సేవాలాల్ బంజారా భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన దక్షిణ భారతదేశం నలుమూలల నుండి వచ్చిన మహిళా ప్రతినిధులు, తల్లులు, ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఏ విషయం గురించి మాట్లాడినా అనుభవం కన్నా గొప్ప బలం మరొకటి లేదని ఆయన వ్యాఖ్యానించారు. మనది ప్రపంచంలోని అత్యంత ప్రాచీన నాగరికతలలో ఒకటి కనుక, మన దేశంలో మాతృత్వం కూడా అంతే ప్రాచీనమైనది. తల్లులకు యుగాల అనుభవం ఉంది. అందువల్ల, అంతటి అపారమైన అనుభవం ఉన్న తల్లుల గురించి మాట్లాడమని తనను అడగడం, తనను పరీక్షించడం కంటే తక్కువ ఏమీ కాదని ఆయన చమత్కరించారు. అయితే, గత అనేక శతాబ్దాలుగా మన దేశం విదేశీ పాలకుల ఆధిపత్యంలోనే ఉండిపోయిందని ఆయన అన్నారు. విదేశీ సంస్కృతుల ప్రభావం మన సంస్కృతిలోనే కాకుండా మన దైనందిన జీవన విధానంలో కూడా ఎన్నో మార్పులను తీసుకు వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో, మనందరికీ “యుగానుకూల/ సమకాలీన మాతృత్వం” గురించి చర్చించుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు.

మాతృత్వానికి సంబంధించి తల్లులకు ఎన్నో యుగాల అనుభవం ఉంటుందని ఆయన అన్నారు. అందువల్ల, మాతృత్వం గురించి వారికి ఎక్కువగా బోధించాల్సిన అవసరం లేదు, అయినప్పటికీ దానిపై చర్చించాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. పరిస్థితులు, వాతావరణం మారాయని, అటువంటి మార్పు ఒక సహజమైన, నిరంతర ప్రక్రియ అని ఆయన అన్నారు. ఈ మార్పులన్నిటి మధ్య కూడా, తల్లులు మన శాశ్వత విలువల ఆధారంగా తమ పిల్లలను పెంచి పోషిస్తూనే ఉన్నారు.

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ మాతృత్వం గురించి చర్చిస్తున్నారని, అయితే ఈ ప్రశ్న ఎందుకు తలెత్తిందో విశ్లేషించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సాధారణంగా, దేశంలో ఒకేసారి ఐదుతరాల వారు ఉండేవారు. మొదటి మూడు తరాల వారి వద్ద తాము ఇటువంటిది ఎప్పుడూ చూడలేదన్న భావన, ముందు ముందు ఏం జరుగుతుందన్న ప్రశ్న పీడిస్తుండేది. ఈ ప్రశ్నకు సమాధానం గురించి మాట్లాడుకునే ముందు అసలు ఈ ప్రశ్న ఎందుకు తలెత్తిందో తెలుసుకోవాలన్నారు. దాని గురించి ఆలోచించాలి. మొత్తం అధ్యయనం చేసిన తర్వాత, ఎటువంటి పరిస్థితి తలెత్తిందంటే, దీనికి మనమందరమే కారణం. మాతృమూర్తులు సహా యావత్ సమాజం బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. ఎందుకంటే, దీని గురించి మన ఆలోచన ఏమిటి? మనం కూడా ఈ ప్రపంచంలో ఒక దేశం, ఒక రాష్ట్రంగా, ఎన్నోయుగాలుగా ఇక్కడే నివసిస్తూ వచ్చాం.

పైగా మనది అత్యంత ప్రాచీన దేశం, మాతృత్వం అనే భావనలో కూడా అంతే ప్రాచీనమైనది అని ఆయన తెలిపారు. అయితే, సమాజం మాతృత్వ స్ఫూర్తిని, సందేశాన్ని మరచిపోవడం వల్ల అది క్షీణించిందని, ఇది విదేశీ శక్తులు దేశాన్ని దోచుకోవడానికి, ఆధిపత్యం చెలాయించడానికి వీలు కల్పించిందని ఆయన అన్నారు. చివరి విదేశీ పాలకులైన బ్రిటిష్ వారు వెళ్ళిపోయే ముందు ఈ ఆత్మవిస్మృతి (మనను మనం మరిచిపోవడం) అన్న లోపాన్ని మరింత బలపరిచే వ్యవస్థను ఏర్పాటుచేశారని అన్నారు. అంతేకాక, మన దేశంలోని ప్రాచీన సంప్రదాయాలు, భావనలన్నీ విలువలేనివని నమ్మేలా వారు మన మనసులను ప్రభావితం చేశారన్నారు.

అయితే, గత రెండు వేల సంవత్సరాలుగా మాత్రమే మనం మన ఆచారాలు, సంప్రదాయాలను ప్రశ్నిస్తున్నామని చాలామంది నమ్ముతారని, కానీ నిజానికి విలువలను విస్మరించడం అన్నది మహాభారత కాలంనాటికే ప్రారంభమైందని ఆయన వివరించారు. అప్పటి నుండి మనం క్రమంగా మన ఆచారాలు, సంప్రదాయాలను మరచి పోయామని ఆయన అన్నారు.

ఆ తర్వాత దండయాత్రలు మొదలై, సమాజం అస్తవ్యస్థమైంది. వ్యవస్థలు ధ్వంసం అయ్యాయి.అదే జరిగింది. చివరిసారి దాడి చేసిన ముష్కరులు మన మనసుల్లో మన సొంత సంప్రదాయాల పట్ల ద్వేషాన్ని నింపేశారు. మనస్సులను న్యూనత భావంతో నింపివేశారు. వారి ఆచారాలు, పద్ధతులే సరైనవని, మన సంప్రదా యాలు, జీవనవిధానాలు తప్పని వారు క్రమంగా మనలో నమ్మకాన్ని నాటారు. ఫలితంగా, మనం మన నిజమైన సంప్రదాయాలు, పద్ధతులపై అవగాహనను కూడా కోల్పోయాం.

ఈ అసంపూర్ణ దృక్పథం నుండి పుట్టుకొచ్చిన తప్పుడు భావనల కథనం విస్తృతంగా వ్యాపించి ఉంది. పాశ్చాత్య దేశాలలో దేని కారణంగా అక్కడ అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయో, ఆ ఆలోచనలలో కొన్నింటిని మనం వారి నుంచి స్వీకరించాం. అయినప్పటికీ ఆ సమస్యలకు వారికి పరిష్కారాలు లభ్యం కావడం లేదు, మనం కూడా ఏవీ కనుగొన లేదు. అయినప్పటికీ, ఇక్కడ మనం ఆ కథనాలను, ప్రమాణాలను ప్రామాణికంగా పరిగణిస్తూనే ఉన్నాం.

భారతదేశంలో ఎన్నడూ లేని కథనాలను విదేశీయులు సృష్టించి ఇక్కడ ప్రచారం చేశారని

విశ్వమాంగళ్య సభ

సమాజంలోని మహిళా సంఘటిత శక్తిగా విశ్వమాంగళ్యసభ ఉద్భవించింది. ఈ విశ్వంలోని ప్రతి కుటుంబానికి కేంద్ర బిందువు మాతృమూర్తే అన్నది కాదనలేని వాస్తవం. కుటుంబంలో భావితరాలకు సంస్కారాన్ని అందించే కీలకపాత్రను 'అమ్మ' పోషిస్తుంది. ఈ స్థానాన్ని పటిష్టంచేస్తూ, ఈ మాతృత్వ భావన ద్వారా సమాజాన్ని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నది విశ్వమాంగళ్యసభ భావన. బాలికలకు సంస్కారవంతమైన తల్లులను అందించడమే లక్ష్యంగా ఈ సంస్థ పని చేస్తోంది. తద్వారా దేశ సంస్కృతిని పటిష్టం చేయగలం అన్నది ఈ సంస్థ విశ్వాసం. ప్రతి ఇంట్లోనూ ప్రతిభ, తత్వచింతన సంస్కారవంతులైన మాతృమూర్తి ఉన్నట్టయితే, ప్రతి ఇంటి నుంచి సంస్కారవంతులు, దేశభక్తులు, తేజోవంతమైన సంతతి నిర్మాణం కాగలదనేది సభ భావన.

ఈ భావనతోనే ప్రతివర్గంలోని తల్లినీ ఈ సూత్రానికి అనుసంధానం చేసేందుకు విశ్వమాంగల్య సభ పని చేస్తోంది. వ్యక్తి నుంచి సమష్టికి, సమిష్టి నుంచి కుటుంబం, కుటుంబం నుంచి సమాజం, సమాజం నుంచి దేశానికి, దేశం నుంచి విశ్వానికి భారతీయ సంస్కృతిని విస్తరింపచేయడమే విశ్వమాంగళ్య సభ లక్ష్యం.

అమరావతి జిల్లా, అంజన్‌గావ్ సూర్జీలోని శ్రీదేవనాథ పీఠం పీఠాధీశులైన పరమపూజ్య ఆచార్య అనంత శ్రీ విభూషిత 1008 స్వామి శ్రీ జితేంద్రనాథ్ మహారాజ్ ప్రేరణతో 2010, జనవరి 19 మాఘ శుద్ధ చతుర్థి శ్రీ గణేష్ జయంతి పర్వదినాన విశ్వమాంగళ్య

సభ ప్రారంభమైంది.

విశ్వమాంగళ్యసభ సదాచార సభ, విద్యార్థి సభ, బాల సభ విభాగాలలో కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

విదేశీ విభాగం: అమెరికా, కెనడా, సింగపూర్, నెదర్లాండ్, నార్వే, బెల్జియం, జర్మనీ ఆస్ట్రేలియా వంటి దేశాల్లో మాతృనిర్మాణ కార్యక్రమాలను సభ విస్తృతంగా నిర్వహిస్తోంది.

ధర్మ సంస్కృతి శిక్షా విభాగం: విలువలతో కూడిన వ్యక్తి జీవనం ధర్మబద్ధమైన సామాజిక రచనే, దేశ సాంస్కృతిక అభివృద్ధికి ప్రాతిపదిక కనుక, సమాజానికి ధర్మ భావనను, జ్ఞానాన్ని ప్రేరేపిస్తూ వ్యక్తి నిర్మాణం చేయడం ఈ విభాగం ముఖ్య లక్ష్యం. వివిధ ప్రచార, ప్రసార సాధనాల ద్వారా ధర్మ శిక్షా విభాగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వనవాసీ కళ్యాణ విభాగం: గిరిజన జీవన విధానాలకు భంగం కలిగించకుండా వాటిలో ఆధునికతను అందిస్తూ, అన్యులు మన సంస్కృతిపై చేసే దాడులను ధైర్యం ఎదుర్కొనే విధంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

శ్రీనాథ్‌జీ రసోయి (వంటగది)

కాశీక్షేత్రంలో దుర్గాఘాట్‌లో 'శ్రీనాథ్‌జీ రసోయి' పేరిట నిత్యాన్నదాన క్షేత్రం ప్రారంభించారు. నిత్యం వేదాధ్యయనం చేసే విద్యార్థులు, సాధుసన్యాసులు, యాత్రికులకు భోజన సౌకర్యాన్ని అందిస్తున్నారు. విశ్వమాంగల్యసభ చేపట్టే అన్ని మాతృకార్యక్రమాలు మాతృమూర్తి అన్నపూర్ణదేవి స్వరూపమని భావిస్తారు. కనుక, కాశీలాంటి పుణ్యక్షేత్రంలో విశ్వమాంగల్యసభ 'అన్న క్షేత్రాన్ని' ప్రారంభించింది.

ఆయన అన్నారు. మన దగ్గర లేని పరిస్థితులను, మనకు అసలు సంబంధం లేని కథనాలను సృష్టిస్తున్నారు. వారు ఊహించినట్టుగా పరిస్థితి తయారైంది. ఉదాహరణకు, పురుషులు గొప్పవారా లేక స్త్రీలు గొప్పవారా అనే చర్చను వారు ప్రవేశపెట్టారు. పురుషులకు అనుకూలంగా ఉన్నవారు పురుషులే గొప్పవారని వాదిస్తుండగా, స్త్రీలకు మద్దతు ఇచ్చేవారు స్త్రీలే గొప్పవారని వాదిస్తున్నారు. ఈ విధంగా, ఎవరు గొప్ప, ఎవరు తక్కువ అనే వాదనలతో సమాజం నిండిపోయింది.

ఒకవేళ, స్త్రీలు శ్రేష్ఠులైతే, వారు కుటుంబంలో ఎందుకు బానిసలుగా మిగిలిపోయారు? తమను బానిసత్వంలో ఉంచే వివాహ వ్యవస్థను వారు ఎందుకు అంగీకరించాలి? స్త్రీలు ఏదైనా చేయగలరు. స్త్రీలు అన్నీ చేయగలరన్న వాదన కేవలం ఒక భ్రమ. అలాగే పురుషులు అన్నీ చేయగలరన్న వాదన కూడా అంతే భ్రమ అని ఆయన అన్నారు. ఏదైనా చేయాలంటే, ఇద్దరూ కలిసి ఉండాలన్నారు. ఇది వాస్తవ స్థితి అని పేర్కొన్నారు. కానీ, వారి కథనాన్ని మనం కళ్లకు గంతలు కట్టుకొని స్వీకరించాం. అసంపూర్ణమైన దృష్టికోణం నుంచి ఆలోచన చేస్తారు. దాని ఆధారంగా అసంపూర్ణమైన వ్యవస్థలను స్వీకరించేందుకు సిద్ధమవుతారు. అందుకే, దీనికి సంబంధించిన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దానికి సమాధానం లేదు.

అందుకే, మన దగ్గర ఈ ప్రశ్నలు తలెత్తాయి, ఇది ముఖ్యమైన చర్చలలో ఒకటిగా మారింది. ఇప్పుడు దీనినే స్వాతంత్ర్యం అని పిలుస్తున్నారు. అవును కదా? అందుకే, "మహిళా విముక్తి" అనే పదాన్ని కూడా ప్రజా చర్చలోకి తీసుకువచ్చారని ఆయన అన్నారు. ఈ పదం వినడానికి ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, బానిసత్వం అనే భావన నిజంగా ఉనికిలో ఉంటే, మహిళలు దాని నుండి తప్పకుండా విముక్తి పొందాలని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తి, అది స్త్రీ అయినా పురుషుడైనా బంధనాల నుంచి విముక్తమై ఉన్నారా. మనందరం బంధనాల్లో ఉన్నాం. కనుక అన్ని బంధాలను తెంచుకోవడం అసాధ్యం.

మీరు ఈ హాల్‌ను ఒకసారి పరికించండి, వర్ణమయంగా కనిపిస్తారు అందరూ. అప్పుడు ఇక్కడ సప్తవర్ణాలూ ఉన్నాయని అంటాం. కానీ, ఒక కోడి వచ్చి, ఏడు రంగులు ఎక్కడుంటాయి? రంగులు మూడే ఉంటాయి అంటుంది. ఎందుకంటే, దాని మెదడుకు తన మూడు రంగులే కనిపిస్తాయి. కాబట్టి, దాని దృష్టి కోణం నుంచి ప్రపంచంలో మూడే ఉన్నాయంటుంది.

కుక్క అయితే నలుపు, తెలుపు అనే రెండు రంగులే ఉన్నాయంటుంది. అప్పుడు మనం ఏడురంగులున్నాయని కుక్కకి వివరిస్తాం. కానీ, ఇదంతా అర్థం లేని విషయం అని అంటుంది. రెండే రంగులున్నాయనేది నాకు అనుభవమైంది అంటుంది. ఏడురంగులున్నాయన్నది మా అనుభవం అంటాం. కానీ, మన అనుభవం ఎక్కడుంది. అంతర్గతంగా మనల్ని కట్టేశారు.

ప్రతి ముక్తి, ఒక కొత్త బంధనాన్ని స్వీకరించడమే. ప్రతి విముక్తి అనివార్యంగా మరో రకమైన బంధనానికి దారితీస్తుంది. కేవలం, "నేను అన్ని బంధాల నుండి విముక్తురాలిని; నాకు ఇకపై బంధనం లేదు," అని ప్రకటిస్తే సరిపోదు. మనల్ని బంధించే బంధనంగా మనం భావించేది, వాస్తవానికి విముక్తి అనే మరో రకమైన బంధనమే.

దేశంలో మహిళా విముక్తి ఉద్యమం ప్రారంభమై, పెరిగి,

కొందరు దానిని స్వీకరిస్తుండగానే, జెన్‌జెడ్(జెన్‌జీ) తరం వచ్చిందని, ఆ పదం వినడానికి బాగుంది. అది భావోద్వేగపూరితమైనదని, అనుకరిస్తుంది, కానీ అది పరిణతితో ఆలోచించదని ఆయన అన్నారు. వారితో సంపర్కంలో ఉన్నవారు వారు చూడటంలో నిజాయితీగా కనిపిస్తే వారిని ఆశ్రయిస్తుంది. తర్వాత వారి వ్యవస్థాపకులు ఒకరికి తాము ఒక తప్పుడు మార్గంలో అడుగులు వేశామని, ఒకటి లేదా రెండు తరాలను నాశనం చేశామని గ్రహించారు. అదే సందర్భంలో, ఒక జెన్‌జెడ్ మహిళ "మహిళా విముక్తి" పేరుతో విషపూరితమైన భావాలను నాటుతూ ఒక పుస్తకం రాసింది, దానివల్ల రెండు తరాలు దెబ్బ తిన్నాయని ఆయన అన్నారు. కొన్ని రోజుల తర్వాత ఆమె తన తప్పును గ్రహించి, దానికి ప్రతిగా మరో పుస్తకం రాసింది, అందులో ఆమె తన పొరపాటును అంగీకరించింది.

కనీసం రాబోయే తరాలు తప్పుడు మార్గంలో వెళ్లకూడదనే ఉద్దేశ్యంతో ఆమె మరిన్ని పుస్తకాలు రాశారని ఆయన అన్నారు. చివరగా, మాతృత్వం ఒక స్త్రీకి అత్యంత గొప్ప విషయం అని ఆమె అంగీకరించారు.

అయితే, అది ప్రగతిశీలమైనదని భావించి, మనం కూడా ఆ పాశ్చాత్య విధానాన్ని గుడ్డిగా అనుసరించాం. అందువల్ల, ప్రస్తుత కాలంలో "మాతృత్వం" గురించి చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. అన్ని పరిస్థితులకూ ఒక అంతర్లీన దృక్కోణం ఉంటుందని, ఆ దృక్కోణాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు.

మనం సహించగలిగినన్ని అడ్డంకులు మనకు ఉంటాయి. వాటిని అధిగమించగల గుణాలు మనలో ఉన్నాయి. మనకు యుగాల అనుభవం ఉంది. కానీ అది మనది అయినందువల్ల, దానిని నిరుపయోగమైనదిగా భావిస్తున్నామనే విషయం మనకు తెలియదు. వారిది చాలా పురోగమన ప్రపంచం. అక్కడి నుంచి ఈ అంధుల వెనక మనం కూడా అంధులమై తిరుగుతున్నాం. అందువల్ల ఈ చర్చ చేయవలసి వస్తోంది.

కానీ, మీరందరూ కూడా అంతర్గతంగా ఒకసారి తొంగిచూసుకుని, ఆలోచన చేస్తే నేను చెప్పకుండానే మీకు సత్యం బోధపడుతుంది. ఇప్పుడు మీలో తలెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు మీకు దొరికిపోతాయి. ఎందుకంటే, మొత్తం పరిస్థితి వెనుక అసంపూర్ణత ఉంది, కానీ మన వద్ద సంపూర్ణమైన, సమగ్రమైన దృష్టి ఉంది.

ఎందుకంటే, మన పూర్వీకులు సృష్టికి సంబంధించిన సత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, దానిని స్వీకరించి, భవిష్యత్ తరాలకు అందించడం వల్లే, ప్రాచీన కాలం నుంచే భారత్ ఒక సంపూర్ణ, సమగ్ర దృక్పథాన్ని కలిగి ఉందని ఆయన అన్నారు.



ఒకవేళ, స్త్రీలు శ్రేష్ఠులైతే, వారు కుటుంబంలో ఎందుకు బానిసలుగా మిగిలిపోయారు? తమను బానిసత్వంలో ఉంచే వివాహ వ్యవస్థను వారు ఎందుకు అంగీకరించాలి? స్త్రీలు ఏదైనా చేయగలరు. స్త్రీలు అన్నీ చేయగలరన్న వాదన కేవలం ఒక భ్రమ. అలాగే పురుషులు అన్నీ చేయగలరన్న వాదన కూడా అంతే భ్రమ. ఏదైనా చేయాలంటే, ఇద్దరూ కలిసి ఉండాలి. ఇది వాస్తవ స్థితి. కానీ, పాశ్చాత్యుల కథనాన్ని మనం కళ్లకు గంతలు కట్టుకొని స్వీకరించాం.

అదే వారసత్వం నేటికీ మనతో ఉందని, మన మందరం ఒక్కటేనని అది మనకు బోధిస్తుందని పేర్కొన్నారు.

పురుషులు, స్త్రీలు, జీవులు, జడత్వం, చైతన్యం అన్నీ భ్రమలేనని ఆయన అన్నారు. అయితే, మనం వాటిని అధిగమించలేం. ఇవన్నీ మాయ అయినప్పటికీ, తపస్సు ద్వారా వాటిని జయించవచ్చు. అయితే, ప్రకృతి సహకారం, అనుమతితో మాత్రమే ఈ భ్రమను అధిగమించి, సత్యాన్ని చేరుకోగలం. కానీ, ఆ ప్రయాణం చేస్తున్నప్పుడు ఇది మాయ అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

కానీ వాస్తవికత ఏమిటి? ఏమిటంటే అందరూ ఒక్కటే, ఇదే మన వారసత్వం. ఈ చైతన్యం పరిమితమైనది కాదని, అది విశ్వవ్యాప్తమైనదని, విజ్ఞానశాస్త్రం కూడా ఇదే చెబుతుందని ఆయన నొక్కి చెప్పారు.

విజ్ఞాన శాస్త్రం కూడా అదే భావనకు వచ్చింది. ప్రతిదీ పూర్వమే ఉన్న ఒక విశ్వ చైతన్యంతో ప్రారంభమైంది. ఆ చైతన్యం స్థానికమైనది కాదు, అది విశ్వవ్యాప్తమైనది. అందువల్ల ప్రతిదీ ఒక్కటే, ప్రతిదీ ఒకదానితో ఒకటి అనుసంధానితమై ఉంది. ఇదే విజ్ఞానం చెప్తుంది, ఇదే మన దృష్టి కూడా.

దీని ఆధారంగా ఆలోచన చేసినప్పుడు, స్త్రీ, పురుషుల విషయం గుర్తు వస్తుంది. అంతిమ సత్య (ఆబ్సల్యూట్ రియాలిటీ) స్థాయిలో అసలు ఈ తేడాయే లేదు. స్త్రీ, పురుషులందరూ ఆత్మలు లేదా శూన్యం. వేరు, వేరు పేర్లు, వేరు వేరు రూపాలతో. కానీ ప్రతి భారతీయ దర్శనం అది బేధమే కాదంటుంది. ప్రతి వారి మనస్సు, బుద్ధి వేరువేరుగా ఉంటుంది. కానీ, పూర్ణం ఒకటే. భావనల రూపంలో, ప్రవృత్తి రూపంలో, సామర్థ్యాల రూపంలో ఉన్న తేడాలు అందరిలో ఉంటాయి. అవి పురుషుల్లోనూ, స్త్రీలలోనూ కూడా ఉన్నాయి. అందులో తేడా లేదు.

బాహ్యంగా కనిపించే దేహానికి ఆవరణ లభిస్తుంది, అది వేరు. ప్రకృతి వారిని విడిగా ఉంచింది. పునరుత్పత్తి అనే విధిని నిర్వర్తించడం ప్రకృతికే సాధ్యం. ఎందుకంటే, ప్రకృతి మరణాన్ని కోరుకోదు, శాశ్వతత్వంగా ఉండాలనుకుంటుంది. శాశ్వతంగా ఉండటానికి రెండు మార్గాలున్నాయి. మీరు ఏదైనా చేసి, సజీవంగా ఉండండి లేదంటే మీ వంశాన్ని ఉత్పన్నం చేయండి. అప్పుడు మరణించిన తర్వాత కూడా మీరు వారిలో జీవిస్తారు. ఇది అన్ని జీవులకు వర్తించే బయాలజీ. అందుకే, స్త్రీ, పురుషుల శరీరాలను భిన్నంగా తయారు చేసింది ప్రకృతి.

కానీ దేహ స్థాయిలో ఆవశ్యకతలు భిన్నంగా ఉంటాయి. ఉపయోగాలు భిన్నం. కానీ, మందబుద్ధి స్థాయిలో అందరూ ఒకటే. అందుకే, పురుషుడు చేయగలవన్నీ, మహిళ కూడా చేయగలదు. కానీ, మహిళలకు ఉన్న ప్రత్యేక వరం ఉంది, పురుషులకు లేదు.

ఈ కార్యక్రమంలో విశ్వమాంగళ్య సభ వ్యవస్థాపకులు పూజ్య శ్రీ జితేంద్రనాథ్ మహరాజ్, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వృశాలి జోషి, అఖిల భారతీయ విశ్వమాంగళ్య సభ మార్గదర్శి ప్రశాంత్‌జీ హోల్కర్, విశ్వమాంగళ్య సభ జాతీయ అధ్యక్షురాలు నళినీ హవాడే, విశ్వమాంగళ్య కమిటీ, జాతీయ ఉపాధ్యక్షుడు సూరజ్ జీ దామోర్ పాల్గొన్నారు. ఆహ్వాన సంఘం కమిటీ అధ్యక్షుడు భగవత్‌జీ బల్వా, సంయుక్త కార్యదర్శి శృతి బొడ్డుపల్లి ముఖ్యఅతిథులుగా పాల్గొని కార్యక్రమానికి మార్గదర్శనం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర దక్షిణ భారత రాష్ట్రాల నుండి సుమారు 150 మంది విశ్వమాంగళ్య సభ కార్యకర్తలు పాల్గొన్నారు.

దక్షిణ భారతదేశం నలుమూలల నుండి మహిళా ప్రతినిధులు, ప్రముఖులు, తల్లులు ఈ దక్షిణ భారత్ ప్రబోధన్ సమావేశాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

– జాగృతి డెస్క్

గణపతిదేవుడు

47

"నిజం. నన్ను గణపతిదేవులవారికిచ్చి వివాహం చేయాలని ఆమె తలపోత. అందుకు అడ్డుగా ఉన్న పెద్ద కవ్వలను వివాహం రోజునే చంపవలసినదిగా ఆమె మనుష్యులను నియమించింది. అయితే మెరుపుదాడి కూడా ఆ రోజే జరగడంతో కవ్వలను చంపింది కాకతీయ సైనికులా? దేవగిరి సైనికులా? అని అందరూ శంకించారు కానీ, మూడో వ్యక్తి చంపారని ఎవరికీ అనుమానం రాలేదు. అమ్మే ఇంత దారుణానికి సిద్ధపడిందని నాకూ తెలియదు. బందీగా ఉన్న ఆయనను రాజప్రాసాదంలోనికి మార్పించింది అమ్మే. హోయసల బల్లాల మహారాజుతో మంత్రాంగం నెరపి ఆయన ద్వారా వివాహం జరిపించింది ఆమె. మా తండ్రిగారు మా వారికి ఉరిశిక్ష విధిస్తే దానిని ఆపించింది అమ్మే. నిజం. నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇవన్నీ నిజం. అమ్మ చనిపోయే ముందు నాకు చెప్పింది కూడా. ఆమె చెప్పకుండా చనిపోతే ఆ నెపం నా భర్త పైనే ఉండేది. ఆయన ఈ విషయంలో అమాయకుడు. కవ్వలను ఆయన నిజంగానే ప్రేమించారు. అనుకోకుండా ఆ రాత్రి ఇద్దరూ ఇక్కడికి రావడం,ఇక్కడే ఆమెను చంపడం జరిగిపోయాయి. జరిగింది ఒకటైతే అందరూ భావించింది మరొకటి. ఇవన్నీ చేసుకోవచ్చు. కానీ నీది అర్థంపర్థం లేని పగ. ఆయనను చంపుతాన నడం చాలా అన్యాయం కవ్వలా! ఇప్పటికైనా అర్థం చేసుకో.."

చేతులు జోడించి ఏడుస్తూ ఆమె చెబుతున్నది వింటే ఎవరికైనా గతం పూర్తిగా అర్థం అవుతుంది.

అర్థమైనా తన మూర్ఖంతో చివ్వున కదిలి కింద కూలబడి ఉన్న గణపతిదేవుని మెడ నరకడానికి చటుక్కున కత్తి ఎత్తింది బాలకవ్వల.

కానీ లిప్తకాలపు ఆలస్యం జరిగిపోయింది.

అప్పుడే రుద్రమ చేసిన ఖడ్గ ప్రహారంతో కవ్వల మెడ ముప్పాతిక భాగం తెగిపోయింది. ఆమె తూలి కిందికి జారిపోయింది. కానీ ఆమె విసిరిన కత్తి ప్రహారం గణపతిదేవునికి తగలకుండా దివిటీ పట్టుకున్న ఆగంతుకుడు వేగంగా కదిలి ఆయనను తన శరీరంతో కప్పేశాడు. అతని వీపు మొత్తంగా చీరుకుపోయి వీపు భాగమంతా రక్తం పొంగింది.

అతడు ఆ దివిటీ వదలి వెనక్కు విరుచుకుపడి పోయాడు.

అప్పటికే కిరాతకులనందరిని మట్టుపెట్టిన రుద్రమ రక్షణ లెంకలు గణపతి దేవుని వద్దకు పరుగున వచ్చారు. ఆగంతుకుడు నొప్పిని అణచుకుంటూ గణపతిదేవునే చూస్తున్నాడు సజలనయనాలతో.

గణపతిదేవుడు చకితుడై అతనినే చూస్తూ అన్నాడు. "నువ్వూ.. నువ్వు??"

"కుంటోడిని మహారాజా.." అన్నాడు.

ఆ గొంతు కూడా గణపతిదేవుని కదిలించింది.. ఎవరు. ఎక్కడో.. చూసినట్లు.. విన్నట్లు??

అప్పుడే అక్కడికి పరుగున వచ్చింది రుద్రమ. అతన్ని చూస్తూ అరిచింది.

"నాగతిస్యా.. ఏమైంది??"

అంతే. చివ్వున తిరిగి చూశాడు గణపతిదేవుడు. ఆయన గుర్తించినట్లు వణికిపోతూ అతన్నే రెప్పవెయ్యకుండా చూస్తుంటే నాగతిస్య చేతులెత్తి ఆయనకు మొక్కాడు. గణతిదేవుడు నాగతిస్యను కింది నుండి పైకి వివరంగా చూసి గాఢంగా హత్తుకుని గుక్కలుపట్టి వలవలా ఏడ్వసాగాడు.

ఇద్దరి అన్యోన్యత కట్టలు తెంచుకుని ఆ ప్రాంగణమంతా ప్రసరించసాగింది.

ఆత్మీయంగా పెనవేసుకున్న ఆ ఇద్దరిని సోమల, రుద్రమ, లెంకలు, దివిటీల వారు.. అంతా ఆనందబాష్పాలతో చూడసాగారు.

"కొన్నేళ్లుగా రాత్రుళ్లు ఇక్కడికి వచ్చి నాగతిస్య ఈ రక్షణ వలయమంతా ఏర్పాటు చేశాడు తండ్రీ! మమ్మల్ని అందరిని అతడే లోపలికి ప్రవేశపెట్టాడు.." చెబుతోంది రుద్రమ. అవతలగా తన పిచ్చి పగతో ఎన్నో జీవితాలను నాశనం చేసిన బాలకవ్వల నేత్రాలు మిణుకుమిణుకుమంటూ నాగతిస్యను చూస్తూ మెల్లగా నిర్జీవమయ్యాయి.

* * *

జాగృతి నిర్వహించిన ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి
స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక
నవలల పోటీలో ద్వితీయ బహుమతి రచన

గన్నవరపు నరసింహమూర్తి

కొత్త ధారావాహిక
వచ్చే వారమే..

ఏ వెలుగులకీ ప్రస్థానం?

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

మత్తి భానుమూర్తి

మంగళాశాసనం

ఆంధ్రనాథో మహావిష్ణు ర్నిశుంభ ధనుజాపః

పురా స్వాయంభువ మనోహ కాలే కలియుగే హరిహి

కాకుళే రాజవర్యస్య సుచంద్రస్య తమాభవః

అభవ త్పర్వ దేశైశ్చ వేష్టితో లోకపూజితః

"బ్రహ్మాండపురాణంలోని ఈ శ్లోకం ఏమి చెబుతున్నదంటే... పూర్వయుగంలో సుచంద్రుడు అనే మహారాజు నిశశీభుడు అనే రాక్షసుని సంహరించి కృష్ణాతీరంలో శ్రీకాకుళం రాజధానిగా ఆంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఆయన వైష్ణవాన్ని అభిమానించి ఆంధ్రమహావిష్ణువు బిరుదు ధరించి ఉండవచ్చు. ఆ ఆంధ్ర సామ్రాజ్యమే పూర్తిగా స్పష్టమైన రూపం పొందిన తెలుగు భాషతో పునీతమై ఇప్పుడు.. తిరిగి మహాపాలకుడు శ్రీశ్రీశ్రీ కాకతీయ గణపతిదేవుని ఆధ్వర్యంలో ఆంధ్రసామ్రాజ్యంగా ఏర్పడింది.మనమంతా ఆంధ్రులం. మన భాష స్పష్టమైన, స్వచ్ఛమైన తెలుగుభాష. ఇప్పుడిది తెలుగుజాతి రాజ్యం.. ఆంధ్ర సామ్రాజ్యం.."

మహా పండితుడు తిక్కనసోమయాజి ఒక్కొక్క అక్షరం ఒత్తి పలుకుతూ స్పందనతో పులకిస్తున్న గొంతుకతో చెబుతున్నప్పుడు ఆ సభలోని యావన్మంది ఊపిరి బిగబట్టి విన్నారు. ఆయన ఆపగానే ఆ నిండు పెరోలగం హర్షధ్వానాలతో మార్మోగిపోయింది.

తృప్తి నిండిన మోముతో కుడి పక్కనున్న పట్టమహిషి సోమలదేవి చేయితో చేయి కలిపి, ఎడమ చేతితో నారమాంబ చేయితో కలిపి ముగ్గురూ చేతులెత్తి విజయగర్వంతో పిడికిలి బిగించి చూపారు.

అనంతరం ఆయన మాట్లాడారు.

"మహాకవులు, మహాపండితులు, తెలుగురాజ్య విధివిధాన దురంధరులు నా గురుదేవులు తెలుగు జాతికొక సంపూర్ణ రాజ్యం కోసం అహరహమూ తపించి నన్ను క్షణక్షణమూ అప్రమత్తం గావిస్తూ ఇన్నేళ్లూ నాకు దిశా నిర్దేశం చేసిన మహానుభావులు తిక్కనార్యులు చెప్పింది అక్షరాలా నిజం. ఆయన మనస్సులో రూపుదిద్దుకున్న తెలుగు రాజ్యం. తెలుగు జాతికొక రాజ్యం అనేది ఇవ్వాళ సంపూర్ణమైనది. తెలుగు రాజ్యాన్ని సుసాధ్యం చేసిన మా కాకతీయ వంశం పునీతమైనది. ఈ మహాయజ్ఞానికి ప్రధాన కేంద్రమైన మన రాజధాని నగరం ఓరుగల్లు ఇకపై ఆంధ్రనగరిగా సగర్వంగా నిలుస్తుంది."

సభామందిరమంతా "ఆంధ్రనగరి".. "ఆంధ్ర రాజ్యం".. తెలుగు రాజ్యం" ..అనే నినాదాలతో మారుమోగింది.

ఆంధ్రనగరితో పాటు సామ్రాజ్యమంతా సంబరాల్లో మునిగితేలుతోంది. అది సామాన్యమైన విజయం కాదు. నాలుగు తరాలుగా తన కాకతీయవంశ పెద్దలు తీవ్రంగా కలలు కని సాధించలేకపోయిన సుదూర లక్ష్యాన్ని గణపతి దేవుడు సాధించిన అపూర్వ.. అద్భుత చారిత్రాత్మక సామ్రాజ్య రూపం.

మొత్తంగా తెలుగువారి సామ్రాజ్యస్థాపన. తెలుగు మాట్లాడే భాషీయులైన ఆంధ్రులు అనే జాతి వేల సంవత్సరాల తర్వాత తిరిగి ప్రపంచానికి గుర్తు చేస్తున్నారు. తాము ఆంధ్రులమని, తమ భాష తెలుంగు లేదా తెలుగు లేదా తెనుగు.. ఏదైనా అది మాతృ భాషగా కలిగిన తాము తెలుగువారమని, విశ్వామిత్ర మహర్షి పుత్రుల వారసులని,ఇకపై తాము ఆంధ్రులుగా, తెలుగువారిగా.. చెలామణి అవుతామని, తమ సామ్రాజ్యం కాకతీయ సామ్రాజ్యమని.. తమ ప్రధాన రాజధాని ఓరుగల్లు ఆంధ్రనగరి.. అని గొంతెత్తి అరచి చెబుతున్నారు.

అప్పుడే ఓ వేదికపై వేదపండితుల బృందం వేద పఠనం ప్రారంభించింది. రుద్రమదేవి, మురారి దేవుడు అతిథులకు ప్రత్యేకంగా అల్పాహార పదార్థాలను అందిస్తూ పెద్దల ఆశీస్సులను అందుకుంటున్నారు.

ప్రక్క పల్యంకాలలో కూర్చుని ఆత్మీయంగా కబుర్లు చెప్పుకుంటున్న తిక్కనార్యుడు, జాయ సేనాపతి, మరికొందరు కవి పండితులు, ఆస్థాన విషయ నిపుణులు, మధ్య మధ్య గణపతిదేవుని చూపులతో చూపులు కలుపుతూ ఆ ఉద్విగ్న క్షణాలను అనుభూతిస్తున్నారు. మరో పక్క అంకాలశెట్టి తదితర వాణిజ్యశ్రేణి ముఖ్యులు ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

అందరి మధ్య గణపతిదేవుడు నిండు హృదయంతో కల నెరవేర్చుకున్న తృప్తితో, ప్రశాంత వదనంతో వేదపఠనం, ఆవలగా పండితుల ఆశు కవిత్వ పఠనాలను వింటూ, అటూఇటూ ఆనందంగా తిరుగాడుతున్న పరిచారికలు, భటులు, ఉద్యోగుల ముఖాలలో తేజరిల్లుతున్న తెలుగు భావనను చూస్తూ.. విభిన్న వాద్యాల ఉద్విగ్నతల సంగీతహోరు అనుభూతిస్తూ మౌనంగా ప్రశాంతంగా కదలుతున్నాడు.

హఠాత్తుగా ఆయనకు ఎవరో గుర్తుకువచ్చారు.

ఆ నదరు మనిషి ఇక్కడకు రాలేదు. ఎక్కడున్నాడో...!అసలు ఉన్నాడో.. లేడో కూడా తెలియదు. ఊహించలేదు. కాని అతని ఆగమనం కోసం ఆశగా ద్వారం వైపు చూస్తున్నాడు.

ఊహు!!...అతని జాడ లేదు. రాడు.. రాడు గాక రాడు.. వస్తాడన్నది ఆశ కావచ్చు.. ఊహ కావచ్చు!!

తెలుగుప్రపంచం పట్టపగ్గాలులేని ఆనంద సంద్రాల్లో తెలియాడుతుంటే తెలుగుసామ్రాజ్య సాధకుడు,మహారాజ్యాంగవేత్త, మహాయోధుడు గణపతి దేవమహారాజు కించిత్ ఆశతో బోలెడు నిరాశతో ద్వారం వైపు చూస్తూ అటూ ఇటూ తిరుగు తున్నాడు.

ఆయన ఎదురుచూస్తున్న ఆ ఆత్మీయుడు రాలేదు కాని ఊహాతీతంగా మరో పెద్దమనిషి ప్రత్యక్ష మయ్యాడు.

ఆయన ఓ ముదుసలి. మిగల ముగ్గిన పండు శరీరుడు. కాని ఏదో శక్తి, ఏదో ఊహాతీతమైన కోర్కె అతన్ని బతికించాయని ఆయనను చూసిన వారు ఎవరైనా భావిస్తారు.

ఆ ముదుసలిని ఓ పల్లకిలో ఉంచి తీసుకు వచ్చాడు ఓ యువకుడు. బహుశా మనవడు కావచ్చు.

పల్లకిని బోయీలు క్రిందికి దించగా నృత్యసంగీత వేదుకల్లో ఉర్రూతలూగుతున్న కాకతీయ సామ్రాజ్య వీరులు ఒక్కసారిగా నిశ్శబ్దులయ్యారు.

ఆ యువకుడు గణపతిదేవునికి వినమ్రంగా నమస్కరించి, మౌనంగా ఆ పల్లకి వైపు తిరిగి అందుండి ఆ ముదుసలిని ఎత్తుకుని బయటకు తెచ్చాడు.

గణపతిదేవుడు కాస్త కదిలి ఆశ్చర్యంగా కళ్లు చికిలించి అతనిని గుర్తించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

ఆ ముదుసలి కాస్త కదిలి శరీరాన్ని విప్పార్చుకుని తలెత్తి చూశాడు. గణపతిదేవుని గుర్తించాడు.

మనుమడు ఆయనను అలాగే ఎత్తుకుని అక్కడే ఉన్న ఓ పెద్ద ఎత్తైన బల్లపై నిలబెట్టి పట్టుకున్నాడు.

అప్పుడా ముదుసలి గొంతెత్తి అరిచాడు..

"చక్రవర్తీ!ఓ తెలుగు సామ్రాజ్య స్థాపకుడా! గణపతిదేవ చక్రవర్తీ! గణపతిదేవ చక్రవర్తీ! చక్రవర్తి చక్రవర్తీ..!"

వృద్ధాప్యం వల్ల ఆయన చిన్నగా అంటుం టే దానిని అందరికి వినిపించేలా ఆయన మనుమడు ఆయన మాటలను తిరిగి మరింత బిగ్గరగా అరుస్తున్నాడు.

"చక్రవర్తీ.. చక్రవర్తీ!!" "నువ్వు చక్రవర్తివి కాదు అని నిన్ను అవమానించాను. నువ్వు తప్పక తెలుగుసామ్రాజ్యాన్ని సాధిస్తావని, నిన్ను 'చక్రవర్తీ' అని పిలిచి మరణించాలని, నా తెలుగుసామ్రాజ్యంలో మరణించాలని బతికి ఉన్నానయ్యా చక్రవర్తీ..!"

అప్పుడు గుర్తించాడు గణపతిదేవుడు ఆ ముదుసలిని. వేగంగా వెళ్లి ఆయనను ఒడిలోకి హత్తుకున్నాడు.

ఆ ముదుసలి.."చక్రవర్తీ.. చక్రవర్తీ.." అని మంత్రంలా ఉచ్చరిస్తున్నాడు.

ఆయన ప్రాణాలతో అంటున్నాడో!ఆయన మరణించినా ఆయన పాంచభౌతిక శరీరం అలా "చక్రవర్తి" అని పలుకుతుందో.. పలవరిస్తుందో ఇదమిత్థంగా తెలియడం లేదు గణపతిదేవునికి.

విప్పార్చుకుని చూస్తోన్న ఆ ముదుసలి చూపులు.. గణపతిదేవుని చూపులతో కలుసుకున్నాక అవి అలా ఉండిపోయాయి.

"మిత్రమా!నాగతి మండలేశ్వరా! నన్ను చక్రవర్తి అని సంబోధించడానికే బతి ఉన్నారా మహాశయా?!" అన్నాడు గణపతిదేవ చక్రవర్తి,

ఆ మాటలు చెవిన పడ్డాయేమో ఆ ముదుసలి నాగతిమహారాజు ముఖంలో ఓ చిద్విలాసం, ఓ సంతృప్త భావన అలా నిలిచిపోయింది శాశ్వతంగా.. కాకతీయ ఆంధ్రసామ్రాజ్యంలా. (సమాప్తం)

కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి 2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.

జాగృతి ఆధ్వర్యంలో

స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక

'నవలల పోటీ- 2026'

రచనలను ఆహ్వానిస్తున్నాం..

ప్రథమ బహుమతి రూ. 25,000

ద్వితీయ బహుమతి రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.

నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 07 సెప్టెంబర్, 2026

భాగం-47



ప్రజాస్వామ్యంలో రాజసత్త

రాజనీతి శాస్త్రానికి చెందిన అనేక వాదాలను శ్రీకరపాత్రీ స్వామి పరిచయం చేస్తూ వచ్చారు. రూసో రచించిన 'సామాజిక ఒప్పందం' (The Social Contract) అనే గ్రంథం ఆధునిక ప్రజాస్వామ్య సిద్ధాంతానికి మూలస్తంభాల్లో ఒకటి. ఆయన కలలు కన్న ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో లోటుపాట్లను గురించి స్వామి ఇప్పుడు చర్చిస్తున్నారు.

ఆధునిక ప్రజాస్వామ్యంలో పౌరులు ఎన్నికల ద్వారా మాత్రమే కాకుండా ప్రచారం ద్వారా కూడా రాజకీయాలపై ప్రభావం చూపుతారు. భాషణలు, రచనలు, ఉద్యమాల ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తారు. ప్రభుత్వాలు కూడా ప్రజాభిప్రాయానికి అనుగుణంగా తన విధానాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. 'సమాజంలోని వాస్తవిక పాలకులెవరో కనుగొనడం కష్టసాధ్యం అవుతుంది. ఒకప్పుడు ఒక పార్టీ, మరొకప్పుడు మరొకటి, ఇంకొకప్పుడు ఏదైనా ఉద్యమం, మరింకోసారి మరో ప్రచారం సఫలీకృతం అవుతుంటాయి. అందువల్ల సర్వోన్నత పాలకశక్తి ప్రజలలోనే నిహితమై ఉంటుంది. నియమ రూపకల్పన సంస్థ నిర్మాణం దృష్ట్యా ఎన్నికల సంఘం సత్తాధారిగా ఉంటుంది. రాజనీతి విషయంలో సమస్త జనుల అభిప్రాయాల మొత్తమే సత్తాధారిగా ఉంటుంది' అని చెప్తున్నారు.

పైన చెప్పిన చాలా విషయాలు విభిన్న రాజ్యాల నిర్మాణం, చరిత్ర, ఆలోచన – ప్రత్యాలోచనలపై ఆధారపడి మాత్రమే నిర్ణయమవుతాయి. ఇక్కడ

ఔచిత్యం – అనౌచిత్యాలను ఉత్తరోత్తరా ఏర్పడే సంఘటనలు, నమ్మకాలను ప్రమాణంగా తీసుకుని నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. అయితే భారతీయ వివేచకులు దీనిని అంగీకరించరు. 'మానవ చరిత్ర పురోగతి చరిత్ర' – కేవలం ఈ అభిప్రాయంపై ఆధారపడి మునుపటికి పూర్వ ఆలోచనలను, ఘటనలను హేయం గానూ... ఉత్తరోత్తర భావజాలాలు ఉపయోగకరమైనవిగానూ చెప్పడం అనేది కచ్చితంగా అజ్ఞానమే. అలా చెప్పడంవల్ల గతకాలపు బుద్ధి మంతులకు ప్రాముఖ్యం తగ్గుతుంది. ఉత్తరోత్తర కాలాల్లో ఉన్న మూర్ఖులకు ప్రాముఖ్యం పెరుగుతుంది. సంఘటనలనేవి మంచి–చెడ్డ అన్ని రకాలుగానూ ఉంటాయి. భావజాలాల్లో కూడా ఎల్లప్పుడూ మంచివి– చెడ్డవి ఉంటూనే ఉంటాయి. ప్రత్యక్ష్యం, అనుమానం, ఆప్తం, ఆగమసమ్మతం అయిన విచారధారలు– ఘటనలు ఆదరణీయాలవు తాయి. వాటికి విరుద్ధంగా ఉన్నవి హేయమైనవి.

తత్త్వనిర్ణయంలో పరిస్థితి, సంఘటనలు, తాత్కాలిక వరిస్థితుల చేత ప్రభావితమైన ఆలోచనలకు ఎటువంటి ప్రాముఖ్యం లేదు. ఒకచోట దొంగలరాజ్యం ఏర్పడితే, 'అలా ఏర్పడింది కనుక సమంజసమే' అని ఎప్పుడూ భావించరాదు. దానిని నాశనం చేసేందుకు సర్వదా ప్రయత్నాలు జరగాలి. సముచితమైన యోగ్య వ్యవస్థ అతి ప్రాచీనమైనదైనా, భవిష్యత్తులో ఏర్పడడానికి సాధ్యం కాకపోయినా దానిని ఆచరించి తీరాలి.

ధర్మనియంత్రితమైనది, ధర్మసాపేక్షమైనది, పక్షపాతరహితమైనది, సమష్టి – వ్యష్టి వైరుధ్యంలేనిది, సర్వహితకరమైనది అయిన రాజ్యమే రామరాజ్యం, ధర్మరాజ్యం, ఈశ్వరరాజ్యం. అటువంటి రాజ్యానికే ఎల్లప్పుడూ గౌరవం లభించింది; భవిష్యత్తులో కూడా లభిస్తుంది. వర్తమానకాలంలో కూడా అదే లక్ష్యం కోసం కృషిచేయడం తప్పనిసరి. ఈ దృష్టికోణంలో ఏకసత్తావాదానికి చెందిన నిరంకుశ పాలనకు మద్దతు ఇవ్వడం సాధ్యం కాదు.

ఒకప్పటి కాలంలో ప్రభుత్వం యజమానిగా, ప్రజలు దాసులుగా ఉండేవారు. రూసో వ్యవస్థలో ప్రభుత్వం సేవకురాలిగా, ప్రజలు యజమానులుగా ఉంటారు. అతని అభిప్రాయంలో జనవాణియే దైవవాణి. రూసో చెప్పిన ప్రజాస్వామ్య సూత్రాలపై ఆధారపడి ఓట్ల సేకరణ వంటి విధానాలు ఏర్పడ్డాయి. రూసో కూడా ఒక సత్తావాదియే. అతని సిద్ధాంతంలో అన్య సంస్థలకూ సముదాయాలకూ ఎటువంటి స్థానమూ లేదు. పౌరులకు – రాజ్యానికి మధ్య ప్రత్యక్ష సంబంధాలు ఉండాలని అతడు కోరుకున్నాడు.

అతడు బోధించిన పాలనావిధానంలో వార్తాపత్రికలు, మతం, రాజకీయాలు, ఆర్థికం లేదా సాంస్కృతిక సంఘానికి స్థానంలేదు. అతని అభిప్రాయంలో మానవుడు ప్రకృతి సిద్ధంగా పవిత్రుడు. సంఘవిహీనమైన సమాజంలో వ్యక్తి తనంతట తానుగా సామాజిక ఇచ్ఛ లేదా రాజ్యపు సామాన్యేచ్ఛ ప్రకారం ఆలోచిస్తాడు. సంఘాలు – ప్రచార వ్యవస్థల వల్ల నైసర్గిక పవిత్రత క్షీణిస్తుందని అతడు విశ్వసించాడు.

అతని ఈ వాదన కొంతమేరకు సత్యమైనప్పటికీ, నేటి సభ్యసమాజపు పోకడలు, ప్రచార సాధనాలవల్ల మోసాలు–వలపన్నడాలు విస్తృతంగా జరుగుతున్నాయి. అయినప్పటికీ సత్–సంస్కారాల వల్ల సద్బుద్ధి, సద్బుద్ధి ద్వారా సదిచ్ఛ, ఆ సదిచ్ఛ ద్వారా సత్ప్రయత్నం దాంతో సత్ఫలం సిద్ధిస్తాయి. సత్ సంస్కారాలను నిర్ణయించడం అత్యవసరం. ఒకవేళ దురదృష్టవశాత్తు అవినీతిపరులైన సమూహం చేతుల్లోకి అధికారం చేరితే, వార్తాపత్రికలు – ప్రచారాలపై నిషేధం కొనసాగితే, ప్రజలు ఎప్పటికీ పాలనలోని దురాగతాలకు తలవంచి సహించాల్సి వస్తుంది. పాలనాధికారాన్ని మార్చే అవకాశం వారికి ఎప్పటికీ దొరకదు. ఇలా ఆదర్శరాజ్యం పేరుతో నియంతృత్వం ఏర్పడుతుంది.

రూసో రాజ్యం ద్వారా ఒక పౌర ధర్మాన్ని కూడా సృష్టించాలనుకున్నాడు. ఈ విధంగా అన్ని రంగాలలో రాజ్యమే ఆధిపత్యం చెలాయిస్తుంది. వ్యక్తి అభివృద్ధికి అవకాశాలు పూర్తిగా అంతరించిపోతాయి. ఈ కాలంలో సామాన్యేచ్ఛను అర్థం చేసుకోవడం ఎంత కష్టమో కదా! ప్రత్యేకించి వ్యక్తి స్వాతంత్ర్యం, ప్రచురణ, విస్తారమైన భాషణలకు సాధనాలు లేకపోతే అది మరింత కష్టతరమవుతుంది.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

నావికుల మ

అంతర్జాతీయ సంఘర్షణల (ఇరాన్–యుఎస్– ఉక్రెయిన్–రష్యా) కారణంగా వాణిజ్య నౌకల్లో ప్రయాణిస్తున్న పౌర నావికుల రక్షణకు అంతర్జాతీయ చట్టాలు ఉన్నప్పటికీ, అవి ఉల్లంఘనకు గురవుతున్నాయి. దాడుల్లో మనదేశ నావికులు ప్రాణాలు కోల్పోయినప్పుడు భారత ప్రభుత్వం సంబంధిత దేశాల రాయబారులను పిలిపించి తీవ్ర నిరసన, దౌత్యపరమైన ఆందోళనలను తెలియజేస్తోంది. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే ఇతర దేశాలతో మన సంబంధాలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలే ఎక్కువ. భారతీయ నావికుల మరణాలపై మన విదేశాంగశాఖ వ్యక్తం చేసిన తీవ్ర నిరసనలకు రష్యా, అమెరికా, ఇరాన్ దేశాలు దౌత్యపరంగా వేర్వేరు రీతుల్లో స్పందించాయి. ఉక్రెయిన్ తీరంలో 'ఎంవీ గోల్డెన్ లియో' నౌకపై జరిగిన క్షిపణి దాడిలో నలుగురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ, తాము భారతీయ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అయితే, రష్యా తన సైనిక చర్యను సమర్థించుకుంటూ, ఉక్రెయిన్ ప్రభుత్వానికి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని సరఫరా చేస్తున్నట్లు భావించే నౌకలను మాత్రమే తాము లక్ష్యంగా చేసుకుంటున్నామని, భవిష్యత్తులోనూ ఇటువంటి దాడులు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

దీనిని 'యాదృచ్ఛిక నష్టం'గా పేర్కొంది. హర్ముజ్ జలసంధి సమీపంలో 'ఎంటీ సెట్టెబెల్లో' చమురు ట్యాంకర్‌పై జరిగిన అమెరికా దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన సంఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) స్పందిస్తూ, ఇరాన్ ఓడరేవులపై విధించిన నావికాదళ ఆంక్షలను సదరు నౌక ఉల్లంఘించిందని తెలిపింది. పదే పదే చేసిన హెచ్చరికలను నౌక సిబ్బంది పాటించనందుకే తాము దాడులు చేయవలసి వచ్చిందని అమెరికా వివరణ ఇచ్చింది. హర్ముజ్ జలసంధిలో 'ఎంటీ అల్ బహియా', 'ఎంటీ మొంబాసా' నౌకలపై జరిగిన దాడుల్లో ఒక భారతీయ నావికుడు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. దీనిపై భారత్ నిరసనకు స్పందనగా తాము నౌకలకు ముందస్తు హెచ్చరికలు జారీచేశామని ఇరాన్ తెలిపింది. వాణిజ్య నౌకలు తమ ప్రయాణాల కోసం ఇరాన్ ఆమోదించిన సురక్షిత మార్గాలను మాత్రమే ఉపయోగించాలని, అంతర్జాతీయ జలసంధులను దుర్వినియోగం చేయవద్దని ఇరాన్ సైన్యం స్పష్టం చేసింది. మొత్తంగా, ఈ దేశాలన్నీ భారత పౌరులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంచేసుకోలేదని స్పష్టంచేస్తూనే, తమ సొంత యుద్ధ వ్యూహాలు, ఆంక్షల అమలు ప్రక్రియలోనే ఈ దాడులు జరిగాయని వాదిస్తున్నాయి.

ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం

భారతీయ నావికుల మరణాలు, తదనంతర దౌత్యపరమైన ఆందోళనలు రష్యా, అమెరికా దేశాలతో ఉన్న ద్వైపాక్షిక సంబంధాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి.రష్యా దాడిలో భారతీయ నావికుల మరణించడంవల్ల, ఈ వాణిజ్య ప్రయోజనాలకంటే పౌరుల భద్రతే ముఖ్యమనే ఒత్తిడి భారత ప్రభుత్వంపై పెరుగుతోంది. ఉక్రెయిన్‌కు వెళ్లే నౌకలపై దాడులు ఆపబోమని రష్యా స్పష్టం చేయడం భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది.ఎందుకంటే, అంతర్జాతీయ వాణిజ్య నౌకల్లో వేలాదిమంది భారతీయ నావికులు పని చేస్తున్నారు. దీనివల్ల రష్యాతో ఉన్న దౌత్యచర్చల్లో భారత్ గట్టిగా వ్యవహరించక తప్పడంలేదు. ఇకముందు భారత్ తన నిరసన స్వరాన్ని పెంచడం సహా, రష్యా తీసుకునే సైనిక నిర్ణయాలను బహిరంగంగా విమర్శించే పరిస్థితులు రావచ్చు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనాను అడ్డుకోవడానికి భారత్, అమెరికాలు కలిసి 'క్వాడ్' కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. కానీ, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా చేసిన దాడిలో భారతీయులు మరణించడం ఈ వ్యూహాత్మక బంధానికి ఎదురుదెబ్బ.ఈ దాడులపై భారత్ అసంతృప్తితో ఉంది. అమెరికా తన సైనిక చర్యల్లో మరింత బాధ్యతగా వ్యవహరించాలని భారత్ డిమాండ్ చేస్తోంది. రక్షణరంగంలో అమెరికాతో సహకారం కొనసాగుతున్నప్పటికీ, అమెరికా తీసుకునే ఏకపక్ష నిర్ణయాలకు భారత్ దూరంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిణామాలు రష్యా లేదా అమెరికా.. ఎవరితోనైనా సరే, భారత్ కేవలం తన జాతీయ ప్రయోజనాలు, పౌరుల రక్షణ ఆధారంగానే సంబంధాలను నిర్ణయించుకుంటుందని స్పష్టం చేస్తున్నాయి.

భిన్నప్రభావాలు

వాణిజ్య నౌకలపై జరిగిన దాడులు, భారతీయ నావికుల మరణాలు, దానికి సమాధానంగా భారత్ అనుసరిస్తున్న దౌత్యవిధానం ఆయా దేశాలతో మన సంబంధాలపై భిన్నమైన ప్రభావాలను చూపిస్తోంది. ప్రపంచంలోనే అత్యధికంగా నావికులను సరఫరా చేసే దేశాలలో భారత్ మూడవస్థానంలో ఉంది. కనుక, ఈ దాడులు భారత్‌కు కేవలం దౌత్యపరమైన అంశం మాత్రమే కాదు, మానవత– ఆర్థికపరమైన సమస్య కూడా. హిందూ–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా, భారత్ బలమైన రక్షణ భాగస్వాములు. అయితే, అమెరికా దాడిలో భారతీయ నావికులు మరణించడం, భారత్ దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ అమెరికా రాయబారికి సమన్లు జారీ చేయడం ఇరు దేశాల మధ్య కొంత ఉద్రిక్తతలకు దారితీసిన మాట నిజం. భవిష్యత్తులో అమెరికా నేతృత్వంలోని సముద్ర రక్షణ దళాలలో భాగస్వామయ్యే ముందు, వాణిజ్య నౌకల్లో ఉండే తమ పౌరుల రక్షణకు స్పష్టమైన హామీ ఇవ్వాలని భారత్ డిమాండ్ చేసే అవకాశం ఉంది. రష్యా దాడిలో నలుగురు భారతీయ

నావికులు మరణించిన ఘటన ఇరుదేశాల సుదీర్ఘ స్నేహ బంధాన్ని పరీక్షిస్తోంది. రష్యా నుండి భారత్ భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తోంది కాబట్టి సంబంధాలు పూర్తిగా దెబ్బతినకపోయినా, రష్యా దాడులను భారత్ బహిరంగంగా ఖండించడం ఇరు దేశాల దౌత్య సంబంధాలలో కొంత అసంతృప్తిని మిగిల్చింది. హర్ముజ్ జలసంధిలో ఇరాన్ దళాలు జరిపిన దాడుల్లో భారతీయ నావికుడు మరణించడంపై భారత్ ఇరాన్ రాయబారిని పిలిపించి గట్టి నిరసన తెలిపింది. చాబహార్ పోర్ట్ వంటి ప్రాజెక్టుల ద్వారా ఇరాన్‌తో భారత్‌కు సంబంధాలు ఉన్నాయి. కానీ ఇరాన్ చర్యలు ఈ ప్రాంతంలో భారత వాణిజ్య ప్రయోజనాలకు ముప్పుగా మారాయి. ఇరాన్ తన శత్రు దేశాలపై చేసే దాడుల వల్ల భారత్ చమురు దిగుమతులు, గల్ఫ్ ప్రాంతంలో ఉండే కోట్లాది మంది భారతీయుల

రణాలు, దౌత్య చిక్కులు

భద్రత ప్రమాదంలో పడుతోంది. భారత్ తన నిరసన ద్వారా 'సముద్ర మార్గాల్లో స్వేచ్ఛా రవాణా'కు భంగం వాటిల్లకూడదని ఇరాన్‌కు స్పష్టమైన సంకేతం పంపింది. అటు అమెరికాతో వ్యూహాత్మక భాగ స్వామ్యాన్ని కాపాడుకుంటూనే, ఇటు ఇరాన్‌తో ఉన్న చారిత్రాత్మక, వాణిజ్య సంబంధాలు దెబ్బతిన కుండా భారత్ సమతుల్యత పాటిస్తోంది. ఈ ఘటనలవల్ల భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై ఆ దేశాల చర్యలను భారత్ సమర్థించే అవకాశం తగ్గుతుంది.

భారత నావికాదళ చర్యలు

గల్ఫ్, ఎర్ర సముద్రం ప్రాంతాలలో పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య, వాణిజ్య నౌకలు,

నావికులను రక్షించడానికి భారత నౌకాదళం అత్యంత శక్తిమంతమైన వ్యూహాత్మక ఆపరేషన్లను నిర్వహిస్తోంది. హిందూ మహా సముద్ర ప్రాంతంలో 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా భారత్ తన ప్రభావాన్ని చాటుకుంటోంది. ఆపరేషన్ సంకల్ప్ ద్వారా గల్ఫ్ ఆఫ్ ఒమన్, పర్షియన్ గల్ఫ్, హర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే భారతీయ జెండాతో కూడిన వాణిజ్య నౌకలకు రక్షణ కల్పిస్తోంది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తీవ్రమవడంతో, భారత నౌకాదళం తన యుద్ధనౌకలను అక్కడ మోహరించింది. అమెరికా నేతృత్వంలో నిర్వహిస్తున్న 'ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్'లో భారత్ అధికారికంగా చేరలేదు. స్వతంత్రంగా చేపడుతున్న ఈ ఆపరేషన్ల ద్వారా భారత్ తన పౌరుల ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, అంతర్జాతీయ సముద్ర వాణిజ్య మార్గాల భద్రతలో కీలక భాగస్వామిగా నిలుస్తోంది.

నావికుల రక్షణకు కొత్త చట్టాలు

అంతర్జాతీయంగా పెరుగుతున్న భద్రతా సవాళ్ల నేపథ్యంలో భారతీయ నావికుల రక్షణ, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన చట్టాలతో పాటు సరికొత్త పద్ధతులను అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా 1958 నాటి పాత చట్టాన్ని రద్దు చేస్తూ, సరికొత్త మర్చంట్ షిప్పింగ్ యాక్ట్-2025ను ఈ ఏడాది మార్చి15 నుంచి అమల్లోకి తెచ్చారు. ఇది అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నావికుల భద్రత, హక్కులను బలోపేతం చేస్తుంది. విదేశీ సముద్రాల్లో చిక్కుకు పోయిన లేదా యజమానుల నిర్లక్ష్యానికి గురైన నావికులను ఆదుకోవడానికి ఈ చట్టంలో ప్రత్యేక నిబంధనలు చేర్చారు. గల్ఫ్, హర్ముజ్ జలసంధి వంటి ఉద్రిక్త ప్రాంతాల్లో ప్రయాణించే ప్రతి భారతీయ నావికుడిని పర్యవేక్షించడానికి ప్రభుత్వం 'సీఫేరర్-ఫస్ట్' ఎమర్జెన్సీ రెస్పాన్స్ అండ్ రియల్-టైమ్ డ్యాష్‌బోర్డ్ పేరిట ప్రత్యేక ఆపరేషనల్ డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా సదరు నౌక ఎక్కడుంది? అందులోని సిబ్బంది క్షేమ సమాచారం, ఆ ప్రాంతంలో ఉన్న ముప్పు వంటి వివరాలను ప్రభుత్వం 24/7 పర్యవేక్షిస్తుంది. యుద్ధ ప్రమాదం ఉన్న ప్రాంతాలకు భారతీయ నావికులను పంపవద్దని షిప్పింగ్ కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో సిబ్బందిని మార్చాల్సి వస్తే, సదరు నావికుల పూర్తి అంగీకారంతో పాటు ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి చేశారు. విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు, నావికా దళంతో సమన్వయం చేసుకుంటూ అత్యవసర రక్షణ కల్పించడానికి 24/7 హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. యుద్ధ ప్రాంతాలలో ప్రయాణించే నావికులు, వారి కుటుంబసభ్యుల మానసిక ఆందోళనలను తగ్గించడానికి ప్రత్యేక సైకలాజికల్ కౌన్సెలింగ్‌ను ఇందులో భాగంగా అందిస్తున్నారు. భారతీయ నావికుల ప్రాణాలకు అంతర్జాతీయ జలాల్లో ప్రాధాన్యత ఇవ్వడమే ఈ సరికొత్త పాలసీల ఉద్దేశం.

సముద్రయాన రంగంలో ప్రత్యేక స్థానం

అంతర్జాతీయ సముద్రయాన రంగంలో భారత దేశానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నావికులలో దాదాపు 10% నుండి 12%మంది భారతీయులే. ఈ మానవ వనరుల శక్తిని, పెరుగుతున్న అంతర్జాతీయ ప్రభావాన్ని ఉప యోగించి భారత్ తన పౌరుల రక్షణకోసం సరికొత్త దౌత్య, వ్యూహాత్మక చర్యలను చేపడుతోంది. లండన్‌లోని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) కౌన్సిల్‌లో భారత్ అత్యధిక ఓట్లతో తిరిగి ఎన్నికైంది. ఈ వేదికద్వారా, యుద్ధప్రాంతాలలో వాణిజ్యనౌకలపై జరిగే దాడులను 'అంతర్జాతీయ నేరాలు'గా పరిగణించాలని భారత్ వాదిస్తోంది. సముద్ర దొంగలు లేదా ఉగ్రవాదదాడులకు గురయ్యే నావికులకు అంతర్జాతీయ చట్టాల ప్రకారం తక్షణ న్యాయం, నష్టపరిహారం అందేలా కొత్త గ్లోబల్ ప్రోటోకాల్స్ కోసం భారత్ ఒత్తిడి తెస్తోంది. అంతర్జాతీయ రవాణా కార్మికుల సమాఖ్య (ఐటీఎఫ్), వివిధ దేశాలతో దౌత్యపరమైన ఒప్పందాల ద్వారా భారత్ ఒక కీలక నిబంధనను తెచ్చింది. దీని ప్రకారం, ఏ నావికుడైనా సరే.. ఓడ ప్రయాణించే మార్గం ప్రమాదకరమైన యుద్ధప్రాంతం అని తెలిస్తే, ఆ ప్రయాణాన్ని తిరస్కరించే చట్టపర మైన హక్కు వారికుంటుంది. కంపెనీలు వారిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోకూడదు. పౌర నావికులు ఏ దేశానికి చెందిన యుద్ధంలోనూ భాగస్వాములు కారని, వారిపై దాడులు జరిగితే ఆయా దేశాలతో దౌత్య, ఆర్థిక సంబంధాలు దెబ్బతింటాయని భారత్ నేరుగా హెచ్చరిస్తోంది. గురుగ్రామ్‌లోని 'ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ - ఇండియన్ ఓషన్ రీజియన్' ద్వారా భారత్ ప్రపంచంలోని 50కిపైగా దేశాల నావికాదళాలతో రియల్-టైమ్ సమాచారాన్ని పంచుకుం టున్నది. సముద్రమార్గాల్లో ఎక్కడైనా డ్రోన్‌దాడులు, క్షిపణి ముప్పు లేదా సముద్ర దొంగల కదలికలు ఉంటే, ఆ మార్గంలో ప్రయాణించే భారతీయ నావికులు ఉన్న ఓడలను ముందే అప్రమత్తం చేయడానికి ఈ వ్యవస్థ ఉపయోగ పడుతుంది. యుద్ధ ప్రాతిపదికన నడిచే ప్రాంతాల్లో ప్రయాణించే నావికులకు ప్రత్యేక 'రిస్క్ అలవెన్స్', ప్రమాదం జరిగితే భారీ మొత్తంలో అంతర్జాతీయ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ వేగంగా వచ్చేలా అంతర్జాతీయ షిప్పింగ్ లైనర్లపై భారత్ నిబంధనలను కఠినతరం చేసింది. భారతదేశం కేవలం ఒక దేశంగానే కాకుండా, ప్రపంచ నౌకాయాన రంగాన్ని శాసించగల ఒక 'నావికా శక్తి'గా తన ప్రభావాన్ని ఉపయోగించి ప్రపంచంలోని ఏ మూలన ఉన్న భారతీయ నావికుడికైనా రక్షణ కల్పించడానికి కట్టుబడి ఉందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

దేవాలయాల

భారతీయ నాగరికతకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఆ చరిత్రకు సజీవ సాక్ష్యాలు.. మన దేవాలయాలు! కానీ, నేటికీ వాటి వెనక ఉన్న ఎన్నో విషయాలు అంతుపట్టని రహస్యాలుగా మిగిలిపోయాయి. సాధారణంగా అయితే ఆలయాలను భక్తికి, ఆధ్యాత్మికతకు ప్రతీకలుగా భావిస్తాం. కానీ నిశితంగా పరిశీలిస్తే ఖగోళ విజ్ఞానం, లోహశాస్త్రం, శిల్పకళ వంటి అనేక విజ్ఞాన రంగాల సమన్వయం వాటి నిర్మాణంలో కనిపిస్తుంది. అందుకే భారతీయ దేవాలయాలను కేవలం ఆరాధనా కేంద్రాలుగా మాత్రమే కాకుండా, తత్వం, శాస్త్రం, కళ, సంస్కృతి కలగలిసిన ఒక సమగ్ర విజ్ఞానవ్యవస్థగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంగా దేవాలయాల వెనుక దాగి ఉన్న శాస్త్రీయ విశేషాలు, నిర్మాణ రహస్యాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

భారతీయ సంస్కృతిలో ప్రతి పదం వెనుక ఒక శాస్త్రీయపరమైన అర్థం దాగి ఉంటుంది. ఉదాహరణకు "గ్రహం" అనే పదం 'గ్రహ్' అనే ధాతువు నుండి ఉద్భవించింది. గ్రహించడం, ఆకర్షించడం, తన గురుత్వంలో బంధించడం అని ఈ పదానికి అర్థం. ఖగోళశాస్త్రపరంగా చూస్తే.. విశ్వంలోని గ్రహాలు అన్నీ సూర్యుని గురుత్వా కర్షణ కారణంగా, సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉంటాయి. కాబట్టే వాటిని మనం గ్రహాలు అని పిలుచుకుంటాం. ఈ "గ్రహం" అనే పదానికి "వి" అనే ఉపసర్గ చేరినప్పుడు "విగ్రహం" అనే పదం ఏర్పడుతుంది. "వి" అంటే విశిష్టమైనది, ప్రత్యేకమై నది అని అర్థం. అంటే.. విగ్రహం అనేది సాధారణ రాతి శిల కాదు; మన మనసును ఒక దగ్గర కేంద్రీకరించి, ఏకాగ్రతను పెంచే ఒక విశిష్టమైన ప్రతీక. భక్తుడు విగ్రహం చుట్టూ చేసే ప్రదక్షిణ కూడా ఒక తాత్విక సంకేతం. గ్రహాలు సూర్యుని చుట్టూ పరిభ్రమించినట్లే, జీవి తన జీవిత కేంద్రంగా భావించే పరమతత్వం చుట్టూ తిరుగుతూ తన అహంకారాన్ని విడిచిపెట్టాలనే భావన ఇందులో అంతర్లీనంగా ఉంటుంది.



అదే విధంగా "ప్రకృతి" అనే పదాన్ని పరిశీలించినప్పుడు కూడా మన పూర్వికుల తాత్విక దృష్టి కోణం ఎంత గొప్పదో అర్థమవుతుంది. "కృతి" అంటే కూర్చినది అని అర్థం. ఈ పదానికి ప్రకృష్టంగా అనే అర్థం ఉన్న "ప్ర" అనే ఉప సర్గ చేరడం ద్వారా ప్రకృష్టంగా కూర్చినది అనే అర్థం వస్తుంది. అంటే... పంచభూతాల సమన్వయంతో ఏర్పడిన ఈ జగత్తులో ప్రతి రాయి,చెట్టు, పర్వతం, నది జీవనానికి ఆధారం. అందుకే భారతీయ సంస్కృతి ప్రకృతిని జయించాల్సిన వస్తువుగా కాకుండా ఆరాధించాల్సిన తల్లిగా చూసింది. చెట్టును దేవతగా, నదిని దేవిగా, పర్వతాన్ని పుణ్యక్షేత్రంగా, భూమిని భూదేవిగా భావించడం వెనుక ప్రకృతి పట్ల కృతజ్ఞతా భావమే ప్రధాన కారణం. ఈ ఆలోచనా విధానం నేటి పర్యావరణ పరిరక్షణ సిద్ధాంతాలకు కూడా చాలా దగ్గరగా కనిపిస్తుంది.

ఇక.. ఆధ్యాత్మిక విషయాల్లో అత్యంత విశిష్టమైన ప్రతీకలలో శివలింగం ఒకటి. లింగాన్ని కేవలం ఆరాధనా చిహ్నంగా మాత్రమే కాకుండా విశ్వసృష్టికి ప్రతీకగా కూడా అనేక తాత్విక గ్రంథాలు వ్యాఖ్యానించాయి. శివలింగం గుండ్రటి ఆకారం భూమిని తలపిస్తుంది. శివుని జటాజూటంపై చంద్రుడు ఉండటం – భూమిపైన చంద్రుడు ఉండటం – శివుడి తలపై గంగాదేవి ఉండటం – భూమిపై వర్షం కురిస్తే సస్యశ్యామలం అవ్వడం వంటివన్నీ మన నిత్య జీవితచక్రానికి ఆధ్యాత్మిక రూపకాలు. ఈ మొత్తం ప్రక్రియను ప్రకృతి చక్రాలను ప్రతీకాత్మకంగా వివరించే భారతీయ చింతనకు ఒక ఉదాహరణగా చూడవచ్చు.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనే త్రిమూర్తుల భావన కూడా ప్రకృతి నిర్వహణలోని మూడు స్థితులను సూచించే తాత్విక రూపకాలుగా వివరించారు. "బ్రహ్మ" అనే పదం విస్తరణను, సృష్టిని సూచిస్తుంది. "విష్ణు" అనే పదం వ్యాపించడం, సర్వవ్యాప్తిని సూచిస్తుంది. "శివ" అనే పదానికి శుభం, మంగళం, కల్యాణం అనే అర్థాలు ఉన్నాయి. సృష్టి, స్థితి, లయం అనే ప్రక్రియలను వ్యక్తీకరించేందుకు భారతీయులు ఈ రూపకాలను ఉపయోగించారు. అందువల్ల దేవతలను కేవలం వ్యక్తులుగా కాకుండా విశ్వంలో నిరంతరం జరిగే సహజ ప్రక్రియలకు ప్రతీకలుగా కూడా భావించాల్సిన అవసరం ఉంది.

ఈ నేపథ్యాన్ని అర్థం చేసుకున్న తర్వాత దేవాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తే... ఉత్తర భారతదేశంలోని గోపురాలు నాగుపాము ఆకారాన్ని పోలిన నాగర శైలిలో ఉంటాయి. మధ్యభారతదేశంలోని గోపురాల శైలి వేసర శైలి. అంటే.. ఉత్తర, ద్రావిడ నిర్మాణాల సమన్వయాన్ని ప్రతిబింబిస్తుంది. దక్షిణ భారతదేశంలోనివి ద్రావిడ శైలి గోపురాలు. విశాల ప్రాకారాలు, ఎత్తైన ధ్వజస్తంభాలు, లోహ కలశాలతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్యకాలంలో, శ్రీకృష్ణదేవరాయల పరిపాలనలో నిర్మించిన దేవాలయాలు శిల్పకళా వైభవానికి అద్భుత నిదర్శనాలుగా నిలిచాయి.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... ఆధునిక కాలంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కమ్యూనికేషన్ టవర్లు అభివృద్ధి చెందిన తర్వాత మనం వాటిని అత్యాధునిక సాంకేతిక నిర్మాణాలుగా భావిస్తున్నాం. అయితే వేల సంవత్సరాల క్రితం నిర్మించిన దేవాలయాలలో కూడా ధ్వజస్తంభాలు, లోహ కలశాలు, గోపురాలు, పంచలోహ విగ్రహాలు, ప్రాకారాల వంటి నిర్మాణాలు ఎందుకు వాడాల్సి వచ్చింది? ఇవి కేవలం ఆధ్యాత్మిక అవసరాల కోసమేనా? లేక నిర్మాణశాస్త్రం, ధ్వనిశాస్త్రం, లోహశాస్త్రం, ఖగోళ విజ్ఞానం వంటి అనేక అంశాల సమన్వయ ఫలితమా? సంప్రదాయ విశ్వాసాలను గౌరవిస్తూనే, వాటిని ఆధునిక శాస్త్రీయ దృష్టి కోణంలో కూడా పరిశీలించడం కూడా చాలా అవసరం. అప్పుడే భారతీయ దేవాలయ వ్యవస్థ గొప్పతనాన్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

ఈ ఆధునిక శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించినప్పుడు, మన ఆలయాలలో కనిపించే ప్రతి ఆచారం వెనుక సైన్స్ దాగి ఉందనే నిజం బోధపడుతుంది. మన పూర్వికులు ఆలయ వ్యవస్థను కేవలం పూజా మందిరాలుగా కాకుండా,

లో శాస్త్రీయత

ఒక పవర్ గ్రిడ్ తరహాలో 'ఎనర్జీ మేనేజ్‌మెంట్' (శక్తి నిర్వహణ) కేంద్రాలుగా తీర్చిదిద్దారు. దీనికి ప్రధాన ఆధారాలు మనకు ఆధ్యాత్మిక పరిభాషలో వినిపించే ఔషధం, మంత్రం, తంత్రం, యంత్రాల రూపాల్లో కనిపిస్తాయి. ఉదాహరణకు, ఆలయ ప్రాంగణాల్లో పెంచే తులసి, మారేడు, రావి వంటి మొక్కలు వాతావర ణాన్ని శుద్ధిచేసే ఆయుర్వేద ఔషధాలుగా పనిచేస్తాయి. మనం పండగలలో, శుభకార్యాలలో ఉపయోగించే మామిడి ఆకులు చెట్టునుండి వేరు చేసినా 24 గంటల పాటు ఆక్సిజన్‌ను విడుదల చేస్తూనే ఉంటాయి. గుడిలో వందలమంది భక్తులు ఒక దగ్గర చేరినా అందరికీ సరిపడా ప్రాణవాయువు అందాలనే దూరదృష్టితోనే మామిడి తోరణాలు కట్టే సంప్రదాయాన్ని తెచ్చారు మన పూర్వీకులు. అలాగే అర్చకులు పూజావిధానాల్లో ప్రదర్శించే విభిన్న రకాల 'ముద్రలు' మన శరీరంలోని నాడీ వ్యవస్థను ఉత్తేజపరిచే సూక్ష్మ వ్యాయామాలుగా ఉపయోగపడతాయి. శరీరంలోని ప్రాణశక్తిని, ఏకాగ్రతను పెంచే ఈ ప్రక్రియనే ఆధ్యాత్మికంగా 'తంత్రం' అంటారు.

ఇక గర్భగుడిలో అర్చకుల నోటినుండి వచ్చే వేద మంత్రోచ్ఛారణలు (మంత్రం) సాధారణ శబ్దాలు కావు, అవి ఒక ప్రత్యేకమైన ధ్వనితరంగాలను, విద్యుదయస్కాంత శక్తిని సృష్టిస్తాయి. ఈ శబ్ద తరంగాల సూక్ష్మ భావాలు అక్కడి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చి, మానవ మనస్సును ఉత్తేజపరుస్తాయి. ఈ విధంగా ఉత్పన్నమయ్యే మానసిక, ధ్వని శక్తులను గ్రహించి, భద్రపరచడానికి ఆలయాలలో 'యంత్రాలు' అనే లోహ వాహకాలను ఉపయోగించారు.

దేవాలయాల నిర్మాణ సమయంలో భూమి పూజలోనే వివిధ రకాల లోహా లను, నవరత్నాలను నిక్షిప్తం చేయడం మనం గమనించే ఉంటాం.. దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటంటే, అవి భూగర్భ శక్తిని గ్రహించే రిసీవర్లుగా పనిచేస్తాయి. వాయు, ద్రవ పదార్థాలతో పోలిస్తే పంచలోహాల వంటి ఘన పదార్థాలలో అణువులు అత్యంత దగ్గరగా ఉండటం వల్ల శక్తి ఒక అణువు నుండి మరో అణువుకు సులభంగా ప్రసరిస్తుంది. అందుకే ధ్వజస్తంభాల కింద, మూలవిరాట్టు కింద లోహపు పలకలను ఉంచి, ఆలయ శిఖరాలపై లోహపు కలశాలను, తొడుగులను అమర్చారు. ఇవి మంత్ర తంత్రాల ద్వారా విడుదలయ్యే శక్తికి అద్భుతమైన వాహకాలుగా (Conductors) పనిచేస్తాయి.

దేవాలయాలలో నిత్యం జరిగే అభిషేకప్రక్రియ వెనుక కూడా ఒక అద్భుతమైన భౌతికశాస్త్ర సూత్రం ఇమిడి ఉంది. గర్భగుడిలోని పంచలోహ లేదా శిలా విగ్రహంపై ఎత్తు నుండి పాలు, నీరు వంటి ద్రవ్యాలతో అభిషేకం చేసినప్పుడు, అక్కడ 'స్థితి శక్తి' కాస్తా 'గతి శక్తి'గా మారుతుంది. ఆధునిక కాలంలో జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఎత్తైన ప్రదేశం నుండి నీరు టర్బైన్లపై పడినప్పుడు విద్యుత్ శక్తి ఎలా

జనిస్తుందో, ఆలయాల్లో జరిగే ఈ అభిషేక ప్రక్రియ ద్వారా కూడా అదే తరహాలో సూక్ష్మశక్తి తరంగాలు ఉత్పత్తి అవుతాయి. ఇలా మంత్ర, తంత్ర, యంత్రాల ద్వారా విశ్వవ్యాప్తంగా అంతర్గతంగా ఉన్న సకారాత్మక శక్తిని గ్రహించి, నిల్వ చేసుకొని, తమ వద్దకు వచ్చే భక్తులకు అందించే అద్భుతమైన శక్తి నిర్వహణ కేంద్రాలుగా మన ఆలయాలు విరాజిల్లుతున్నాయి.

ఈ మొత్తం ఆలయ వ్యవస్థను నిశితంగా గమనిస్తే, నేటి ఆధునిక విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఇది ఒక ప్రతిరూపంగా కనిపిస్తుంది. పవర్ స్టేషన్‌లోని జనరేటర్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్, ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సబ్-స్టేషన్లకు చేరి, అక్కడి నుండి విద్యుత్ స్తంభాల సహాయంతో ఇళ్లకు, పరిశ్రమలకు ఎలా చేరుతుందో, ఆలయాలలోనూ సరిగ్గా అదే ప్రక్రియ సాగుతుంది. విద్యుత్తును ఉత్పత్తి చేసే జనరేటర్ వంటి గర్భగుడి నుండి, అర్చకులనే ఎలక్ట్రీషియన్ల సహాయంతో శక్తి బయటకు వస్తుంది. అది అంతరాలయంలో ప్రయాణించి, పరివార దేవతల ద్వారా విస్తరిస్తూ, విద్యుత్ స్తంభాల వంటి ధ్వజస్తంభాల సహాయంతో సమాజంలోని సామాన్యుల నుండి మహాభక్తుల దాకా అందరికీ వారి వారి గ్రహణ శక్తిని బట్టి అందుతుంది. అందుకే గుడికి వెళ్లే భక్తులు అక్కడ మానసిక ప్రశాంతతను, ఒక తెలియని నూతన ఉత్తేజాన్ని పొంది, తమ జీవిత సమస్యలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని సంపాదిస్తున్నారు. వేలాది సంవత్సరాల క్రితమే ఇంతటి అద్భుతమైన సాంకేతిక దూరదృష్టి కలిగిన మన పూర్వీకులు అనాగరికులు ఎంతమాత్రం కాదు, వారు కాలం కంటే ముందు నడిచిన అసలైన ఆధునికులు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఒక్క మాటలో చెప్పాలంటే... దేవాలయాలు అనేవి భక్తిభావాన్ని పెంచే రాతి కట్టడాలు మాత్రమే కావు.. అవి ఆధ్యాత్మికత రూపంలో మన పూర్వికులు సమాజానికి అందించిన అధునాతన శాస్త్ర సాంకేతిక నిలయాలు. ఆధునిక విజ్ఞానం ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్న ఎన్నో విషయాలను, వేల సంవత్సరాల క్రితమే మన పెద్దలు జీవనవిధానంలో భాగం చేశారు. ఇలాంటి అద్భుతమైన వ్యవస్థను మూఢనమ్మకాల పేరిట కొట్టిపారేయడం ఎంత తప్పో, కేవలం పూజలకే పరిమితం చేసి వాటి వెనుక ఉన్న సైన్స్‌ను విస్మరించడం కూడా అంతే తప్పు. కనుక, సంప్రదాయాన్ని గుడ్డిగా కాకుండా, అందులోని శాస్త్రీయ దృక్పథాన్ని, తత్వాన్ని అర్థం చేసుకుని నేటి తరానికి అందించినప్పుడే మన సంస్కృతికి మనం నిజమైన గౌరవం ఇచ్చినట్లవుతుంది. ఆ అద్భుత విజ్ఞాన వారసత్వాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగడమే ప్రస్తుతం మన అందరి బాధ్యత!

Reference Books:

1. కమలాకర శర్మ, సాగి. జ్యోతిష కమలాకరం, తేజశ్రీ ప్రచురణలు
2. దేవాలయం – హైందవ సంస్కృతికి ప్రతీక, మోహన్ పబ్లికేషన్స్
3. వేంకటసత్య బ్రహ్మాచార్య, కందుకూరి. శ్రీ మయమత శిల్పశాస్త్రము – ప్రతిమా లక్షణం
4. శివనాగిరెడ్డి, ఈమని. ఆలయ నిర్మాణం – ప్రాసాద లక్షణం.

మ్యాడం అభిలాష్, కంటెంట్ రైటర్,
TAL Radio, 8142576346

‘ఏకాత్మతా స్తోత్రం’ కేవలం ఒక ప్రార్థన మాత్రమే కాదు. అది ఒక నాగరికతాపరమైన ప్రకటన. సత్యాన్ని చేరుకోవడానికి అనేక మార్గాలు ఉంటాయని, స్త్రీ,పురుషులు కలిసి సమాజాన్ని తీర్చిదిద్దుతారని, అలాగే భారతదేశం అనే విశాలమైన జీవన ప్రవాహంలో ప్రతి వర్గం, ప్రాంతం, సంప్రదాయం తమకంటూ ఒక స్థానాన్ని పొందినప్పుడు జాతీయ సమైక్యత బలపడుతుందనే భారతీయ దృక్పథాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.

ఒకే దేశం : ఏకాత్మతాస్తోత్రం సందేశం

అస్తిత్వం, జాతీయవాదం, లౌకికవాదం, సాంస్కృతిక అనుబంధం వంటి అంశాలు బహిరంగ చర్చలలో ఆధిపత్యం చెలాయిస్తున్న ప్రస్తుత తరుణంలో, ఆర్ఎస్ఎస్ స్ఫూర్తితో రచించిన ఏకత్మతా స్తోత్రం కన్నా మిన్నగా భారతదేశ నాగరికతా స్ఫూర్తిని వివరించే గ్రంథాలు చాలా తక్కువగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా వేలాది శాఖలలో ప్రతిరోజూ పఠించే ఏకత్మతా స్తోత్రాన్ని, కేవలం ఒక భక్తి గీతంగానే అర్థం చేసుకుంటారు. వాస్తవానికి, ఇది భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రకటించే ఒక నాగరికతా ప్రకటన. ఇది భారతదేశపు సాంస్కృతిక పటం. సమగ్రంగా చదివిన పక్షంలో ఇది ఏ ఒక్క వర్గానికో, దేవతకో, లేదా సిద్ధాంతానికో అంకితమైన గీతం కాదనేది అవగతమవుతుంది. దానికి బదులుగా ఇది భారతీయ నాగరికత అనే విశాల సముద్రాన్ని ఏర్పరిచే విభిన్న ప్రవాహాల మేలు కలయిక. స్తోత్రం నిర్మాణమే ఈ సమ్మిళితత్వాన్ని ప్రదర్శిస్తుంది. “సచ్చిదానంద రూపాయ నమోస్తు పరమాత్మనే” అంటూ ఈ స్తోత్రమ్ పరమ సత్యానికి నమస్కరిస్తూ ప్రారంభమవుతుంది. ఇది ఏ వర్గానికీ చెందిన దేవత కాదు. ఇది సంకుచిత సరిహద్దులను అధిగమించే విశ్వ చైతన్యం. అక్కడి నుంచి ఈ స్తోత్రం భౌగోళికం, ఆధ్యాత్మికత, తత్వశాస్త్రం, సాహిత్యం, సామాజిక సంస్కరణ, విజ్ఞానశాస్త్రం, ప్రజా జీవనం వంటి అనేక రంగాలను స్పృశిస్తుంది. పర్వతాలు, నదులు, నగరాలు, పవిత్ర గ్రంథాలు, సాధువులు, తత్వవేత్తలు, కవులు, యోధులు, శాస్త్రవేత్తలు సంస్కర్తలు ఇలా అందరూ ఒకే నాగరికతా గీతంలో ఇమిడిపోయారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహా భారతం, భగవద్గీతతో పాటు ఇది జైన ఆగమాలు, బౌద్ధమత త్రిపీటకాలు, సిక్కుమత గురుగ్రంథ్ సాహిబ్‌లకు కూడా గౌరవాన్ని ప్రకటిస్తుంది. ఇది యాదృచ్ఛికంగా జరిగిన చేరిక కాదు. భారతదేశపు ఆధ్యాత్మిక వారసత్వాన్ని కేవలం ఒకే మార్గానికి పరిమితం చేయలేమన్న అవగాహనను ఇది ప్రతిబింబిస్తుంది. భారతీయ నేల నుండి ఉద్భవించి, ఇక్కడి నాగరికతా చైతన్యాన్ని సుసంపన్నం చేసిన వివిధ సంప్రదాయాల కృషిని ఈ స్తోత్రం గుర్తిస్తుంది.

స్తోత్రంలో స్త్రీలకు ఇచ్చిన స్థానం కూడా అంతే ముఖ్యమైనది. సమకాలీన చర్చలలో పితృస్వామ్య సంస్థ అనే ఆరోపణను ఆర్ఎస్ఎస్ ఎదుర్కొంటున్నది. అయితే, ఏకాత్మతా స్తోత్రం అటువంటి ఆరోపణకు శక్తివంతమైన సమాధానం ఇస్తుంది. ప్రధానంగా పురుషులపైనే దృష్టి సారించే అనేక సాంప్రదాయ గీతాలకు భిన్నంగా, ఈ స్తోత్రం భారత చరిత్రలోని వివిధ కాలాలకు చెందిన ఎందరో అసాధారణ మహిళలను ఉద్దేశపూర్వకంగా స్మరించుకుని గౌరవిస్తుంది. అలా గౌరవానికి నోచుకున్నవారిలో అరుంధతి, అనసూయ, సావిత్రి, సీత (జానకి), ద్రౌపది, కన్నగి, గార్గి, మీరాబాయి, రాణి దుర్గావతి ఉన్నారు. ఈ జాబితా ఇంతటితో ఆగదు. ఇందులో ఇంకా అహల్య, రాణి చెన్నమ్మ, రుద్రమాంబ, సోదరి నివేదిత, శారదాదేవి కూడా ఉన్నారు. ఈ మహిళలు వివిధ ప్రాంతాలు, వర్గాలు, చారిత్రక కాలాలు, విభిన్న రంగాలలోని శ్రేష్ఠతకు ప్రతీకగా నిలుస్తారు. కొందరు ఆధ్యాత్మిక జ్ఞానానికి, కొందరు నైతిక స్థైర్యానికి, కొందరు రాజకీయ నాయకత్వానికి, కొందరు సాంఘిక సేవకు, మరికొందరు మేధోపరమైన విజయాలకు ప్రతీకగా నిలుస్తారు. ఈ చేర్పు ప్రాముఖ్యత అపారమైనది. గార్గి ప్రాచీన భారతదేశపు తాత్విక సంప్రదాయానికి, మేధో స్వేచ్ఛకు ప్రతీకగా నిలుస్తుంది. సావిత్రి సంకల్పానికి, భక్తికి ప్రతీక. మీరాబాయి సామాజిక కట్టుబాట్లకు అతీతమైన ఆధ్యాత్మిక స్వాతంత్ర్యానికి, భక్తికి ప్రతిరూపం. రాణి దుర్గావతి, చెన్నమ్మ అణచివేతకు వ్యతిరేకంగా ప్రతిఘటనకు, రాజకీయ ధైర్యానికి ప్రతీకగా నిలుస్తారు. స్వామి వివేకానంద శిష్యురాలు సోదరి నివేదిత ఐర్లాండ్‌లో జన్మించింది. భారతీయ నాగరికత పట్ల సార్వత్రిక ఆకర్షణకు, దేశ సేవకు ప్రతీకగా ఆమె నిలిచింది. శారదాదేవి ఆధ్యాత్మిక మాతృత్వానికి, కరుణకు ప్రతిరూపం. ఈ మహిళలందరినీ ఒకే సామూహిక స్మరణ పీఠంపై ఉంచడం ద్వారా దేశ నిర్మాణం, నాగరికతాభివృద్ధి కేవలం పురుషుల విజయాలు మాత్రమే కావు. భారత నిర్మాణంలో మహిళలు సమాన భాగస్వాములు అనే ఒక స్పష్టమైన సందేశాన్ని ఈ ఏకాత్మతా స్తోత్రం ఇస్తుంది. ★



పోరాట స్ఫూర్తికి ప్రతీకలు

అణచివేత నిర్బంధాలను తెంచిన వీరనారీ మూర్తులు. చీకటిని చీల్చి స్వేచ్ఛాభానుడిని గెలిచిన పోరాట స్ఫూర్తులు! సమానత్వ సాధనలో ఎగసిపడిన జ్వాలలు. ఒకే వేదికపై కదం తొక్కిన ఇరవై వేల గళాలు. గాయాలనే ఆయుధాలుగా మార్చి, కష్టాలనే పాఠాలుగా మలచి, వివక్షపై విజయం సాధించి చరిత్ర పుటల్లో నిలిచారు. గుండె ధైర్యమే ఆభరణంగా, పట్టుదలే ఊపిరిగా ముందుకు సాగుతూ...ప్రపంచ మహిళా లోకానికే దక్షిణాఫ్రికా నారీమణులు ఆదర్శంగా నిలిచారు.

వర్ణవివక్ష సృష్టించిన అణచివేత... ఆ మహిళలను బలహీనపరచలేదు. బదులుగా వారిని ఉక్కు పిడికిళ్లుగా మార్చింది. సామాజిక హింస, వివక్షే వారికి ఆయుధాలుగా మారాయి. దశాబ్దాల పాటు సాగిన తీవ్రమైన భౌతిక, మానసిక నిర్బంధాలను తట్టుకుని నిలబడిన ఆమహిళలు, చీకట్లను చీల్చుకుంటూ దేశ విముక్తి సాధనలో అపూర్వమైన చొరవ చూపారు. ఆ అజేయమైన పోరాట పటిమ నేడు ప్రపంచ మహిళా లోకానికే దిక్సూచిగా నిలిచింది.

ప్రత్యేక మహిళా దినోత్సవ నేపథ్యం: ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా మార్చి 8న 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' జరుపుకుంటే, దక్షిణాఫ్రికాలో మాత్రం ఆగస్టు 9న 'జాతీయ మహిళా దినోత్సవం'గా జరుపుకుంటారు. దీని వెనుక ఒక మహత్తరమైన చారిత్రక ఘట్టం ఉంది. 1956 ఆగస్టు 9న దాదాపు 20,000 మంది మహిళలు రంగుల ఆధారంగా తమ స్వేచ్ఛను హరించే 'పాస్ చట్టాల'కు వ్యతిరేకంగా ప్రిటోరియాలోని యూనియన్ బిల్డింగ్స్ వైపు అడుగులు వేశారు. ఆ నిరసన ప్రదర్శన దక్షిణాఫ్రికా స్వాతంత్ర్య ఉద్యమంలోనే ఒక తిరుగులేని మలుపు.

తిరుగుబాటు జ్వాలలను రగిలించిన ఉద్యమ నేతలు: ఉద్యమ సమయంలో పురుషులంతా జైళ్లలో బందీలుగా ఉన్నా, అజ్ఞాతంలోకి వెళ్లినా.. మహిళలు మాత్రం ధైర్యంగా బాధ్యతలను భుజానికెత్తుకున్నారు. ఒకవైపు కుటుంబాలను పోషిస్తూనే, మరోవైపు పిల్లలను పెంచుతూ ఊరూరా తిరుగుబాటు సందేశాలను మోసుకెళ్లారు. నెల్సన్ మండేలా 27 ఏళ్లపాటు జైలుశిక్ష అనుభవిస్తున్న కాలంలో, ఉద్యమ జ్వాలలు ఆరిపోకుండా విన్నీ "మదర్ ఆఫ్ ది నేషన్"గా నిలబడి పోరాటాన్ని ముందుండి నడిపించారు. జాతి, రంగు, వర్గ భేదాలు లేకుండా ప్రజలందరినీ ఏకం చేసి సమానత్వం కోసం పోరాడవచ్చని లిలియన్ న్గోయి, హెలెన్ జోసెఫ్ నిరూపించారు. భిన్నమైన సామాజిక, సాంస్కృతిక నేపథ్యాల నుండి వచ్చినా, ప్రజాస్వామ్య పునాదుల కోసం రహీమా మూసా, సోఫియా విలియమ్స్ ముందు వరుసలో నిలిచారు. వర్ణవివక్ష వ్యతిరేక పోరాటంలో మహిళాశక్తిని ఏకం చేస్తూ, సమాజ సేవనే ఊపిరిగా అల్బెర్టినా సిసులు జీవించారు.

పోరాట కాలంలోనే కాకుండా, ప్రజాస్వామ్యం సిద్ధించిన తర్వాత 'ట్రూత్ అండ్ రీకన్సీలియేషన్ కమిషన్' (టిఆర్‌సి) ద్వారా ద్వేషాన్ని పక్కన పెట్టి, క్షమా గుణంతో దేశంలో శాంతిభద్రతల స్థాపనకు వీరంతా విశేష కృషి చేశారు. ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ మాజీ అధ్యక్షురాలు ఎన్కోసజానా డ్లామిని-జుమా వంటి నాయకురాళ్లు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించారు.

1996లో రూపొందించిన దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్య రాజ్యాంగం లింగ సమానత్వానికి, మహిళల హక్కులకు పూర్తి చట్టపరమైన భరోసా ఇచ్చింది. చట్టసభలో, పార్లమెంట్‌లో 45 శాతానికి పైగా మహిళా ప్రాతినిధ్యం సాధించి, ప్రపంచంలోనే అత్యధిక మహిళా ప్రజాప్రతినిధులున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. రాజకీయాల్లోనే కాకుండా కార్పొరేట్ రంగాలు, బ్యాంకింగ్, ప్రభుత్వ పరిపాలనా విభాగాలలో మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు.

సాంస్కృతిక సౌందర్యం, ప్రాచీన కళలు: దక్షిణాఫ్రికా కేవలం పోరాటాల గడ్డ మాత్రమే కాదు, వైవిధ్యమైన సంస్కృతులకు నిలయం. అందుకే ఈ దేశాన్ని "రెయిన్‌బో నేషన్" అని పిలుస్తారు.

సాంప్రదాయ అలంకరణలు: వివాహితులు ధరించే 'ఇసిచాలో' అనే విశాలమైన టోపీలు, రంగురంగుల పూసల ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ముఖంపై 'ఇంబిజో' అనే తెల్లటి వర్ణాల డిజైన్లు వేసుకోవడం, మెడ, కాళ్లకు 'ఇండ్జీలా' అనే లోహపు ఉంగరాలను ధరించడం వీరి ప్రాచీన కళాత్మకతను చాటిచెబుతాయి.

వ్యాపార చొరవ: పూనల అలంకరణ, హస్తకళలు, కుండల తయారీ వంటి ప్రాచీన కళలను కాపాడుకుంటూనే, నేటి మహిళా వ్యాపారవేత్తలు ఆ కళా ఖండాలను అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేస్తున్నారు.

సఫారీ మహిళల సత్తా: క్రీడల్లోనూ దక్షిణాఫ్రికా మహిళలు తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంటున్నారు. క్రికెట్‌లో లారా వోల్వార్డ్, మారిజానే కాప్ వంటి ప్రపంచస్థాయి స్టార్ ప్లేయర్ల సఫారీ జట్టును అంతర్జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టారు. 2025లో జరిగిన మహిళా వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఫైనల్ మెట్లు ఎక్కడమే వీరి క్రీడా ప్రగతికి, క్రమశిక్షణకు బలమైన నిదర్శనం.

అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నప్పటికీ, నేటికీ అక్కడి మహిళలు కొన్ని తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. అందుకే సమాజంలో లింగ ఆధారిత హింసను అరికట్టేందుకు దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

ఆర్థిక అసమానతలు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఇప్పటికీ నిరుద్యోగం, పేదరికం, వనరుల కొరతతో ఇబ్బంది పడుతున్నారు.

ఆరోగ్య సంక్షోభం: హెచ్.ఐ.వి. బారిన పడుతున్న వారిలో మహిళలసంఖ్య ఎక్కువగా ఉండటం ప్రజారోగ్య రంగానికి పెద్ద సవాలుగా మారింది. అణచివేత, హింస మనుషులను బలహీనులను చేయవని.. న్యాయం వైపు నిలబడే ధైర్యం ఉంటే మనిషి అజేయమైన శక్తిగా మారవచ్చని దక్షిణాఫ్రికా మహిళల చరిత్ర నిరూపించింది. సాధించిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూనే, నేటికీ మిగిలి ఉన్న పేదరికం, లింగవివక్షపై వారు నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారు. కష్టాలకు లొంగిపోకుండా మార్పు కోసం నిలబడటమే అసలైన స్ఫూర్తి అని చాటిచెప్పిన ఈ పోరాటయోధులు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ ధైర్యానికి, స్వతంత్ర భావాలకు సజీవ సాక్ష్యాలు!

జయశ్రీ ఆచంట, సీనియర్ జర్నలిస్ట్



ప్రపంచంలో అత్యధిక ఇంటెలిజెన్స్ కోషెంట్ ('ఐక్యూ') గల దేశాలలో దక్షిణకొరియా, చైనా, జపాన్ నిలబడతాయని 2026లో జరిపిన సర్వే ఒకటి చెబుతోంది. ఇందుకు కారణం, ఈ దేశపు విద్యార్థుల చదువు, సైన్సు, గణితంపై ఎక్కువ దృష్టి పెట్టడం, కఠినమైన విద్యా విధానం, సాంకేతికలో ముందుండడం. జపాన్‌లో అదృష్టంకన్నా కష్టపడి పని చేయడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. దాన్నే వారు గాంబత్తె (Ganbatte) అంటారు. జపనీయులు జన్యుపరంగా క్రమశిక్షణ కలిగిన మానవజాతి.

జపనీస్ పదం గాంబత్తె అంటే "గట్టిగా ప్రయత్నించు" "పోరాడు" లేదా నీ శాయశక్తులా ప్రయత్నించు అని. గాంబత్తె కుడసాయి అంటే దయచేసి గట్టిగా ప్రయత్నించండి అని. ఎవరైనా కష్టమైన పని చేస్తున్నప్పుడు వారికి ప్రోత్సాహం ఇవ్వడానికి గట్టిగా ప్రయత్నించు / ఆల్ ది బెస్ట్ అనే అర్థంలో దీన్ని ఉపయోగిస్తారు. అల్బర్ట్ లీ బర్మాన్ రాసిన Ganbatte; the Japanese Art of always moving forward" అనే పుస్తకంలో దీన్ని గురించి వివరించాడు.

అదృష్టం కన్నా ప్రయత్నమే ప్రధానమని చెప్పే ఈ విధానాన్ని అడుగడుగునా అన్వయించుకోవచ్చు. మనల్ని మనమే కాదు, మన చుట్టూ ఉన్నవారిని ఉత్సాహపరిచేందుకు ఇది తోడ్పడుతుంది. జపనీయుల సుదీర్ఘ ఆయుర్దాయం, మనోనిబ్బరాలకు ఆధారం ఇదే.

టోక్యో సబ్ వేలో సుషీ రెస్టారెంటులో కేవలం పదిమందికే చోటుంటుంది. ఆ రెస్టారెంట్‌కి 94 ఏళ్ల జీరో ఓనో జీవితం, గాంబెత్తెకు చక్కని ఉదాహరణ "నేను చేసే పనినే మళ్లీ మళ్లీ చేస్తాను. ప్రతిసారీ మరి కాస్త మెరుగు పరుచుకుంటూ, అవెక్కడున్నాయో తెలియదుగానీ ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఒక్కో మెట్టూ ఎక్కుతున్నాను" అంటుంది ఆమె. ఈ రెస్టారెంట్‌కు జపాన్ ప్రధాని అమెరికా అధ్యక్షుడిని తీసుకువెళ్లాడు. ఇలాంటి వ్యక్తుల గురించి ఎన్నో ఆసక్తికర విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఇదే గాంబత్తె తాత్వికత. రెండవ ప్రపంచయుద్ధంలో ఛిద్రమైన జీవితాల్ని పునరుద్ధరించుకోవడానికి జపనీయులకు తోడ్పడింది, భూకంపంలో ధ్వంసమైన కోచె, తోహోకు లాంటి నగరాల్ని నిలబెట్టింది ఈ విధానమే. సంక్షోభం ఏదైనా ఎదుర్కొనే సాధనం గాంబత్తె. అది సమష్టి కృషికి అద్దం పడుతుంది, సమస్యను దాటి భవిష్యత్తు దిశగా ఆలోచింపజేస్తుంది. ఈ విధానం భారతదేశానికి అత్యవసరం. గాంబత్తె స్ఫూర్తితోనే తాను ఈ పుస్తకం రాయగలిగానని ఆ రచయిత పేర్కొన్నాడు. జపాన్ వారి జన్యువులు అట్లాంటివి మరి.

మన పెద్దలు పెళ్లి విషయంలో అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడాలంటారు..అది నిజమే. తాత ముత్తాతల లక్షణాలు, జీన్స్ పుట్టబోయే పిల్లలకు వస్తాయి అని జన్యుశాస్త్రం నిరూపించింది. మానవ జన్యుశాస్త్రం మీద అధ్యయనాలు జరుగుతున్నాయి. ఎపి జెనిటిక్స్, యూనీ జెనిటిక్స్‌లలో మానవ మెదడు ఒక తరం నుండి మరో తరానికి మేధాశక్తిని జన్యు మార్పు ద్వారా అందిస్తుందని, పిల్లలకు ఆలోచనా శక్తి ముందు తరాల నుండి సంక్రమిస్తుందని ఇజ్రాయిల్ టెల్ అవీవ్ విశ్వవిద్యాలయంలో డా॥ ఒడెడ్ రెచాలీ అనే జెనెసిటిస్టు నిరూపించాడు.

పిల్లలకు తల్లిదండ్రుల డి.ఎన్.ఎ., ఆర్.ఎన్.ఏ.తో పాటు వారి ఇరు కుటుంబాల, తాతముత్తాతల, అమ్మమ్మల, వారి వెనుక తరాల మెదడు జన్యు శక్తి, వారి అనుభవాల సమూలశక్తి, క్రియాశీలశక్తి, భావ ప్రకటనా శక్తి ఇప్పుడు పుడుతున్న మెదళ్లకు సంక్రమిస్తుంది. భిన్న వృత్తుల వారి మధ్య వివాహాలు జరిగితే జన్యు మార్పులు వుంటాయి. ఒకే వృత్తి వారి మధ్య జరిగితే మానవ మెదళ్లు చిప్‌లాక్ అయ్యి వారిలో సృజనాత్మకత తగ్గుతుంది.

అమెరికాకు 39వ అధ్యక్షునిగా చేసిన జిమ్మీ కార్టర్ తన ఆత్మ కథ "ఎ ఫుల్ లైఫ్: రిఫ్లెక్షన్స్ ఎట్ నైంటీ"లో "తన తండ్రి వేరుశనగ పండించే రైతు, ఇల్లు కట్టే వడ్రంగి, చెప్పులు తయారు చేసేవాడు. ప్లంబర్, మంచి వ్యాపారి. తల్లి నర్సు, వంట పనిలో దిట్ట" అని వివరించాడు. జిమ్మీ కార్టర్ చిన్న వయస్సులోనే మంచి రైతు, మామేకరు, నేవీ ఎలక్ట్రికల్ ఇంజనీరు. "హాబిటాట్ ఫర్ హ్యూమానిటీ" సంస్థ తరపున వడ్రంగిగా ఎన్నో దేశాల్లో వేలాది ఇళ్లు కట్టించాడు. 22 పుస్తకాలు రాశాడు. 95వ ఏట వరకూ స్కూళ్లలో పాఠాలు చెప్పేవాడు. గొప్ప ఉపన్యాసకుడు, జార్జియా స్టేట్ గవర్నర్, అమెరికాకు 39వ అధ్యక్షునిగా పనిచేసి 100 సంవత్సరాలు బతికాడు, కారణం జన్యుపరంగా బలంగా ఉండటమే.

ఒక వ్యక్తి తెలివితేటలను తెలియజేసే సాధనం ఐక్యూ. ఈ ఐక్యూ సంఖ్య ఎంతపెద్దదైతే వారికి అన్ని ఎక్కువ తెలివితేటలు ఉంటాయన్నమాట. ఒక మనిషికి ఉండే ఐక్యూని బట్టి అతని తెలివితేటలను నిర్ధారిస్తారు. అతడు నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నాడు? ఆలోచనా తీరు ఎలా ఉంది అనే విషయాన్ని ఈ పరీక్షలో పరిగణనలోనికి తీసుకుంటారు. చాలామందిలో ఐక్యూ ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆ విషయం వారికి తెలియడం లేదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ఎక్కువ ఐక్యూ ఉందని తెలిపే నాలుగు లక్షణాలు; కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం, మంచి మాటతీరు, సమస్యను పరిష్కరించే నైపుణ్యం, సృజనాత్మకత (క్రియేటివిటీ) అంటారు మానసిక శాస్త్రవేత్తలు.

మానవ మను

పూర్వకాలం నుండి మెదడుకు పదునుపెట్టే పజిల్స్, చదరంగం ఆడటం, కొత్త భాషలు నేర్చుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటివి చేయాలి. మెరుగైన పోషకాహారం, నిద్ర, యోగ, ధ్యానం మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఈ అలవాట్లు జ్ఞాపకశక్తిని, తార్కిక ఆలోచనా విధానాన్ని మెరుగు పరుస్తాయి.

మానసిక వ్యాయామం: ప్రధానంగా చదరంగం ఆడటం మీ ఐక్యూ స్థాయిని పెంచుతుందని వెనిజులాలో జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. మీ దినచర్యలో చిన్నమార్పు తీసుకురండి, పళ్లు తోముకునేటప్పుడు రోజూ వాడే చేతినిగాక రెండవ చేతిని వాడండి. అలవాటుపడిన చేతితోపాట

అలవాటుపడిన చేతితోపాటు మరో చేతితో రాయడం సాధనచేయండి. మెదడును ఉత్తేజపర్చడానికి మనం దానికి శిక్షణనిచ్చి, మరింత సంక్లిష్టమైన పనులు అప్పగించాలి. కొత్త భాషను నేర్చుకోవడం, యుద్ధ కళలు నేర్చుకోవడం, సంగీత వాద్యం నేర్చుకోవడం ఆ కోవలోకే వస్తాయి. సంగీతం కూడా మెదడుకు వ్యాయామం అని సంగీత అభ్యాసంపై పరిశోధకులు అనితా కాలిన్స్ అంటున్నారు.

ఆర్.ఎస్.ఎస్. సంఘశాఖలో స్వయంసేవకులు వృత్తాకారంలో కూర్చొని ఆడే నంబర్ ఆటలో సంఖ్య చెప్పి, అందుకు బదులుగా ఒక పదాన్ని పలుకుతారు. ఇది ఏకాగ్రతను పెంచే ఆట. ఒకరు చెప్పిన వరస



గడకే సవాలా?

పేర్లను, అదే క్రమంలో చెప్తూ, అదనంగా ఒక పేరు చెప్పాలి. మూడవ వారు కూడా అంతే. ఇది వారి జ్ఞాపకశక్తికి ఉదాహరణ. సంఘశాఖలో కథ చెప్పడం కూడా ఒక ఏకాగ్రతకు గుర్తే. సంఘ ప్రార్థన "సదా వత్సలే మాతృభూమే" మర్చిపోకుండా, తడబడకుండా చెప్పడం కూడా వారి జ్ఞాపకశక్తికి ఉదాహరణ.

ఐదురోజులు వరసగా మంచి నిద్రలేకపోతే 10 లేదా 15 పాయింట్ల వరకూ ఐక్యూ పడిపోతుందని అధ్యయనాలు చెప్తున్నాయి. 'సోమరిగా కూర్చోకండి ఏదో ఒకటి చేయండి' అంటారు శాస్త్రవేత్తలు. తప్పనిసరిగా రోజూ ఒక పేజీ చదవండి, మెదడు అద్భుత శక్తులకు అనుగుణంగా మారగలదు. అద్భుతాలు చేయగలదు. శ్రద్ధ, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వంటివి మీ జ్ఞానాత్మక సామర్థ్యాలను బలోపేతం చేయడానికి సహాయపడుతాయి.

పరిణామక్రమంలో మానవుడు సాధించిన ముఖ్యమైన మైలురాళ్లు ద్విపాదనడక, 'నిప్పు'ను కనుగొనడం, 'చక్రం' రాతి పనిముట్లు, భాష, మేధస్సు, నాగరికత, వ్యవసాయం, వ్యవసాయ విప్లవం, నగరాల ఏర్పాటు, లిపి, రచన, శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక, శాస్త్రీయ విప్లవాలు, ఆధునిక యుగంలో అంతర్జాలం, డిజిటల్ యుగం, అంతరిక్షయానం, సాహస యాత్రలు మొదలైన వాటిని దాటి నేడు హ్యూమన్ పొటన్షియల్ మూవ్‌మెంట్‌కు వచ్చాం.

క్రిందటి శతాబ్దంలో హ్యూమన్ పొటెన్షియల్ మూవ్‌మెంట్ అనే ఉద్యమం మనిషిలో అపారమైన సామర్థ్యం ఉందని చెప్పింది. కానీ ఈ ఉద్యమం ఎక్కువగా భావోద్వేగ అనుభవస్థాయిలోనే నిలిచిపోయింది. దానికి నాడు శాస్త్రీయ సాధనాలు అందుబాటులో లేవు. తరువాత దశ సెల్ఫ్‌హెల్ప్, అనే మరో సామాజిక వికాస తరంగం, సక్సెస్ సైన్సు, హ్యాబిట్స్, మైండ్‌సెట్ వంటి పదాలు ప్రజల్లో బాగా విస్తరించాయి. అదే సందర్భంలో ఆ సైన్సు నిజమైన సైన్సు కాదు. వ్యక్తిగత స్థాయిలో పనిచేసే నమూనాలు ఉండవు. మార్పును నియమబద్ధంగా సాధించే ప్రయత్నం ఉండదు. ఇక్కడొక కొత్త అవకాశం ఆవిర్భవించింది. అదే న్యూరో సైన్సు, కంప్యూటేషనల్ న్యూరోసైన్సు, ఎ.ఐ. (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) న్యూరో టెక్నాలజీ. ఈ నాలుగూ కలిసినప్పుడు మనిషి సామర్థ్యం కొత్త కోణంలో చూడగలుగుతున్నాం. మన ప్రవర్తనను కొలిచి, ఆ డేటా ఆధారంగా నమూనాలను నిర్మించ గలుగుతున్నాం. అంటే మనిషి సామర్థ్యం ఒక అస్పష్టమైన ఆలోచన కాదు. అదొక వ్యవస్థగా మారుతుంది. కానీ, ఇక్కడే ప్రమాదం పొంచివుంది.

సాంకేతికాభివృద్ధిలో మనం మరో మైలురాయి దగ్గర నిలబడ్డాం. దాని పేరే కృత్రిమమేధ (ఏ.ఐ). ఇది రాయడం, విశ్లేషించడం, నిర్ణయాలు తీసుకోవటం వంటి పనులన్నీ చేయగలుగుతుంది. కొన్ని సందర్భాల్లో మనుషుల కన్నా మెరుగ్గా చేస్తుంది. అందుకే చాలామంది మేధావులను ఇది కలవర పెడుతోంది. ఇలాగే జరిగితే మనుషులను పక్కకు తప్పిస్తుందా? అనేది ఓ పెద్ద చిక్కువీడని ప్రశ్న.

మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కొన్ని దశాబ్దాల క్రితం, కంప్యూటర్ల వాడకం వచ్చిన కొత్తల్లో పుస్తకం రాశాడు. దాని పేరు "రోడ్ అహెడ్" (Road Ahead). మన జీవితాన్ని కంప్యూటర్లు ఎలా మార్చబోతున్నాయో ఊహించి రాశాడు. ఇప్పుడవి నూటికి నూరు శాతం అమలవుతున్నాయి. అలాగే రేపు (ఏఐ) కూడా పెద్ద విప్లవాన్ని తీసుకు రాబోతున్నది.

రేపు ఎ.ఐ.ని పనులు చేయించుకునే సాధనంగా ఉపయోగిస్తే, మనిషి పాత్ర తగ్గిపోతుంది. కాని, అదే సాంకేతికతను అభివృద్ధికి ఉపయోగిస్తే ఒక కొత్తదారి తెరుచుకుంటుంది. మన సామర్థ్యం కొలవగలిగిన, అర్థంచేసుకోగలిగిన మెరుగుపరచగలిగిన వాస్తవంగా మారుతుంది.

ప్రాచీన భారతదేశంలో ఆధునిక ఐక్యూ టెస్టులు లేకపోయినా మేధస్సు, వివేకం, జ్ఞాపకశక్తి అంచనా వేయడానికి చాలా కఠినమైన, సమగ్రమైన పద్ధతులు ఉండేవి. ముఖ్యంగా గురుకుల పరీక్షలు, తర్కశాస్త్రం, చర్చలు, జ్ఞాపకశక్తి పరీక్ష, సమస్యాపూర్ణం, మానసిక ఏకాగ్రత. ప్రాచీన పద్ధతులు ఎక్కువగా జ్ఞానం, వివేకం, మానసిక పరిపక్వతపై దృష్టి పెడితే, ఆధునిక పద్ధతులు లాజికల్, పాటర్న్ రికగ్నిషన్ (నమూనా గుర్తింపుపై ఆధారపడుతుంది).

కాగా, ఎ.ఐ. మానవ మేధస్సును మించిపోయే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా 2030 నాటికి ఎ.ఐ. మానవులతో సమానంగా లేదా అంతకంటే మెరుగ్గా పనిచేసే స్థాయికి చేరుకోగలదని అంచనా. మనిషి మెదడుతో పోలిస్తే ఎ.ఐ. వేలాదిరెట్లు ఎక్కువ సమాచారాన్ని సెకన్లలో విశ్లేషించి నిర్ణయం తీసుకోగలదు.

విదేశీ ఎఐ వేదికలపై ఆధారపడటాన్ని నివారించడానికి భారత్ స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్.ఎల్.ఎమ్)ను ప్రోత్సహిస్తోంది. వీటివల్ల హిందీ, తెలుగు, తమిళ్ వంటి స్థానిక భాషల్లో ఖాతాదారులతో మాట్లాడడం చాట్‌బాట్స్ అందుబాటులోనికి వస్తున్నాయి. ఇలా దేశీయంగా విభిన్న భాషల అవసరాలను తీర్చడంతోపాటు, ఆంగ్లేతర భాషలు మాట్లాడే విదేశాల్లో ఎ.ఐ.కి ఒక నమూనా అందించడానికి బహుభాషా భాషిణి సృష్టిపై భారత్ దృష్టి సారిస్తున్నది.

వైద్యం, చట్టం, అకౌంటింగ్‌లతో పాటు వ్యవసాయం, పాలనారంగాలలో కూడా ఎఐ సేవలను అందించగలదు. ఎ.ఐ. రోబోలకు విశ్రాంతి అవసరం లేదు, జీతాలు అక్కర్లేదు పైగా అవి అలసిపోవు. ఏ.ఐ. మానవ మనుగడకే సవాలుగా మారే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

డా. కాశింశెట్టి సీత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రకటించినప్పుడు ప్రజలు ఆశలు పెట్టుకోవడం సాధారణం. అది కూడా ప్రభుత్వ పెన్షనర్ల కోసం రూపొందించిన పథకానికి మరింత ప్రాధాన్యం ఉంటుంది. కానీ, అలాంటి పథకం కోసం కనీసం మార్గదర్శకాలు కూడా రూపొందించకుండా, విమర్శల నుంచి తప్పించుకునేందుకు అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటే సీన్ రివర్స్ అవుతుంది. ఇప్పుడు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆరోగ్యపథకం కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటోంది.

అలంకార ప్రాయం..ఆరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, పింఛన్‌దారుల ఆరోగ్య పథకం ప్రకటించకముందు నుంచే వారి ఆదాయం నుంచి కోత పెట్టడం ప్రారంభించిన ప్రభుత్వం, ఆ తర్వాత కొద్ది నెలలకు అట్టహాసంగా పథకాన్ని ప్రకటించింది. కానీ, ఆ పథకం అమలులో విఫల మవుతోందని ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి. కొత్త పథకం పేరుతో ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ హెల్త్ కార్డులను అందజేస్తోంది. అయితే.. అవి నిజంగా ఆరోగ్య భరోసా ఇస్తున్నాయా? అనే సందేహాలు చుట్టుముడుతున్నాయి. కేవలం డిజిటల్ కార్డుల పంపిణీతోనే ప్రభుత్వం సరిపెట్టుకుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముందు కోతలు... తర్వాత కార్డులు

కొత్త హెల్త్ స్కీమ్ అధికారికంగా ప్రకటించకముందే ఉద్యోగులు, పెన్షనర్ల జీతాల నుంచి ప్రీమియం వసూలు చేయడంపై విమర్శలు వచ్చాయి. రెండు నెలల పాటు ప్రీమియం వసూలు తర్వాత వచ్చిన విమర్శల నేపథ్యంలో ఈ పథకాన్ని హడావిడిగా ప్రారంభించింది. ప్రీమియం మొత్తం వసూలులో చూపిన వేగం, పథకం అమలులో మాత్రం కనిపించలేదు. చివరకు జూలైలో కార్డులు జారీ చేసినా, అవి పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం కొత్త వివాదానికి దారి తీసింది. డబ్బులు ముందే తీసుకున్న ప్రభుత్వం వైద్యసేవలు అందించడాన్ని ఎలా మరచిందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

ఉద్యోగుల నుంచి వస్తున్న వ్యతిరేకత, విమర్శలతో ఎట్టకేలకు ప్రభుత్వం ఆరోగ్య కార్డుల ఆధునికీకరణలో భాగంగా క్యూఆర్ కోడ్ రూపొందించింది. మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 943 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 2,594 రకాల వ్యాధులకు నగదురహిత వైద్యం అందుతుందని ప్రకటించింది. జిల్లాల్లో కొత్తగా మరికొన్ని వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని కూడా చెప్పింది. సీజీహెచ్ఎస్ ధరలు అమలు చేస్తామని ప్రకటించింది. ఇలా కాగితాలు, నివేదికల మీదే సమగ్ర వైద్య భద్రతా వ్యవస్థలా కనిపిస్తోంది... క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉందని ఉద్యోగులు అంటున్నారు.

కార్డు ఉంది...చికిత్స లేదు

ప్రభుత్వం హెల్త్ కార్డులు అందించిన తర్వాత ఆస్పత్రికి వెళ్లిన ఉద్యోగులకు ఎదురైన అనుభవాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఎమర్జెన్సీ కేసుల్లో కూడా కార్డు చెల్లదని కార్పొరేట్ ఆస్పత్రులు స్పష్టం చేస్తున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ గురైన తన తల్లిని ఒక ఉద్యోగి ఆస్పత్రికి వెళ్తే హెల్త్ కార్డు పనిచేయదని, నగదు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది చెప్పారట. గుండెపోటుతో వెళ్లిన పోలీసు ఉద్యోగికి కూడా అదే సమాధానం ఎదురైందని, మరో ఉద్యోగిని ముందుగా 50 వేల రూపాయల అడ్వాన్స్ చెల్లిస్తేనే చేర్చుకుంటామని ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకులు చెప్పారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. బాధిత పెన్షనర్లు కూడా ముందు బిల్లు చెల్లించి.. తర్వాత రీయింబర్స్‌మెంట్ చూసుకోవాలని ప్రైవేటు ఆసుపత్రుల వారు ఉచిత సలహాలు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తమ చేతిలోని కార్డులు అవసరానికి పనిచేయకపోతే ఏం చేయాలి? ఆ కార్డుకు విలువ ఎక్కడ? అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

వాస్తవానికి.. కార్డులు జారీ చేశామని చెప్పేందుకు ప్రభుత్వం అట్టహాసంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. క్యూఆర్ కోడ్‌లతో డిజిటల్ కార్డులు అందజేసింది. కానీ, కార్పొరేట్ ఆస్పత్రుల వాదన వేరేలా ఉంది. ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన బకాయిలు రూ.100 కోట్ల దాకా ఉన్నాయని, ప్యాకేజీ రేట్లు సవరించకపోతే కొత్త పథకాన్ని అమలు చేయడం సాధ్యం కాదని అవి స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్య గురించి ముందే తెలిసి కూడా... బకాయిల సమస్య పరిష్కరించకుండానే ప్రభుత్వం ఎందుకు కార్డులు పంపిణీ చేసిందని, తమ నుంచి ప్రీమియం ఎందుకు వసూలు చేశారని ఉద్యోగులు, పెన్షనర్లు నిలదీస్తున్నారు.

సాధారణంగా ఏ ప్రభుత్వ పథకం ప్రారంభమైనా ముందు జీవో, మార్గదర్శకాలు, అమలు విధానం స్పష్టంగా ఉంటాయి. కానీ, ఇక్కడ పరిస్థితి తారుమారైంది. విమర్శల నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వ పెద్దలు ముందుగా కార్డులు మంజూరు చేశారని, తర్వాత కూడా మార్గదర్శకాలు రావడం చాలా ఆలస్యమైందని అంటున్నారు. ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖల మధ్య సమన్వయం లేకపోవడం ఈ అంశంలో స్పష్టంగా కనిపిస్తోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ట్రస్ట్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఉన్నప్పటికీ అమలులో స్పష్టత లేకపోవడం దేనికి నిదర్శనమన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు, వైద్య పరీక్షలు. గతంలో ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద ఉద్యోగులు నేరుగా కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి అవసరమైన పరీక్షలు చేయించుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ముందుగా వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ అవుట్ పేషెంట్ విభాగంలో ప్రాథమిక పరీక్షలు పూర్తయిన తర్వాత ఆక్కడి వైద్యులు రెఫర్ చేస్తేనే కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది.

పేరుకే ఉచిత వైద్యం.. ఫీజు చెల్లిస్తేనే ఓపీ...

ఈ పథకంపై మరో పెద్ద విమర్శ... ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు, వైద్య పరీక్షలు. గతంలో ఈ ఆరోగ్య పథకం కింద ఉద్యోగులు నేరుగా కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి అవసరమైన పరీక్షలు చేయించుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ముందుగా వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ అవుట్

గ్య కార్డులు

పేషెంట్ విభాగంలో ప్రాథమిక పరీక్షలు పూర్తయిన తర్వాత ఆక్కడి వైద్యులు రిఫర్ చేస్తేనే కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ పథకం కింద కార్డులు పొందిన ఉద్యోగులు గానీ, పెన్షనర్లు గానీ.. నేరుగా ప్రైవేటు లేదా కార్పొరేట్ ఆసుపత్రికి వెళితే అవుట్ పేషెంట్, స్కానింగ్ తదితర పరీక్షలకు కార్డు హోల్డర్లు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆరోగ్య రంగంలో ముందస్తు పరీక్షల ప్రాముఖ్యత పెరిగింది. క్యాన్సర్ స్క్రీనింగ్, ఎంఆర్ఐ, యాంజియోగ్రామ్ వంటి పరీక్షలకు వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయి. కానీ, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తే.. ఇవి ఉచితంగా లేకపోవడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

వెల్‌నెస్ సెంటర్లే సిద్ధంగా లేవు

ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్లను బలోపేతం చేస్తామని, మరిన్ని వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించగా, ప్రస్తుత కేంద్రాల తీరుపైనే ఎప్పటినుంచో తీవ్ర విమర్శలు ఉన్నాయి. వెల్ నెస్ సెంటర్లలో వైద్య నిపుణులు లేరని, కేవలం జూనియర్లతో నడిపిస్తున్నారని, సరిపడ పరికరాలు లేవని, అవసరమైన మందులు అందుబాటులో ఉండవని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తప్పనిసరిగా వెల్ నెస్ సెంటర్లకే వెళ్లాలంటూ కొత్త ఆరోగ్య వధకంలో నిబంధనను చేర్చడం, ఉద్యోగులకు, ముఖ్యంగా పెన్షనర్లకు మరింత ఇబ్బందిగా మారుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

మరోవైపు.. డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ప్రక్రియలో కూడా అనేక లోపాలు బయటపడ్డాయని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. కొన్ని కార్డుల్లో మరణించిన వారి పేర్లు ఉండటం, పాత చిరునామాలు కనిపించడం, కుటుంబ సభ్యుల వివరాలు లేకపోవడం, కొందరికి కార్డులు డౌన్‌లోడ్ కాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయని అంటున్నారు. ఈ లోపాలను సరిచేయడానికి వెబ్‌సైట్‌ను తొలి 15 రోజుల్లోనే తాత్కాలికంగా నిలిపివేయాల్సిన పరిస్థితి. ఏర్పడింది. పెరిగిన సాంకేతికత దృష్ట్యా డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్నామని చెప్పిన ప్రభుత్వం... కనీస డేటా ధ్రువీకరణ కూడా చేయలేదా? అనే సందేహం కార్డుల్లో పొరపాట్లు చూశాక సహజంగానే వ్యక్తమవుతున్నాయి.

ఈ అంశంపై ఉద్యోగ సంఘాలు ఇప్పటికే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ట్రస్టు బోర్డు సమావేశంలోనే కార్పొరేట్ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ సేవలు, పలు ఆరోగ్య పరీక్షలు కూడా ఉచితంగా అందించాలని సభ్యులు కోరినట్లు సమాచారం. అదనంగా వెల్‌నెస్ సెంటర్ల సంఖ్య పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినా, ఉద్యోగుల ప్రధాన అభ్యంతరాలకు మాత్రం ఇప్పటికీ సమాధానం కనిపించడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులు కూడా ఈ పథకంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ కార్డులు డౌన్‌లోడ్ కావడం లేదని, చికిత్స పరిమితులు ఎక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిలో ఆరోగ్యశ్రీ పథకమే మెరుగ్గా ఉందని కొందరు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని సుమారు 8 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కలిపి దాదాపు 29.80 లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందాల్సి ఉంది. అంటే ఇది ఒక చిన్న సంక్షేమ పథకం కాదు. లక్షలాది కుటుంబాల ఆరోగ్య భద్రతకు సంబంధించిన కీలక వ్యవస్థ. అలాంటి పథకం ప్రారంభ దశలోనే ఇన్ని సందేహాలు, ఇన్ని లోపాలు బయటపడటం ప్రభుత్వానికి సవాల్‌గా నిలుస్తోంది.

ఈ మొత్తం వ్యవహారంపై కొన్ని కీలక ప్రశ్నలు వస్తున్నాయి. ఉద్యోగుల నుంచి ప్రీమియం వసూలు చేసే ముందే అవసరమైన మార్గదర్శకాలు ఎందుకు జారీ చేయలేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 'కార్పొరేట్ ఆస్పత్రులతో బకాయిల సమస్య పరిష్కరించకుండా పథకాన్ని ఎందుకు ప్రారంభించారు? మార్గదర్శకాలు లేకుండానే కార్డులు ఎలా పంపిణీ చేశారు? డేటాలో ఇన్ని తప్పులు ఎలా జరిగాయి? నగదురహిత వైద్యం పేరుతో అత్యవసర పరిస్థితుల్లో కూడా ఉద్యోగులు లక్షల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఎందుకు ఎదురవుతోంది?' వంటిబ ప్రశ్నలకు ప్రభుత్వ పెద్దల నుంచి సమాధానం రావడం లేదంటున్నారు ఉద్యోగ సంఘాల నాయకులు.

హెల్త్ కార్డు అనేది ఒక ప్లాస్టిక్ కార్డు కాదు... అనారోగ్య సమయంలో ఉద్యోగి కుటుంబానికి భరోసా. ఆ భరోసా ఆస్పత్రి గేటు దగ్గరే ఆగిపోతే, క్యూఆర్ కోడ్ ఎంత ఆధునికమైనదైనా ప్రయోజనం ఉండదు. ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించిన ఉద్దేశం మంచిదేకావచ్చు. కానీ, అదొక్కటే సరిపోదు. ఉద్యోగులు, పింఛన్‌దారుల నుంచి ప్రీమియం తీసుకున్న ప్రభుత్వం, వారికి నిజమైన నగదురహిత వైద్యం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందటున్నారు. లేదంటే ఈ హెల్త్ కార్డులు ఆరోగ్యభరోసాకు ప్రతీకగా కాకుండా.. అమలుకాని హామీలకు నిదర్శనంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068





గజరాజుల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సరిహద్దు జిల్లాలు చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో రైతాంగానికి అడవి ఏనుగుల బెడద తీవ్ర సమస్యగా మారింది. పొరుగు రాష్ట్రం కర్ణాటక అడవుల నుంచి ఏనుగుల మందలు ఆహారం, నీటి అన్వేషణలో దారితప్పి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని వ్యవసాయ భూముల్లోకి ప్రవేశించి పంటలను తినేస్తూ ధ్వంసం చేస్తున్నాయి. అటవీ సిబ్బంది వీటిని తరిమికొట్టినా, అవి తమిళనాడు అడవుల్లోకి పారిపోయి మళ్లీ కర్ణాటకకు చేరుకుని, అటు నుంచి తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వస్తుండటంతో ఇదొక నిరంతర పోరాటంగా మారింది. ఇదే తరహాలో ఒడిశా అడవుల నుంచి వచ్చే ఏనుగుల గుంపులు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పంటలను నాశనం చేస్తున్నాయి.

ఏనుగుల ధాటికి వరి, అరటి, చెరకు, కొబ్బరి, మొక్కజొన్న వంటి పంటలతో పాటు మామిడి తోటలు; బోరు మోటార్లు, సౌర విద్యుత్ పరికరాలు ధ్వంసమవుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్నిచోట్ల ప్రాణనష్టం కూడా జరుగుతోంది.

పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాల్లో గత కొన్నేళ్లుగా అటవీ ఏనుగుల సంచారం స్థానిక రైతులు, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పక్కనే ఉన్న ఒడిశా అడవుల నుంచి 2018లో వచ్చిన అటవీ ఏనుగుల గుంపు భామిని, సీతంపేట, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో స్థిరనివాసం ఏర్పరచు కున్నాయి. ఇవి రెండు గుంపులుగా విడిపోయి సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తు న్నాయి. ఒక గుంపు విజయనగరం జిల్లా బాడంగి ప్రాంతంలో, మరో గుంపు పాలకొండ నియోజకవర్గం పరిధిలోని సీతంపేట మండలం గిరిజన/అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నాయి. పాలకొండ, పార్వతీపురం, కురుపాం నియోజక వర్గాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. వరి, మొక్కజొన్న, అరటి, పామాయిల్ వంటి పంటలను నాశనం చేశాయి. ఇప్పటివరకు ఈ ఏనుగుల దాడుల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఆరుగురు ఒక్క కొమరాడ మండలానికి చెందిన రైతులే కావడం గమనార్హం. సుమారు 3,900 ఎకరాల్లో పంట ధ్వంసమై, రైతులకు రూ. మూడు కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఏనుగులను అడ్డుకోవడానికి ప్రతిపాదించిన కందకాలు, ఏనుగుల జోన్ల ఏర్పాటు వంటి పథకాలు స్థానికుల వ్యతిరేకత, సాంకేతిక కారణాలతో ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

చిత్తూరు జిల్లాలోను

ఇదే పరిస్థితి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నెలకొంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల అటవీ ప్రాంతాల సరిహద్దుల్లో ఈ జిల్లాలు ఉండటం వల్ల, ఏనుగుల గుంపులు తరచుగా సమీపంలోని వ్యవసాయ భూముల్లోకి చొరబడుతున్నాయి. ఫలితంగా, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి, అరటి, చెరకు, మామిడి, టమాటా వంటి వాణిజ్య వంటలు, కూరగాయల తోటలు సర్వనాశనం అవుతున్నాయి. కొన్నిసార్లు ఏనుగుల దాడులలో అన్నదాతలు ప్రాణాలు కోల్పోతున్నారు. రాత్రి వేళల్లో ప్రాణాలకు తెగించి పొలాలకు కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొంది. కరెంటు కంచెలు, గస్తీ వంటి తాత్కాలిక చర్యలు పెద్దగా ఫలితాన్నివ్వడం లేదు. ఈ సమస్య నుండి బయటపడేయడానికి ప్రత్యేక కందకాలు తవ్వించారు. సోలార్ ఫెన్సింగ్ కూడా ఏర్పాటుచేశారు. అయినా ఏనుగులు లెక్కచేయడం లేదు. ఈ సమస్య పరిష్కరంగా,

''ఏనుగుల దాడుల నుంచి రక్షణకు ఏనుగులనే''



ఉపయోగించే వినూత్న విధానాన్ని అటవీ శాఖ అమలు చేస్తోంది. ఇందులో అత్యంత కీలక పాత్ర పోషించేవే కుంకీ ఏనుగులు.

కుంకీ ఏనుగుల కఠిన-శిక్షణ

కుంకీ ఏనుగులు అంటే అటవీ శాఖ ద్వారా ప్రత్యేకంగా శిక్షణ పొందిన సాధు ఏనుగులు. అడవి నుంచి దారి తప్పి జనావాసాల్లోకి, పంట పొలాల్లోకి వచ్చి నష్టం కలిగిస్తున్న అడవి ఏనుగులను సురక్షితంగా తిరిగి అడవిలోకి పంపడానికి, లేదా వాటిని బంధించడానికి అటవీ అధికారులు వీటిని ఉపయోగిస్తారు. దారి తప్పిన అడవి ఏనుగులను పట్టుకునే విధానం ఎంతో సాహసంతో కూడుకున్నది. కుంకీ ఏనుగులు తమ శిక్షకుల ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, అల్లరి చేస్తున్న అడవి ఏనుగుల చుట్టూ వ్యూహాత్మకంగా చేరి వాటిని శాంతింప జేస్తాయి. ఏ మాత్రం దారికి రాకపోయినా, తమ బలంతో వాటిని అదుపులోకి తెస్తాయి. ఆ తర్వాత అటవీ సిబ్బంది మత్తు మందు ఇస్తారు. స్పృహ కోల్పోయిన ఏనుగును తాళ్లతో బంధించి, ప్రత్యేక వాహనాల్లోకి ఎక్కించడానికి కుంకీ ఏనుగులే తమ దంతాలతో, తొండంతో వెనుక నుంచి నెడుతూ సాయపడతాయి. అనంతరం బంధించిన ఏనుగు లను సురక్షిత అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడానికో, శిక్షణ శిబిరానికి తరలించడానికో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయి. మావటీలు కాలితో వాటి చెవులపై ఇచ్చే వేర్వేరు సంకేతాలను బట్టి కుంకీలు ముందుకు

నియంత్రణకు 'కుంకీలు'

కదలడం, వెనక్కి తగ్గడం, ఆగిపోవడం చేస్తుంటాయి. పిల్లలతో కూడిన ఆడ ఏనుగుల గుంపులు సాధారణంగా కుంకీలను చూడగానే తమ మందను కాపాడుకునేందుకు వాటంతట అవే వెనుదిరుగు తాయని, ఎంతగా తరిమినా వెనక్కి వెళ్లని మొండి ఏనుగులతో అవసరమైతే కుంకీలు భీకరంగా పోరాడాల్సి వస్తుంది. వైద్యులు, అటవీ అధికారుల పర్యవేక్షణలో మూడేళ్లపాటు సాగే ఈ శిక్షణ ఎంతో కఠినమైనది. ఇలా పంట పొలాల్లోకి చొరబడి బెడద పెట్టే గుంపులను సైతం కుంకీలు అడవి దిశగా తరిమికొడతాయి.

ఏనుగులు మనుషుల్లాగే ఆలోచిస్తాయి, తోటి ఏనుగుల పట్ల వాటికి అమితమైన ప్రేమానురాగాలు ఉంటాయి. ఇందుకు నిదర్శనమే కేశవ్ అనే ఏనుగు కథ. కేరళలోని మధుమలై నుంచి 21 ఏనుగులు దశాబ్దాల క్రితం వలస వచ్చాయి. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అడవుల్లో సంతతి వృద్ధి చేసుకొని 100కు పైగా సంఖ్య పెంచు కున్నాయి. తమిళనాడులోని కృష్ణగిరి, కర్ణాటకలోని కోలారు, ఆంధ్రలోని పలమనేరు, కుప్పం అడవుల్లో తిరుగు తున్నాయి. 21, 7, 4, 10, 17 ఇలా బృందాలుగా మారాయి. వీటిలో ఒకటే ఈ కేశవ. ఇప్పుడు దీని వయసు 17 ఏళ్లు. మూడేళ్ల క్రితం పలమనేరు సమీపంలోని జగమర్ల వద్ద కేశవ్ మరో 3 ఏనుగులతో కలసి రోడ్డు దాటుతుండగా ఒక వాహనం ఢీకొని మూడు ఏనుగులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. ఆ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్న కేశవ్, మిత్రుల మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర దుఃఖంతో క్రూరంగా మారింది. అవి చనిపోయి, పూడ్చిపెట్టిన ప్రదేశం చుట్టుపక్కలే తిరుగుతూ మనుషులపై, పశువులపై దాడులు చేయడం మొదలుపెట్టింది. గతేడాది ఒక అటవీ శాఖాధికారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో కేశవ్‌ను బంధించడానికి అటవీ శాఖ ఐదు కుంకీ ఏనుగులతో భారీ కార్యాచరణ చేపట్టింది. ఆశ్చర్యకరంగా, తన మిత్రులను పూడ్చిపెట్టిన ప్రదేశంలోనే కేశవ్ అధికారులకు చిక్కింది. మొదటి రోజు అది తప్పించుకోగా, రెండో రోజు ఆరు గంటల పాటు శ్రమించి, మత్తు మందు ఇచ్చి, కుంకీల సాయంతో దాన్ని బంధించారు. అనంతరం పలమనేరు సమీపంలోని ముసలిమడుగు శిబిరానికి తరలించి, ప్రత్యేక చెక్క బోనులో ఉంచి మచ్చిక చేసుకుంటున్నారు. దానికి కేశవ్ అని పేరుపెట్టారు. ఒకప్పుడు భయభ్రాంతులకు గురిచేసిన కేశవ్, ఇప్పుడు శిక్షణ పొందుతూ భవిష్యత్తులో ఉత్తమ కుంకీ ఏనుగుగా మారనుంది.

ఏపీకి విచ్చేసిన జయంత్, అభిమన్యు

కేశవ్ లాగానే శిక్షణ పొందిన మరో రెండు అత్యుత్తమ కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యు. జయంత్ ననియాలలో శిక్షణ పొందగా, అభిమన్యు కర్ణాటకలో శిక్షణ తీసుకుంది. పలమనేరులో ఏనుగులను అదుపు చేసే కార్యాచరణలో ఇవి కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు ఒడిశా నుంచి పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దుల్లోకి వస్తున్న అడవి ఏనుగుల గుంపులను అడ్డుకోవడానికి వీటిని అక్కడికి తరలించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కుప్పం అటవీ రేంజ్ పరిధిలోని ననియాలలో 2006లోనే తొలి కుంకీ శిక్షణ శిబిరం ఏర్పాటైంది. 'వినాయక్, జయంత్' పదిహేడేళ్లుగా అక్కడ సేవలందించి, ప్రస్తుతం వృద్ధాప్యంలోకి చేరుకున్నాయి. దీంతో మరిన్ని కుంకీ ఏనుగులు కావాలంటూ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కర్ణాటక అటవీ శాఖను కోరగా, ఆ రాష్ట్రం అంగీకరించింది. అప్పటి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా కుంకీ ఏనుగుల అప్పగింత పత్రాలను పవన్ కల్యాణ్‌కు అందజేశారు. దేశంలోనే అత్యధికంగా మూడువేల ఆరువందల తొంభయ్ ఐదు ఏనుగులు కర్ణాటకలో ఉన్నాయి. తొలి విడతగా నాలుగు కుంకీ ఏనుగులను, వాటికి శిక్షణ ఇచ్చే మావటీలు సహా ఆంధ్రప్రదేశ్‌కు తరలించగా, మరో రెండింటిని త్వరలో వంపనున్నారు. వీటిని పలమనేరు సమీపంలోని ముసలిమడుగు శిబిరంలో ఉంచి, స్థానిక అటవీ పరిస్థితులకు అలవాటు పడేలా నెల రోజులపాటు శిక్షణ ఇచ్చారు. దీనికోసం తొంభై లక్షల రూపాయలు వెచ్చించారు. ఈ నెలలోనే జయంత్, అభిమన్యు కుంకీ ఏనుగులను శ్రీకాకుళం గుచ్చిమి శిక్షణ శిబిరానికి తరలించారు.

ఇటీవలి కాలంలో వాతావరణ మార్పుల కారణంగా నెలకొంటున్న వర్షాభావ పరిస్థితుల వల్ల శేషాచలం వంటి దట్టమైన అడవుల్లో సైతం నీటి వనరులు ఎండిపోతున్నాయి. దీంతో వన్యప్రాణులు దాహంతో, ఆకలితో అలమటిస్తూ అడవిని వదిలి జనావాసాల్లోకి రావడం, మానవ-వన్యప్రాణి సంఘర్షణకు దారితీస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతుల వంటలను, ప్రాణాలను కాపాడటానికి కుంకీ ఏనుగులు అటవీ శాఖకు ఒక బ్రహ్మాస్త్రంలా ఉపయోగప డుతున్నాయి. అడవి ఏనుగుల దాడుల నుంచి రైతులను రక్షించడంలో "ఏనుగులకు ఏనుగులే సమాధానం" అనే విధానం విజయవంతం అవుతోందని కుంకీల వృత్తాంతాలు స్పష్టం చేస్తున్నాయి.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

లోకంలో కొందరు మహాపురుషులకు కొన్ని జనప్రియమైన సంబోధనలు ఉండడం మనకు తెలిసిన విషయమే. అటువంటి ప్రసిద్ధ సంబోధనలు సాధారణంగా వారికి ఇతర మహాపురుషుల నుంచి లభించినవై ఉంటాయి. గాంధీగారికి "మహాత్మా" అనే పేరు లోకమాన్య తిలక్ ద్వారా, 'బాపూ' అనే పేరు నేతాజీ ద్వారా ఇవ్వబడి ప్రచారంలోకి వచ్చింది. కాని మాధవరావు సదాశివ గోల్వల్కర్‌కు 'గురూజీ' అన్న సంబోధనను ఇచ్చి వాడుకలోకి తెచ్చినది ఆయన నుంచి ఎల్లలు లేని స్నేహాన్ని, ఆత్మీయతను, సహకారాన్ని పొంది కృతజ్ఞతాభరితులైన కాశీ హిందూ విశ్వవిద్యాలయ విద్యార్థులు. 'గురూజీ' అనే ఉపనామం గోల్వల్కర్‌కు యువతరంలో గల జనప్రియత్వానికి సంకేతం.

శ్రీ గురూజీ ఆర్ఎస్ఎస్‌కు రెండవ సర్‌సంఘచాలక్‌గా 1940లో బాధ్యత స్వీకరించి 33 సంవత్సరాలపాటు యావత్ భారతదేశం పర్యటిస్తూ భారతీయ ఆత్మను అర్థం చేసుకున్న గొప్ప సామాజికవేత్త. వారు ఆజన్మాంతము భారతజాతి నిత్య యవ్వనానికి ప్రతీకగా, ప్రేరణదాతగా నిలిచారు. గొప్ప మేధావి. సంఘటనాశిల్పి. వివిధ సందర్భాలలో ఆయన యువకులకు ఇచ్చిన మార్గదర్శనం, స్ఫూర్తి నేటికి కూడా అర్థవంతమైనదే. తత్సంబంధమైన అనేక విషయాలు ఆయన ప్రసంగాలలో, సార్వజనిక సభలలో, సమావేశాలలో విస్తారంగా ఉన్నాయి. గురూజీ తన ప్రసంగాల ద్వారానే కాక, పత్రికా రచనల ద్వారా, శుభాకాంక్షల సందేశాల ద్వారా ఎందరో యువకులకు మార్గదర్శనం చేస్తూ వచ్చారు.

గురూజీ 1940లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ చాలక్‌గా బాధ్యతను స్వీకరించారు. దేశంలోని యువశక్తిని సమకాలీన సమస్యలను ఎదుర్కొనడానికై జాగృతం చేయడంలో అప్పటినుంచే నిమగ్నులయ్యారు.

జీవన సమర్పణకై ఉద్బోధన : 1940 జూన్ నెలలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్‌జీ పరమపదించిన ఆరు నెలల తరువాత నాగపూర్‌లో శీతాకాలం శిబిరం జరిగింది. అందులో గురూజీ మాట్లాడుతూ ఇలా వివరించారు : "ఇప్పుడు నేను స్పష్టంగా చెబుతున్నాను. డాక్టర్‌జీని మనం అసలు అర్థం చేసుకోలేకపోయాం. మనం మన వ్యక్తిగతమైన వృద్ధిగురించి, వ్యక్తిగతమైన సుఖాల స్వప్నాల గురించి పాకులాడకూడదని, వీటన్నిటికన్నా ఉన్నతంగా ఎదిగి సంఘకార్యాన్ని దేశవ్యాప్తం చేసేందుకై మనం ఏకమవ్వాలని ఆయన వాంఛించారు. డాక్టర్‌జీ జీవితం మనకేమి చెబుతోందో దానిని మనం అర్థం చేసుకోలేకపోయాం. మన ఈ జాతిని సంఘటితంగా, వైభవ సంపన్నంగా చేసేందుకు మనల్ని మనం సంఘకార్యానికి సమర్పించుకోవాలి."

ప్రభావిశాలియైన జీవన సూత్రం : గురూజీ హృదయంలో అందరిపట్లా అపారమైన స్నేహభావం ఉండేది. ఒకప్పుడు ఒక బాలుడు ఆయన ఆటోగ్రాఫ్ (సంతకం) సందేశం కావాలని అర్థించారు. గురూజీ వినమ్రతతో "బాబూ! నేను సందేశాలిచ్చేటంత మహా పురుషుడను కాను" అని చెప్పారు. కాని ఆ బాలుడు పట్టుబట్టి అర్థించాడు. అప్పుడు వారు చిరునవ్వుతో 'మానవసేవే పరమాత్మ సేవ' అని ఒకే ఒక వాక్యం రాసి సంతకం పెట్టారు.

కార్యకర్త బాధ్యత : గురూజీ తన జీవితంలోని ఒక సంఘటన ఇలా వివరించారు : "ఇదివరకు మా వద్ద ఒక సంఘ కార్యకర్త ఉండేవాడు. అతడు విద్యార్థి. కాని ఏమీ చదివేవాడు కాదు. తన పాఠ్యాంశాలేవో కూడా అతనికి తెలియవు. అతనివద్ద పుస్తకాలు కూడా ఉండేవి కావు. ఆ విద్యార్థి పరీక్షలలో ఉత్తీర్ణుడు అయి తీరాలని నేను అనుకున్నాను. ఎందుకంటే సంఘకార్యకర్త పరీక్షలలో విఫలమైతే అది ఒక చెడు ఉదాహరణగా ఉండిపోతుంది. చాలామంది పెద్దలు ఇక తమ పిల్లలను అతనితో కలిసి ఉండనివ్వరు. అందుకని నేను విశ్వవిద్యాలయానికి వెళ్లి అతని కొరకై అభ్యాసక్రమం, పుస్తకాన్ని తీసుకువచ్చాను. కొంతమంది అధ్యాపకులను కూడా కలుసుకున్నాను. ఆ విద్యార్థికి చదువు చెప్పడానికై నేను చాలా విషయాలు నేర్చుకోవలసి వచ్చింది. ఎందుకంటే అవి నేను చదువుకున్నవి కాదు. రోజూ ఉదయం 5.30 గంటలకు అతనికి చదువు చెప్పే వాడిని. చివరికి అతడు పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ రోజుల్లో అన్నిశాఖలలోను ఈ అలవాటు ఉండేది. జ్యేష్ఠ విద్యార్థులు కొత్త విద్యార్థులకు చదువులో

యువ తపస్వి!

సహాయపడుతూండేవారు.

"మన స్వయంసేవకుల మంచి, చెడ్డలను మనం పట్టించుకోకపోతే, వారి స్వయంసేవకత్వం వారి మంచికేనన్న నమ్మకాన్ని మన చేతల ద్వారా కల్పించకపోతే వారిని మనం కలిపి ఉంచలేము.

నాగపూర్‌లోని విద్యార్థి స్వయంసేవకులు తనను కలుసుకోవడానికి వచ్చినపుడు వాళ్లతో పరీక్షలు సమిపించి, మీరు చదువులో నిమగ్నులై ఉన్నపుడు దగ్గరలో ఏదో ఊరేగింపు వెళుతూందనుకోండి, దానివైపు చూస్తారా? అది అసలు మీకు వినపడనే కూడదు. అలా మీకు అలవాటైపోవాలి అన్నారు.

మన సంఘ కార్యక్రమాల ద్వారా ఈ అలవాటు ఏర్పడుతుంది. శ్రేష్ఠత్వం, యోగ్యత కలుగుతాయి. 'దక్ష' చేసే అలవాటు నుంచి క్రమంగా ప్రతి పనిని చక్కగా చేసే గుణం నిర్మాణమవుతుంది. మనం పైసల విషయంలో జాగ్రత్తగా ఉంటే రూపాయలు తమ జాగ్రత్త తామే పడతాయి. చిన్న పనులు చక్కగా చేస్తే పెద్ద పనులు ఎప్పుడూ పాడు కావు.

నవయువకులు కావాలి: తను, మన, ధన సమేతంగా యౌవన భరితమైన శక్తి సామర్థ్యాలతో వికసించిన జీవితాలు ఈ సంఘకార్యానికి కావాలి. చీకిపోయిన జీవితం దీనికి పనికిరాదు. జీవితంలోని పొంగు ఉత్సాహం చల్లారాక మిగిలిన నిస్తేజమైన, నీరసమైన జీవితాన్ని దేశానికి సమర్పిస్తామని ఎవరైనా అనవచ్చు. కాని అది పొసగదు. అది పని చెయ్యని సిద్ధాంతం. మన జీవితంపై అన్నిటికన్నా మొదటి అధికారం సమాజానిది అర్థం చేసుకుని మనం ముందుకు సాగాలి. ఈ ఆలోచనతోనే మనం జీవితాన్ని యోజన చేసుకోవాలి.

నిష్ఠ, సత్ప్రవర్తన అలవరచుకోవాలి: మద్రాసులో జూన్ 26, 1966న విద్యార్థుల కార్యక్రమంలో గురూజీ విద్యాభ్యాసం గురించి ప్రసంగిస్తున్నారు. 'విద్యను అభ్యసించడమంటే కేవలం చదవడం, వ్రాయడం, నేర్చుకోవడం మాత్రమే కాదు. విద్య నేర్చుకున్నందుకు సమాజ పరిణామంగా దేశభక్తి జాగృతంకావాలి. తన కర్తవ్యం గురించిన అవగాహన కలగాలి. విద్యాభ్యాసంవల్ల మనిషి దేశభక్తుడు కానట్లయితే, అది విద్యకాదు. అది కేవలం అక్షర జ్ఞానం మాత్రమే అనవచ్చు. సరైన అర్థంలో మన సమాజాన్ని సుశిక్షితం చెయ్యాలని మనం కోరుకుంటున్నాం. అది మన శాఖా కార్యక్రమాల ద్వారా జరుగుతుంది. మనకు లభించే స్వయంసేవకులు చదవడం, వ్రాయడం తెలిసినవారు కాకపోవచ్చు; కాని వాళ్లు తప్పకుండా సుశిక్షితులవు తారు.

"నాకు ఒక కార్యకర్త గుర్తుకు వస్తున్నాడు. అతడు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తుండేవాడు. 11 శాఖలను నిర్వహిస్తూ ఉండేవాడు. అతడికి తన పేరు వ్రాసుకోవడం కూడా రాదు. కాని సమాజంలో ప్రతి ఒక్కరితోను అతనికి ఆత్మీయ సంబంధం ఉండేది. అనేకమంది స్వయంసేవకులకు అతడు సమాజం పట్ల గల కర్తవ్యాన్ని బోధించి వారికి పనిలో ప్రేరణ ఇస్తూండేవారు. అందువల్ల ఆ క్షేత్రంలో ఆ కార్యకర్తకు మంచి విలువ ఉండేది. అతడితో సంప్రదించిన తరువాతనే ఊళ్లో ఇతర సార్వజనిక కార్యక్రమాలు వేటినైనా జరిపితే మంచిదని అందరికీ అనిపిస్తూ ఉండేది. అతడు అంత విశ్వాసపాత్రుడయ్యాడు. ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు ఆ ఊరికి వెళ్లి ఉపన్యాసాలు ఇవ్వడం సాధ్యమయ్యేది కాదు. "ఈ కార్యకర్త చదువు లేనివారు కదా, ఇతడిని మీరు ఎందుకు అంతగా విశ్వసిస్తున్నారు" అని ఒక నేత ఊరివారిని అడిగాడు. "అతడు చదువులేనివాడు కావచ్చు, కాని ఎప్పుడూ మా మంచి గురించే ఆలోచిస్తాడు. అందుచేత ఊళ్లో అందరూ అన్ని పనులనూ ఒక్క ఆలోచనతో చేయడం జరుగుతుంది. అతడి ప్రవర్తన నిష్కళంకమైనది. అందుచేత అతడంటే మాకు విశ్వాసం" అని ఊరి ప్రజలు చెప్పారు. అంతా విని ఆ నాయకుడు ఆ కార్యకర్తను "ఎన్నికలను ఎందుకు వ్యతిరేకిస్తున్నావు? మమ్మల్ని మాట్లాడనిస్తే నీకు వచ్చే నష్టమేమిటి?" అని అడగగా ఆ కార్యకర్త "అయ్యా! ఎన్నికల ప్రసంగాలలో మీరు ఒకరినొకరు ద్వేషించుకునే మాటలే చెబుతారు. అటువంటి మాటలవల్ల గ్రామానికి ఏమి జరుగుతుంది?" అని జవాబిచ్చాడు. సూటిగా అన్నప్పటికీ, స్వచ్ఛ హృదయంతో అన్న ఆ మాటలను విన్న ఆ రాజకీయ నేత ఏ సమాధానం చెప్పకపోవడమే తనకు మేలని భావించి తిరిగిపోయాడు.

యువతకు పిలుపు: అనేక ప్రసంగాలలో గురూజీ యువకులకు ఉత్సాహాన్ని వృద్ధి చేస్తూ ఇలా పిలుపునిచ్చారు. "మనం సమస్త శక్తితో ఈ దేశభక్తి జ్యోతిని వెలిగించాలి. దానిని దేశ వ్యాపితమైనదిగా, ప్రగాఢమైనదిగా చెయ్యాలి. దాని ప్రకాశంలో అజ్ఞానాంధకారం తొలగిపోతుంది. ఈ జ్యోతి లోకంలోని అసురశక్తులన్నిటినీ సవాలు చేస్తుంది. ఈ మార్గంలో మాత్రమే మనం సాఫల్యం పొందగలం."

సంఘకార్యం-ఆరోగ్యం : "పరిశ్రమపూర్వకంగా సంఘకార్యంతో మమేకం కావాలంటే కష్టాలను సహించవలసే ఉంటుంది. కష్టించి పనిచేసేటప్పుడు మన శరీర దారుఢ్యం సరిగ్గాలేక కాస్త అటూ ఇటూ గబగబా వెళ్లి వచ్చేసరికి తట్టుకోలేని పరిస్థితి వస్తే మనం సంకల్పించిన మహాకార్యం నెరవేరదు. కనుక శరీరం ఆరోగ్యంగా శక్తిసంపన్నంగా ఉండాలి" అని గురూజీ అనునిత్యం యువకులకు చెబుతూండేవారు.

"నేను ఎన్నో ఏళ్లుగా నా స్వయంసేవక బంధువులకు ఇలా చెబుతున్నాను : "ఎక్కువగా వద్దుగానీ రోజూ కనీసం 25 సూర్యనమస్కారాలు చేస్తూ ఉండండి. ఎవరివద్దనైనా నేర్చుకుని మీ శరరానికి అనుకూలంగా ఉండే ఆసనాలు రెండో మూడో వెయ్యండి. అయిదు నిమిషాలు కూర్చొని దీర్ఘశ్వాసలు తీసుకోండి. దానితో శరీరానికి కావలసినంత శక్తి, చైతన్యస్ఫూర్తి ఎప్పుడూ అలిసి పోకుండా ఉండే సామర్థ్యం కలుగుతాయి."

"ఈ రోజుల్లో పదుచుతనంలో తమ శరీరాలను సౌందర్య దృష్టితో అలంకరించి తీర్చిదిద్దుకొనడానికి వెచ్చిస్తున్న సమయంలో కనీసం వందవ వంతు అయిన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేందుకు వినియోగిస్తే బలిష్ఠంగా తయారుకాగలరు. అయినా అందరూ చెప్పేది మాకు సమయంలేదనే."

"నా జీవితంలో నాకు సొంతంగా అనుభవంలోకి వచ్చిన విషయం ఇది. ఈ రోజు ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే కొన్నాళ్ల క్రితం డాక్టర్లంతా కలిసి నా శరీరంలోని ఒక భాగాన్ని కోసివేశారు. అందుచేత 2 సంవత్సరాలనుంచీ సూర్యనమస్కారాలు చెయ్యలేకపోతున్నాను. అంతకుముందు వాటిని చేస్తూనే ఉండేవాడిని. అంటే నాకు 65 సంవత్సరాలు వచ్చే వరకూ ఇదంతా జరుగుతూనే ఉండేది. నేను ఇన్నేళ్లుగా దేశమంతా పర్యటిస్తూన్న విషయం మీకు తెలుసు. ఇప్పుడు నా గురించి నా సహచరులు మరింత జాగ్రత్తగా చూసుకుంటున్నారు. కాని ఇంతకు ముందు నేను కాలినడకనే పల్లెపల్లెకు తిరిగాను. కారు, ఎడ్లబండి, లేకపోతే సైకిలు, ఏదీ దొరకకపోతే కాలినడక-ఇలా అన్నిరకాల ప్రయాణాలు చేశాను. ఉదయమైనా, రాత్రి అయినా, అన్నం దొరికినా,దొరక్కపోయినా అలాగే కాలంవెళ్లబుచ్చాను. అయినా, ఇప్పటికీ మీ ముందు సజీవంగానే ఉన్నాను. మళ్లీ ఈ అన్నిరకాల ప్రయాణాలు చేస్తూనే ఉన్నాను.

చాలామంది తమ వయసు ఉడిగిపోయిందని అలసిపోయి చతికిలబడే వయసులో నేను పూర్తి ఉత్సాహంతో కార్యరతుడనై ఉన్నాను. ఇందుకు కారణం నేను చిన్నప్పటి నుంచీ వ్యాయామం చెయ్యడమే. యౌవనంలోను, ఆ తరువాతి దేశలోను, మొన్నమొన్నటివరకు నా వ్యాయామసాధన సాగుతూనేఉంది. నాకు వ్యాయామంవల్ల ఇంత ప్రయోజనం కలిగింది. అందుచేత అన్ని పరిస్థి తులనూ ధీ కొనగల శరీరాన్ని మనం పొందేందుకు ఆలోచించాలి. **– శ్రీ గురూజీ – యువత పుస్తకం నుండి**

ప్రాచీన నాగరికతలకు ముప్పు మతమార్పిడులు

మోసపూరిత, బలవంతపు మతమార్పిడులు, ప్రాచీన నాగరికతల పరిరక్షణపై చర్చ కావాలంటూ జెనీవాలోని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలిలో బీజేపీ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామ అల్లిముత్తు కోరడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భారత్ వంటి సజీవ నాగరికతలను పరిరక్షించడం అనేది కేవలం సంస్కృతి వారసత్వ పరిరక్షణ కోణంలోనే కాక, ప్రపంచ పర్యావరణ సవాళ్లను పరిష్కరించేందుకు అత్యవసరమనే దృష్టితో చూడాలని ఆయన వాదించారు. మండలిలో మతాంతరీకరణలపైన, ప్రాచీన నాగరికతలపైన, అది చూపే ప్రభావంపైనా ప్రస్తావన రావడం ఇదే తొలిసారి.

ప్రాచీన నాగరికతలు అంతరించిపోతే, సంస్కృతి, వారసత్వానికి ఆవల దుష్ఫలితాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా మనుగడ సాగిస్తున్న నాగరికతలను పరిరక్షించడం అన్నది పర్యావరణ వైవిధ్యానికి, నిలకడైన జీవన విధానాలకు దారితీస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మూడు అంశాలను ప్రస్తావించారు. మొదటగా, ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన సజీవ నాగరికతా ప్రాంతాలలో బలవంతపు మతాంతరీకరణలు నిలవరించేందుకు చర్యల కోసం పిలుపునిచ్చారు. రెండవది, హిందూ ధర్మాన్ని కేవలం ఒక మతంగా కాక ప్రాచీన సాంస్కృతిక తాత్విక, నాగరికతా వారసత్వంగా అర్థం చేసుకోవాలన్నారు.

మూడవది, నాగరికతా వైవిధ్య పరిరక్షణ అంశాన్ని గ్లోబల్ వార్మింగ్‌ను పరిష్కరించే కృషితో అనుసంధానం చేసి చూడాలన్నారు. పర్యావరణ సమస్యలను కేవలం శాస్త్రీయ, విధానపరమైన విధానాల దృష్టితోనే కాకుండా సాంస్కృతిక కోణంలో కూడా చూడాలన్నారు. సుస్థిరత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి భారతీయ నాగరికతా సంప్రదాయాలు అందించే దృక్కోణాలపై అంతర్జాతీయ చర్చలు మరింతగా దృష్టి కేంద్రీకరించాలన్నారు.

గ్లోబల్ వార్మింగ్‌పై చర్చలు సాధారణంగా పారిశ్రామిక, సాంస్కృతిక దృక్పథాలనుంచే జరుగుతుంటాయని, సాంస్కృతిక కోణంపై పరిమిత దృష్టి ఉంటుం దన్నారు. సాంస్కృతిక వైవిధ్యం అనేది పర్యావరణ సమతుల్యానికి దారితీస్తుందని, ఎందుకంటే, భిన్న నాగరికతలు భిన్న జీవనశైలులను, సంప్రదాయాలను, వినిమయ సరళులను అందిస్తాయని అన్నారు. సహజవనరులు, పర్యావరణంపై ఒత్తిడిని తగ్గిస్తూ బహుళ సంస్కృతులు తమ ఉనికిని కొనసాగించడమే కాకుండా, వైవిధ్య భరితమైన జీవన విధానాలతో పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నాయని అల్లిముత్తు అన్నారు. ముఖ్యంగా తమ సంప్రదాయాలలో ప్రకృతి ఆరాధన కలిగి ఉన్న నాగరికతలు, చారిత్రకంగా పర్యావరణ పరిరక్షణకు దోహదం చేశాయని, చేస్తున్నాయని అన్నారు. తన వాదనకు బలాన్ని చేకూర్చేందుకు తమిళనాడులోని తన స్వస్థలం పన్రుటిలో గేదిలం నది ఉదాహరణను ఇచ్చారు. ఆ నదిని విష్ణువుకు అభిషేకం చేసేందుకు సృష్టించారని అక్కడ స్థానికుల నమ్మకం కావడంతో దానిని కలుషితం చేయడానికి వారు తటపటాయిస్తారు. అటువంటి నమ్మకాలు సహజ వనరులను

ఆపదలో శత్రువుకైనా ఆపన్నహస్తం

ఆపదలో ఉన్న శత్రువునైనా కాపాడడం మానవ ధర్మం అన్న సనాతన విలువను దృష్టిలో పెట్టుకొని భారత నావికాదళ, కోస్ట్‌గార్డ్ సిబ్బంది చేసిన సహాయానికి చైనా అధికారికంగా కృతజ్ఞతలు చెప్పింది.

జూన్ 2025లో కేరళ తీరానికి సమీపంలో అరేబియా సముద్రంలో ప్రయాణిస్తున్న చైనాకు చెందిన ఒక కార్గో నౌకలో ఘోర అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, ప్రాణాపాయంలో ఉన్న 12మంది చైనా నావికులను భారత నావికాదళం, కోస్ట్ గార్డ్ సిబ్బంది అత్యంత సాహసోపేతంగా రక్షించారు.

ఈ నేపథ్యంలో ఇటీవలే భారత్‌లో చైనా కొత్తగా నియమించిన రక్షణ ప్రతినిధి రియర్ అడ్మిరల్ యూ జియాన్ భారత రక్షణ దళాలకు అధికారికంగా కృతజ్ఞతలు తెలిపారు. చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ 99వ వార్షికోత్సవ రిసెప్షన్ వేడుకల సందర్భంగా న్యూఢిల్లీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత సైన్యం సమయాను కూలంగా స్పందించి చూపిన ఈ మానవతా దృక్పథాన్ని, వృత్తి నైపుణ్యాన్ని తాము ఎప్పటికీ మరిచిపోలేమని ఆయన కొనియాడారు. గతంలో ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల పరిరక్షణ మిషన్లలో కూడా భారత్, చైనా సాయుధ బలగాలు కలిసికట్టుగా అద్భుతమైన సహకారాన్ని అందించాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

భారత్, చైనాల మధ్య సరిహద్దు విభేదాలు ఉన్నప్పటికీ, ఇరు దేశాల వ్యూహాత్మక, ఉమ్మడి ప్రయోజనాలే అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు . సైనిక, దౌత్య రంగాలలో పరస్పర నమ్మకాన్ని పెంచుకోవడానికి, భవిష్యత్తులో ఇరుదేశాల రక్షణవ్యవస్థల మధ్య మరింత కమ్యూనికేషన్, సహకారం అవసరమని ఆయన పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో చైనా మిలిటరీ అధికారి బహిరంగంగా భారత రక్షణ దళాలను ప్రశంసించడం దౌత్యపరంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

అసోం వరద బాధ

అసోంలో వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. దాదాపు 66మంది ప్రాణాలను బలికొని, లక్షలాదిమందిని నిరాశ్రయులను చేశాయి. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి, అక్కడి భౌగోళిక పరిస్థితుల కారణంగా సైనిక సిబ్బంది కూడా వెళ్లలేకపోతోందనే వార్తలు వస్తున్నాయి. కాగా, ప్రస్తుతం కొంతలో కొంత వరద పరిస్థితులు బాగుపడినా, ప్రజలు తమ ఇళ్లకు తిరిగి వెళ్లలేకపోతున్నారు. వరద నీరు తగ్గుముఖం పట్టినా, బురద కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదల కారణంగా రవాణా, సమాచారంతో పాటు పలు వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వందలాది గ్రామాలు సహాయక,

తమ పవిత్ర సంప్రదాయాలతో అనుసంధానించి, వాటిని పరిరక్షించేలా చేస్తాయన్నారు. సాంస్కృతిక ఆచారాలు పర్యావరణ పరిరక్షణతో సమలేఖనం అవుతాయనేందుకు ఇది ఉదాహరణ అన్నారు.

అంతేకాదు, నాగరికతలకు, మతాలకు మధ్య తేడా ఉందని అల్లిముత్తు వాదించారు. నాగరికత అనేది సంప్రదాయాలు, తాత్వికతలు, సామాజిక ఆచారాలు, ప్రకృతితో సంబంధాలు అనే విస్తృతమైన సాంస్కృతిక చట్రాన్ని ఆవరించి ఉంటుందని ఆయన వివరించారు. కాగా, మతాలు అనేవి ప్రాథమికంగా విశ్వాస వ్యవస్థ కేంద్రంగా ఉంటాయన్నారు.

బహుళ సంప్రదాయాలు, ఆరాధనా పద్ధతులు కలిగిన నాగరికతలనేవి వైవిధ్యమైన జీవనశైలులను, వినిమయ సరళులను ప్రోత్సహిస్తాయని, ఇది పర్యావరణంపై సానుకూల ప్రభావాలను కలిగి ఉండేలా చేస్తుందన్నారు.

చారిత్రిక నాగరికతలైన ఈజిప్ట, రోమ్‌లను ప్రస్తావిస్తూ, వలు ప్రాచీన నాగరికతలు అంతరించిపోవడానికి ప్రపంచం సాక్షి అన్నారు. ఈ క్రమంలో భారత్ సహా సజీవ నాగరికతలను పరిక్షించడం అన్నది అంతర్జాతీయ ప్రాధాన్యత కావాలన్నారు. అత్యంత ప్రాచీన సజీవ నాగరికతలలో ఒకటైన భారత్‌లో శరవేగంగా జరుగుతున్న మతమార్పిడులను నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అటువంటి నాగరికతలను పరిరక్షించడం అన్నది కేవలం సాంస్కృతిక పరిరక్షణ మాత్రమే కాదని, అది పర్యావరణ సుస్థిరతకు, గ్లోబల్ వార్మింగ్ సమస్య పరిష్కారానికి ఒక విస్తృత కృషి కాగలదన్నారు.

మానవహక్కులపై, సాంస్కృతిక పరిరక్షణ, పర్యావరణ మార్పు వంటి అంతర్జాతీయ చర్చలలో నాగరికతా ధృక్కోణాన్ని ప్రవేశపెట్టాలని ఆయన జెనీవాలోని మానవహక్కుల ఫోరంలో కోరారు.

...తులకు సేవలు

చర్యలకు ఇప్పటికీ ఆటంకాలు వస్తున్నాయి.

ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, సేవాభారతి కార్యకర్తలు అహర్నిశలూ, పూర్తి అంకిత భావంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వరదలకు గురైన శివసాగర్, చారైదేవ్, జోర్హాట్ జిల్లాల్లోని వేలాది కుటుంబాలు నిరాశ్రయులై ఆహారం, సురక్షితమైన తాగునీరు, ఆశ్రయం, అత్యవసర వైద్య సంరక్షణ లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో వారి ఇబ్బందులను తొలగించేందుకు వలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం సేవలు అందిస్తున్నారు. శివసాగర్ జిల్లాలోని బెట్‌బారీ ప్రాంతానికి చెందిన కాకతి గ్రామం, డి-గావ్, నెం. 2 కొన్వర్ గ్రామం, చేతియా కైవర్త గ్రామాల్లో స్వయంసేవకులు భారీ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న 200 మందికి పైగా ప్రజలను రక్షించి, సురక్షిత ప్రాంతాలకు, కాంప్‌లకు తరలించారు. సుందర్ పుఖురి, బామున్ పుఖురి, గెలెకీ, రాజబారి వంటి నీటమునిగిన ప్రాంతాల్లో చిక్కుకున్న కుటుంబాలకు చిన్న పడవల సహాయంతో వండిన ఆహారం, తాగునీరు, ప్రాణ రక్షణ మందులు, దుస్తులు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు.

వరద బాధితులకు ప్రధానంగా తార్పాలిన్లు, దుప్పట్లు, దోమల బిళ్ళలు (కాయిల్స్), పొడి ఆహారం, బిస్కెట్లు, సురక్షితమైన తాగునీరు, సబ్బులు, పటిక (ఫిట్కిరి), అత్యవసర మందులను కూడా ఆరెస్సెస్ కార్యకర్తలు, సేవా భారతి కార్యకర్తలు అందిస్తున్నారు. చిన్న పడవల ద్వారా ఆహారం, నీటిని అందించడమే కాకుండా, వృద్ధులు, మహిళలు, పిల్లలు, అనారోగ్యంతో ఉన్న వారిని స్వయంసేవకులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే ఆదర్శంతో ప్రేరణ పొందిన స్వయంసేవకులు ఈ ప్రకృతి విపత్తు సమయంలో బాధితులకు అండగా నిలిచి వారికి నమ్మకాన్ని, ధైర్యాన్ని, బలాన్ని అందిస్తున్నారు.

రాష్ట్ర సాంస్కృతిక జంతువుగా గోమాత

దేశీయ ఆవును తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక జంతువుగా ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్ ప్రతిపాదన వంపారు. అలాగే, ప్రతి ఏటా సెప్టెంబర్ 17ను రాష్ట్రస్థాయి గోమాత దినోత్సవంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని గోశాలల సంరక్షణ కోసం గోశాల సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రతిపాదనలతో పశు గణాభివృద్ధి సంస్థ తరుపున ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దేశీయ ఆవును రాష్ట్ర సాంస్కృతిక జంతువుగా ప్రకటిస్తే పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా వాటి జన్యు పరిరక్షణ, సంకర జాతుల అభివృద్ధి, సమగ్ర పోషణలకు అధికారిక గుర్తింపు వస్తుందన్నారు.

ఇలా ఉండగా, గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించడం లేదా గోహత్యపై దేశవ్యాప్త నిషేధాన్ని విధించే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ డిమాండ్ సజీవంగా ఉంది.

కథ

తీరని గంటు మిగిలింది

కలశపూడి శ్రీనివాసరావు, న్యూయార్క్

న్యూయార్క్‌లోని వాల్‌స్ట్రీట్ ఆఫీస్ 34 అంతస్తులో తన విశాలమైన ఆఫీసులో ఉన్నాడు శంకరం విష్ణుభట్ల. ఆతని బాస్ బ్రైన్వాలస్ తలుపు తీసుకొని వచ్చారు.

''అభినందనలు శంకరం!'' అన్నాడు చిరునవ్వుతో.

"నీ బృందంతో రాత్రింబవళ్లు కష్టపడి, ఐటీ,ఏఐ సాధనాలతో అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను వెలికితీసి, పటిష్టమైన జాబితా రూపొందించి దొంగతనపు మార్గాలన్నీ మూసేశావు.అది అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన 2012లో 'ఆపరేషన్ హై రోలార్కేసు'ను తలపించేంత క్లిష్టమైనది. ఆ కేసులోనూ హ్యాకర్లు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకున్నారు.కానీ సాంకేతిక నిపుణులు డేటా విశ్లేషణతో వాటిని అడ్డుకున్నారు. నువ్వూ అదే తరహాలో పని చేయడం చాలా సంతోషంగా ఉంది" అని మెచ్చుకున్నాడు.

"నాకు అంతా ముఖ్యమైన పని ఇచ్చినందుకు కృతజ్ఞతలు" అన్నాడు శంకరం.

శంకరం తన సంస్థలో అత్యంత సున్నితమైన బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. అమెరికా పౌరులు కాని పెట్టుబడిదారుల చేతిలో ఉన్న అన్ని ఆస్తులు, షేర్లు, పెట్టుబడులను గుర్తించడం, అలాంటి ఆస్తులతో, గుప్తంగా లేదా హఠాత్తుగా ఏదైనా అమెరికా కంపెనీలను ఆక్రమించడానికి ఉపయోగపడకుండా పర్యవేక్షించడం ఆతని పని. అతని ఆఫీసు కిటికీలలో నుంచి దూరంగా కనిపిస్తున్న స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ సముద్రపు నీలిమలో మెరుస్తూ, స్వేచ్ఛకు ప్రతీకగా ఉన్న దృశ్యం అతని ఉద్యోగ ఉన్నతికి చిహ్నం.

ఆ రోజు ఉదయం శంకరం ఆఫీసు పని చేయకుండా మౌనంగా కూర్చొన్నాడు. అతని మౌనానికి కారణం ఆ రోజు వచ్చిన ఉత్తరం. 2025లో కాగితపు ఉత్తరాలు రావడం చాలా అరుదు. కానీ శంకరానికి ఆ రోజు వచ్చింది. అది అతని ఊరిలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకులు అబ్బిగారు రాసినది.

''నాయనా శంకరం! ఆశీర్వచనములతో రాయునది ఏమనగా... నువ్వు చిన్నప్పుడు తిరుగాడిన వేణుగోపాలస్వామి ఆలయం పాడైపోతున్నది. ధూప దీప నైవేద్యాలకు తగిన ఆదాయం లేదు. మన దేవాలయానికి చెందిన వంద ఎకరాల పంట భూమి, చెరువులు ఒక్కొక్కటిగా స్థానిక రాజకీయ నాయకుల చేతుల్లోకిపోయాయి. ఈ ఆలయ వైభవం మిగిలింది భక్తుల జ్ఞాపకాలలో మాత్రమే. నీకు విజ్ఞానం ఉంది. నీకు శక్తి ఉంది. ఏదైనా చేయి నాయనా! నువ్వు సంకల్పిస్తే భగవంతుడు నీకు దారి చూపిస్తాడు."– ఇట్లు అంపోలుఅబ్బి శంకరం కళ్లు మూసుకున్నాడు. తన చిన్నప్పటి వేమవరం కళ్ల ముందు మెదిలింది.

శంకరం చిన్నప్పుడు వేణుగోపాలస్వామి ఆలయం ఉత్సవం అంటే పల్లె మొత్తం ఒక కుటుంబంలా మారేది. ఉదయాన్నే అర్చకుల స్వరంలో వేదమంత్రాలు ఘోషించేవి. ప్రతిరోజు పూజలతోపాటు ఆయా పర్వదినాలలో రథోత్సవం, వసంతోత్సవం, తెప్పోత్సవం లాంటివి జరిపించే వారు. ఆలయం ముందు వరుసలో మట్టి దీపాలతో కాంతులు నింపేది కుమ్మరి వర్గం. కార్తిక మాసంలో వేలాది దీపాలు రాత్రి చీకటిని పండుగలా మార్చేవి. పద్మశాలి వర్గం నేసిన పట్టు వస్త్రాలు దేవుడి విగ్రహానికి అలంకరించడంతో ఎంతో శోభ కలిగించేవి. రైతులు మొదటి కోతలోని ధాన్యం, పప్పులు, పండ్లు దానం చేసి అన్నదానంలో భాగం అయ్యేవారు. వడ్రంగులు రథానికి కొత్త చక్రాలు అమర్చడం, విశ్వకర్మలు బంగారు కిరీటాలను పునరుద్ధరించడం, బెస్తవారు తెప్పోత్సవంలో తమ వంతు పాత్ర పోషించేవారు. గౌడ వర్గం వారు ఉత్సవవిగ్రహంతో ఊరేగింపు చేసేవారు. మాలీలు పూలమాలలు, తోరణాలతో ఆలయాన్ని తీర్చిదిద్దేవారు. చిత్రకారులు, శిల్పులు గోపురం చిత్రాలను కొత్త రంగులతో మెరిపించేవారు. ఇలా ప్రతి కులం వారు తమ ప్రత్యేక నైపుణ్యంతో, అర్పణభావంతో ఆలయం పనులు చేసేవారు. ఆలయానికి సొగసులని తీర్చిదిద్దేవారు. ఆలయం కేవలం పూజాస్థలమే కాదు? సమాజాన్ని ఒక కుటుంబంగా తీర్చిదిద్దే వేదిక. వేణుగోపాలస్వామి ఆలయం ఊరి హృదయం. అక్కడ భక్తి, స్నేహం, అన్నదానం, ప్రసాదాలు ఇంకా గుర్తు ఉన్నాయి శంకరానికి. తన ఊరు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.

* * *

తరువాతి వారంలోనే శంకరం వాల్‌స్ట్రీట్ మీటింగ్‌లు అన్నీ వెనక్కి పెట్టి వేమవరం చేరుకున్నాడు. అబ్బిగారినికలిసాడు. తాను ప్రయత్నం చేస్తానని చెప్పాడు. అబ్బి గారు ఆనందంతో ఆశీర్వదించారు. శంకరం బంధుమిత్రులతో ఆలయం విషయం మాట్లాడడం మొదలు పెట్టాడు.

"మన ఆలయ భూములు తిరిగి తెచ్చుకోవాలి" అని ఉత్సాహంగా చెప్పాడు. కానీ వారి సమాధానాలు చాలా నిరాశ కలిగించాయి. 'శంకరమా! ఆ భూములన్నీ ఏళ్ల క్రితమే అన్ని పార్టీల స్థానిక నాయకులు పంచుకుని కూర్చున్నారు, వాళ్లతో పోరాడటం అంటే తలనొప్పే. కొరివితొ తల గోక్కున్నట్టే. పూజారి అడిగారని నువ్వు ఇంత పెద్ద సమస్యలో పడాల్సిన అవసరం లేదు" అని ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా చెప్పారు.

అయినప్పటికీ, శంకరం ఆక్రమిత ఆలయ భూములని వెనక్కి తెచ్చే ప్రయత్నం మొదలు పెట్టాడు. అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయ చరిత్రను చదవడం ప్రారంభించాడు. దాదాపు 500 సంవత్సరాల తరువాత, దీర్ఘకాల పోరాటం, రాజకీయ ఒత్తిళ్లు, సాక్ష్యాధారాల సేకరణ తర్వాత, 2019 నవంబర్ 9న భారత సుప్రీంకోర్టు తన తీర్పుతో ఆ స్థలాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు అప్పగించింది. ఈ విషయం అతనికి ధైర్యాన్ని ఇచ్చింది. అయోధ్య తీర్పు వివరాలు చదివాడు. ముఖ్యంగా, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేసిన మాజీ అధికారి కె.కె.మహ్మద్ జీవితచరిత్ర ' నేను

భారతీయుడిని' చదివి, ఆయన అయోధ్యలో తవ్వకాల ద్వారా ఆలయం ఉనికిని నిరూపించిన విధానం, మతపరమైన పక్షపాతం లేకుండా నిజం కోసం చేసిన కృషి శంకరాన్ని బాగా ప్రభావితం చేసింది. 'సత్యానికి చరిత్ర మద్దతు ఇస్తే, ఏ అడ్డంకినైనా దాటవచ్చు' అన్న విషయం బోధపడింది. ఆ ప్రేరణతో వేణుగోపాలస్వామి ఆలయ భూములను తిరిగి తేవడంపై మరింత నిశ్చయంతో ముందుకు వెళ్లాడు.

* * *

ఒకనాడు వైభవోపేతమైన ఆలయాలలు మరుగున పడిపోతున్నాయ్ది. కూలిపోతున్న గోడల అశ్రద్ధ, వంచన, దోపిడీ, నమ్మకద్రోహపు మచ్చలను మోస్తున్నాయి. రెండు తెలుగు నేలలపై తరాల క్రితం రాజులు, భక్తులు, సమర్పించిన ఐదు లక్షల ఎకరాలకు పైగా ఆలయ భూములు, లోభుల పంజాలలో చిక్కుకొన్నాయి. దేవాలయాలలో నిత్యపూజలు, ఉత్సవాలు నిరాటంకంగా సాగేందు దానంగా వచ్చిన భూములు ఆక్రమణల పాలై, ఆలయాల ప్రాణాధారానికి అంతరాయం కలిగింది. భూములపై ఆదాయం ఆగిపోవడంతో, నిత్య ధూపదీపనైవేద్యాలు, ఆలయ మరమ్మతులకు అవకాశం లేకుండా పోతోంది. సాంత్వన కలిగించే పవిత్ర స్థలాలు, నిశ్శబ్దంగా కూలిపోతూ దుఃఖ చిహ్నాలుగా మారిపోయాయి.

శంకరం పాత భూముల రికార్డులు, దానపత్రాలు, కైఫియత్తులు, ప్రభుత్వ గెజిట్లు వెతికాడు. ఆన్‌లైన్‌లో పాత మ్యాపులు, సర్వే పత్రాలన్నీ తన వాల్‌స్ట్రీట్ ఉద్యోగపు అనుభవంతో డిజిటల్‌గా సంపాదించాడు. ఈ పనిలో అతనికి తెలుగువారే కాక అమెరికన్లు, దేశ, విదేశాలలో ఉన్న ఆర్కియాలజీ నిపుణులు, ఐటీ నిపుణులు సహాయ పడ్డారు.

శంకరం ఊర్లోని యువకులతో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. తాను సేకరించిన దేవాలయాల వివరాల గురించి వివరించాడు.

"మన ఆలయాలు కేవలం రాళ్లతో కట్టిన గోడలు, గోపురాలు మాత్రమే కావు. అవి మన మహోన్నత మేధోవారసత్వాన్ని అద్భుతంగా

ప్రతిబింబిస్తున్నాయి".

"వీటిని ఎవరు కట్టించారు?" ఒక యువకుడు అడిగాడు.

"మన పూర్వికులు....శాతవాహనులు, ఆంధ్ర ఇక్ష్వాకులు, పల్లవులు, తూర్పు చాళుక్యులు, తెలుగు చోళులు, కాకతీయులు వంటి వారు వందల ఏళ్ల క్రితం నిర్మించారు. ఇవి మన ఆధ్యాత్మిక శ్రద్ధ, శిల్పకళ వైభవానికి నిలువెత్తు సాక్ష్యం" అని శంకరం జవాబు ఇచ్చాడు.

"అమరావతి సంగతేమిటి ?" అని అడిగాడు మరో యువకుడు.

"అమరావతి 2,300 ఏళ్ల నిరంతర చరిత్రకు సజీవ సాక్ష్యం" అని జవాబు ఇచ్చాడు శంకరం.

"ఇవి ఒక్క తెలుగు వారి ప్రతిభమాత్రమే కాదు? విశ్వ మానవమేధకి మచ్చుతునకలు. ఇవి మన పూర్వికుల నుంచి అందిన సంపద. ఇలాంటి మహత్తర సంపదను మనం కాపాడుకోకపోతే, ఎవరు కాపాడతారు? ఇప్పుడు మన బాధ్యత మొదలైంది," అని ముగించాడు.

"ప్రస్తుత రికార్డులు నకిలీవని, భూమి ఆక్రమణ పాలైలందని ఈ శిలాశాసనం వల్ల నిరూపితమైంది. కనుక ఆలయ భూములను ఆక్రమించుకున్న వారు వెంటనే వాటిని ఖాళీ చేసి వేణుగోపాలస్వామి ఆలయానికి అప్పగించాలి. దీనికి తగిన రికార్డులను ప్రభుత్వ తయారుచేయాలి. డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిగారిని సేవని న్యాయస్థానం అభిన్నది" అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

యువత అంతా ఉత్సాహంతో చప్పట్లు కొట్టారు.

* * *

శంకరం అమెరికా తిరిగి వెళ్లాక 'తరతరాల తెలుగు సంపద' పేరిట, యూట్యూబ్ ఛానల్, ఫేస్‌బుక్ పేజీ, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్రారం భించాడు. ప్రతి పోస్టులో ఒక దేవాలయం, పాత భూమి పత్రం, ప్రస్తుత ఆక్రమణ ఫొటో, చరిత్ర వివరాలు అందించాడు. ఆ వీడియోలు, వివరాలు వైరల్ అయ్యాయి. న్యూయార్క్ నుండే వారంవారం జూమ్ మీటింగులు నిర్వహించాడు. సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్, ఏఐలను వాడి తగిన ప్రచారం చేశాడు. వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. యువతీయువకులు దేశ , విదేశాలలో "ఆలయ రక్షణ యాత్ర"లు నిర్వహించారు. కానీ శంకరానికి తెలుసు... సోషల్ మీడియా హంగామాతో ఆక్రమిత ఆలయ భూములు తిరిగి రావని. అందుకే ఒక పటిష్టమైన ప్రణాళిక రూపొందించాడు.

వేణుగోపాలస్వామి వంద ఎకరాల భూమిని ఆక్రమించుకున్న వారిపై కోర్టులో కేసు వేశాడు. ఈ తరహా కేసు విచారణకు ఆధ్యాత్మిక భావన గల పతివాద భయంకర ప్రసాద్ గారిని ముఖ్య న్యాయవాదిగా నియమించాడు.

* * *

కేసు విచారణకు వచ్చింది. కోర్టు గది కిక్కిరిసిపోయింది.

"గౌరవనీయ న్యాయమూర్తిగారూ! కొద్దిమంది రాజకీయ, దౌర్జన్యశక్తులు వేమవరంలోని వేణుగోపాలస్వామివారి ఆలయ భూములను ఆక్రమించాయి. ఈ భూములను వెంటనే విడిపించి ఆలయానికి తిరిగి అప్పగించవలసిందిగా కోర్టును వేడుకుంటున్నాను." అన్నారు ప్రతివాద భయంకర ప్రసాద్.

"ఇవిగో ప్రభుత్వ రికార్డులు! భూములు మా క్లయింట్ల పేర్లలోనే ఉన్నాయి. వీరే నిజమైన యజమానులు!" ప్రతివాదుల న్యాయవాది బిగ్గరగా అన్నారు.

వాదోపవాదనలు చాలా ఘర్షణాత్మకంగా జరిగాయి.

"ఆవన్నీ నకిలీ రికార్డులు!" ప్రతివాద భయంకర ప్రసాద్ గట్టిగా అన్నాడు.

''సాక్ష్యాలు చూపించండి''అని ఎదిరి పక్ష లాయరు అడిగారు.

నిరూపించే గట్టి సాక్ష్యం అందించలేకపోయారు శంకరం లాయరు.

"సాక్ష్యం చూపండి. కేవలం మాటలతో కేసు గెలవలేరు'' న్యాయమూర్తి గళం గదంతా మారుమోగింది. అయితే ఆలయభూములు ఆక్రమణకు గురయ్యాయని కానీ న్యాయమూర్తికి తెలుసు. అందుకే కేసును మరో నెలకు వాయిదా వేసి, గట్టి సాక్ష్యాలను ప్రవేశపెట్టాలని సూచించారు.

భూములు ఆలయానికి చెందుతాయని నిరూపించే అదనపు మార్గాలని అన్వేషించాడు శంకరం. ఈ సమయంలో అతని స్నేహితుల్లో ఒకరు, ఆలయ శిల్పకళా నివుణుడు, శిలాశాసనాల పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిని సంప్రదించమని సూచించాడు.

శివనాగిరెడ్డి తెలుగు ప్రాంతాల ఆలయ వారసత్వ పరిరక్షణలో విశేష సేవలు అందించారు. ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖలో డైరెక్టర్‌గా పనిచేసి, వేలాది ఆలయాల్లోని శిలాశాసనాలను గుర్తించి, ఎన్నో పుస్తకాలు రాసారు. ఆయన పరిశోధనలు తెలుగునాటచారిత్రక ఆలయ నిర్మాణాలు, భూదానాలు తెలియబరిచే శిలాశాసనాలని వెలికితీసారు.

* * *

కేసు తిరిగి విచారణకు వచ్చిన రోజు...బట్టతో కప్పి ఉన్న ఒక బరువైన రాతిబండను కొద్దిమంది సహాయంతో శంకరం కోర్టు లోపలికి తీసుకువచ్చారు.

అది చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

"గౌరవనీయ న్యాయమూర్తిగారూ! ఇదే సాక్ష్యం' అంటూ బండరాతిపై గల వస్త్రం తొలగించాడు. అది ఒక పెద్ద శిల శాసనం. అది తెలుగు అక్షరాలతో చెక్కిన శాసనం.

"ఇది సాక్ష్యం ఎలా అవుతుందో చెప్పండి" అడిగారు న్యాయమూర్తి.

శివనాగిరెడ్డి ముందుకు వచ్చి ''అయ్యా వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో, 500 ఏళ్ల క్రితం వేసిన ఈ శిలాశాసనాన్ని మేము కనుగొన్నాం" అంటూ దానిపై గల అక్షరాలను చదివారు "ఈ భూములు శాశ్వతంగా వేణుగోపాలస్వామి దేవాలయానికి ధర్మార్థంగా సమర్పించబడినవి" అని మొదలుపెట్టి ఆ శాసనంలో స్పష్టంగా పేర్కొన్న భూమి విస్తీర్ణం, ఇతర విశేషాలు వివరించారు.

న్యాయమూర్తి సహా మొత్తం కోర్టు హాల్ ఒక్కసారిగా నిశ్శబ్దమైంది. శిలాక్షరాలు, కాగితపు రికార్డుల కంటే శక్తిమంతమైనవని అందరికీ అర్థమైంది.

''ప్రస్తుత రికార్డులు నకిలీవని, భూమి ఆక్రమణపాలైందని ఈ శిలాశాసనం వల్ల నిరూపితమైంది. కనుక ఆలయ భూములను ఆక్రమించుకున్న వారు వెంటనే వాటిని ఖాళీ చేసి వేణుగోపాలస్వామి ఆలయానికి అప్పగించాలి. దీనికి తగిన రికార్డులను ప్రభుత్వం తయారుచేయాలి. డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిగారిని సేవని న్యాయస్థానం అభిన్నది" అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

శంకరం, ప్రసాద్, డాక్టర్ నాగిరెడ్డి, గ్రామస్తులు అందరూ ఆనందంతో ఒకరినొకరు చూసుకున్నారు. విజయం హర్షధ్వనిగా కాకుండా, ఒక లోతైన ఊపిరి పీల్చినట్టుగా అనిపించింది.

వేణుగోపాలుని దేవాలయంలో ధర్మ ఘంట నాదం మోగింది !

ఆలయ భూమి విజయం వార్త పరవళ్లు తొక్కిన నది ఊరూరా ప్రవహించి, సముద్రాన్ని చేరినట్టు ప్రపంచమంతా పాకింది. ★

అంతర్జాతీయ క్రీడాకారులకు విజయాలు, రికార్డులు, అవార్డులు, రివార్డులు సాధారణ విషయమే. అయితే ప్రపంచవ్యాప్తంగా అత్యంత గుర్తింపుగా నిలిచిపోయే పురస్కారం లభిస్తేనే క్రీడాకారులుగా తమ జీవితం పరిపూర్ణమైనట్లుగా మురిసిపోతారు.



భారత క్రికెట్‌కు 'హాల్ ఆఫ్ ఫేమ్' ఖ్యాతి!

క్రీడలు ఏవైనా క్రీడాకారుల జీవితంలో విజయాలు, రికార్డులు, అవార్డులు, రివార్డులు ఓ ప్రధానభాగం. అరుదైన క్రీడా, పౌరపురస్కారాలు లభిస్తే అంతకుమించిన ఆనందం మరొకటి ఉండదు. పెద్దమనుషుల క్రీడ క్రికెట్, రాయల్ గేమ్ టెన్నిస్ లాంటి వాటిలో అత్యున్నత ప్రమాణాలు నెల కొల్పడంతో పాటు తరతరాలకు స్ఫూర్తి దాయకంగా నిలిచే క్రీడాదిగ్గజాలకు 'హాల్ ఆఫ్ ఫేమ్' పురస్కారా లతో గౌరవించడం ఓ సంప్రదాయంగా వస్తోంది.

2009 నుంచే ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్....

అంతర్జాతీయ క్రికెట్ సమాఖ్య (ఐసీసీ)లో సభ్యత్వం కలిగిన టెస్టు హోదా పొందిన దేశాల క్రికెట్ దిగ్గజాల కోసం 2009లో 'హాల్ ఆఫ్ ఫేమ్'ను ప్రారంభించారు. పురుషుల, మహిళల విభాగాలలో క్రికెటర్లుగా అద్భుతాలు చేసి, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోయిన వారికే ఐసీసీ ఇందులో కల్పిస్తోంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారత్, పాకిస్థాన్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక దేశాలకు చెందిన పలువురు మేటి క్రికెటర్లు మాత్రమే ఈ గౌరవాన్ని దక్కించుకో గలిగారు.

2009-2025 మధ్య 15 మంది మహిళా క్రికెటర్లతో పాటు మొత్తం 122 మంది ఈ 'హాల్ ఆఫ్ ఫేమ్' గౌరవాన్ని అందుకున్నారు. వీరిలో భారత్‌కు చెందిన వారు 12 మంది మాత్రమే ఉన్నారు.

వినూమన్కడ్ నుంచి సౌరవ్ గంగూలీ వరకూ....

గత 17 సంవత్సరాలలో 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చేరిన భారత క్రికెట్ దిగ్గజాలలో వినూమన్కడ్, భారత మాజీ కెప్టెన్లు బిషన్ సింగ్ బేడీ, సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్, సచిన్ టెండుల్కర్, అనీల్‌కుంబ్లే, మహేంద్రసింగ్ ధోనీ, రాహుల్ ద్రావిడ్, సౌరవ్ గంగూలీ, వీరేంద్ర సెహ్వాగ్ తో పాటు మహిళా క్రికెట్ స్పిన్ ద్వయం డయానా ఎడుల్జీ, నీతూ డేవిడ్ ఉన్నారు.

1946-1959 మధ్యకాలంలో భారత క్రికెట్ కు అసమానసేవలు అందించిన స్పిన్ ఆల్ రౌండర్ వినూమన్కడ్‌కు 2021 హాల్ ఆఫ్ ఫే మ్ పురస్కారాలలో చోటు దక్కింది. వినూ మన్కడ్ మొత్తం 44 టెస్టులు ఆడి 2, 109 పరుగులు సాధించడంతో పాటు 162 వికెట్లు పడగొట్టారు. భారత క్రికెట్‌కు వుష్కరకాలం పాటు అనమాన సేవలు అందించడంతో పాటు క్రికెట్ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకొన్న వినూ మన్కడ్ కు ఐసీసీ తన హాల్ ఆఫ్ ఫేమ్ లో చోటు కల్పించింది.

2009లో బేడీ, గవాస్కర్, కపిల్‌లకు గౌరవం...

భారత దిగ్గజ ఓపెనర్ సునీల్ మనోహర్ గవాస్కర్, స్పిన్ మాంత్రికుడు బిషన్ సింగ్ బేడీలకు 2009 హాల్ ఆఫ్ ఫేమ్ జాబితాలో చోటు దక్కింది. భారత సారథిగా, ఎడమచేతి వాటం స్పిన్నర్‌గా, అరుదైన క్రికెట్ వ్యాఖ్యాతగా గుర్తింపు పొందిన బేడీ 1967 నుంచి 1979 వరకూ భారత క్రికెట్‌తో పాటు ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్‌కు సేవలు అందించారు. భారత్ తరపున 67 టెస్టుమ్యాచ్‌లు ఆడిన ఆయనకు 266 వికెట్లు, వన్డేల్లో 7 వికెట్లు పడగొట్టిన ఘనత ఉంది. సునీల్ గవాస్కర్ 1971 నుంచి 1987 వరకూ భారత క్రికెట్‌కు మూలస్తంభంగా నిలిచారు.

2009లోనే 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చేరిన కపిల్‌దేవ్ 1983 వన్డే ప్రపంచకప్‌లో భారత్ ను తొలిసారిగా విశ్వవిజేతగా నిలిపాడు. వన్డేలలో 200 వికెట్లు పడగొట్టిన తొలి పేస్ బౌలర్‌గా నిలిచారు. టెస్టు క్రికెట్లో మొత్తం 434 వికెట్లు సాధించారు.

అనీల్ కుంబ్లే, ద్రావిడ్, సచిన్...

భారత మాజీ కెప్టెన్, స్పిన్ ఆల్ రౌండర్ అనీల్ కుంబ్లేకు 2015లో 'హాల్ ఆఫ్ ఫేమ్' గౌరవం లభించింది. భారత మరో మాజీ కెప్టెన్ రాహుల్ ద్రావిడ్ 2018 ఈ గౌరవం దక్కించుకున్నారు. భారత క్రికెట్ 'దేవుడు' సచిన్ టెండుల్కర్‌కు 2019లో 'హాల్ ఆఫ్ ఫేమ్' 'హాల్ ఆఫ్ ఫేమ్'గుర్తింపు లభించింది. 2007 టీ-20, 2011 వన్డే ప్రపంచకప్‌లు అందించిన నాయకుడు మహేంద్ర సింగ్ ధోనీకి 2025 హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. భారత క్రికెట్ కు దూకుడుతత్వాన్ని నేర్పిన మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి 2025లో కానీ హాల్ ఆఫ్ ఫేమ్ గుర్తింపు రాలేదు. భారత వీరబాదుడు ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కూడా హాల్ ఆఫ్ ఫేమ్ లో నిలిచాడు.

ఇద్దరే భారత మహిళలు...

ఐసీసీ హాల్ ఆఫ్ పేమ్‌లో నిలిచిన 15 మంది మహిళా క్రికెటర్లలో ఇద్దరు భారత దిగ్గజాలు సైతం ఉన్నారు. భారత్ తరపున 20 టెస్టులు, 34 వన్డేలు ఆడిన డయానా ఎడుల్జీకి 2023 హాల్ ఆఫ్ ఫేమ్ లో చోటు దక్కింది. భారత కెప్టెన్ గా, ఎడమచేతి వాటం స్పిన్నర్ గా డయానా విశిష్ట సేవలు అందించారు.

'హాల్ ఆఫ్ ఫేమ్'లో నిలిచిన భారత రెండో మహిళా క్రికెటర్‌గా ఎడమచేతి వాటం స్పిన్నర్ నీతూ డేవిడ్ గుర్తింపు తెచ్చుకొన్నారు. భారత్‌కు 10 టెస్టులు, 97 వన్డేలలో ప్రాతినిధ్యం వహించిన నీతూకి 41 టెస్టు, 141 వన్డే వికెట్లు పడగొట్టిన రికార్డు ఉంది.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

'హైందవంపై వలసవాదుల కుట్ర'

'మిషనరీ మాయాజాలం–పాశ్చాత్య పంజరంలో తాంత్రిక భారతం' అనే ఈ మహద్గ్రంథంలో ప్రముఖ రచయిత, పరిశోధకులు మైలవరపు సుధామోహన్, బ్రిటిష్ వలసవాద పాలనలో హైందవ ధర్మానికి వ్యతిరేకంగా మిషనరీలు పన్నిన కుట్రలు, భారతీయ నాగరికతను క్రైస్తవ మతచట్రం కింద ఇరికించి చేసిన వక్ర వ్యాఖ్యానాలు, వారు అవలంబించిన వక్రమార్గాలు, చేసిన వక్రీకరణలను సోదాహరణంగా వివరించారు. బ్రిటిష్ పాలకులు 17వ శతాబ్దం నుంచి దక్షిణ భారతీయ భాషలు నేర్చుకుని వాటిలోకి బైబిల్‌ను అనువదింప చేశారు. కొందరిని మతం మార్చారు. భారతీయులు బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా మారాలని ఎన్నెన్నో వక్రీకరణలకు పాల్పడ్డారని ఈ పుస్తకం వివరిస్తుంది.

భారతదేశాన్ని.. దక్షిణాదిని పాలించిన రాజులలో అధిక సంఖ్యాకులు శూద్రులే అయినా, వారిని అణచివేసిన వారిగా బ్రాహ్మణులను చిత్రీకరించడంలో బ్రిటిష్ పాలకులు సఫలీకృతులయ్యారు. క్రైస్తవ సిద్ధాంతాలు, యూరోపియన్ సామాజిక వ్యవస్థల ఆధారంగా, మిషనరీలు భారతీయ వ్యవస్థలకు వక్ర వ్యాఖ్యానాలు చేశాయి..

విభిన్న ఉపాసనా పద్ధతులతో, వైవిధ్య సంప్రదాయాలతో, వివిధ ఆచారాలతో విలసిల్లిన సనాతన భారతీయ సమాజాన్ని క్రైస్తవ పాలనకి అనుగుణంగా మలచడానికి, హిందువులను విభజించడానికి విలియం జోన్స్ మనుస్మృతిని ఒక ఉపకరణంగా వాడుకున్నాడు. పాశ్చాత్యుల భాషాశాస్త్రం ఆధారంగా మాక్స్‌ముల్లర్ ఆర్యుల దండయాత్ర సిద్ధాంతాన్ని సృష్టించాడు. తర్వాత కాలంలో ఆయనే తాను పొరపడ్డానని, భాష–జాతి వేరు అని చెప్పినా, ఈనాటికీ ఆ నకిలీ సిద్ధాంతం సజీవంగానే ఉంది, విద్యాలయాల్లో బోధింపబడుతూనే ఉంది. ఇదే ఆర్య–ద్రావిడ జాతులు అనే విభజన సిద్ధాంతానికి పునాది.

ఈ ఆర్య–ద్రావిడ సిద్ధాంతాలు, మొదట శాక్తేయాన్ని, ఆ తరువాత శైవాన్ని, ధార్మిక పరంపర నుండి చీల్చి, ఆ విశిష్ట సంప్రదాయాలను క్రైస్తవానికి అనుకూలంగా మార్చడానికి నానా ప్రయత్నాలు జరిగాయి. 'ద్రావిడ మతం' గురించి మిషనరీలు చేసిన అనేక తీర్మానాల వెనకనున్న వాస్తవాలను ఈ పుస్తకం వెలుగులోకి తెస్తుంది.

వేదాలతో పాటు శైవాగమాలు, వైష్ణవ ఆగమాలు, తంత్రశాస్త్రాలతో, నిగమాగమ ఆచార సంస్కృతుల ఆధారంగా భారతీయ వ్యవస్థ నడిచేది. శైవ శాస్త్రంలోని 25 భాగాల నిగమాగమాలలో అనేక మార్గాలు ఉన్నాయి. ఉదాహరణకు, వీరశైవం అతిమార్గం... అంటే, బుద్ధి ధర్మానికి అతీతమైన పరమేశ్వర శాస్త్రం. ప్రస్తుతం, 'నిమ్న వర్గాలు'గా పేర్కొనే అనేక కులాలు ఆగమ, తాంత్రిక సంప్రదాయాలకు చెందిన ఉపాసనా మార్గాలలో సాధన చేసేవారు. వాటిని సనాతన ధర్మం నుంచి విభజించి, వక్రీకరించి, 'ద్రావిడ మతం'గా పేరు పెట్టారు. శివ,



మిషనరీ మాయాజాలం!
పాశ్చాత్య పంజరంలో తాంత్రిక భారతం
రచన: **మైలవరపు వీఎన్ఎల్ సుధామోహన్**
వెల: **రూ.250**, పే.: **236**
ప్రతులకు:
సంవిత్ ప్రకాశన్ & మీడియా (ప్రై) లి.
సెల్: 91 85209 99582
సాహిత్యనికేతన్, 9290127329

శక్తుల సంప్రదాయాలను ధార్మిక పరంపర నుంచి వేరుచేసి, క్రైస్తవంలో కలుపుకోవడానికి చేసిన భయంకర ప్రయత్నాలను ఈ పుస్తకం వివరిస్తుంది.

ఆర్య,ద్రావిడ సిద్ధాంతాల ద్వారా వైదిక పరంపర భారతదేశానిది కాదని, దాన్ని బ్రాహ్మణులు బయట నుంచి తెచ్చారని చెపుతూనే, అదే వైదిక పరంపర నుండి పుట్టిన ఆగమ– తాంత్రిక పరంపరకు చెందిన సంప్రదాయాలను, ద్రావిడ మతాలుగా, కొన్నిటిని –ఆనిమిశం' (ప్రకృతి ఆరాధన)గా పేర్లు పెట్టారు. మొత్తం గ్రామదేవతల సంప్రదాయాలను ఇందులో కలిపేసారు. బిషప్ రాబర్ట్ కాల్డ్వెల్ లాంటివారు పాటించిన పద్ధతులను తర్వాత కూడా మిషనరీలు కొనసాగించి గ్రామదేవతల వ్యవస్థను సమూలంగా పెకలించే ప్రయత్నం చేశారు. దురదృష్టవశాత్తూ, స్వాతంత్ర్యం తరువాత కూడా ఇదే పద్ధతి కొనసాగి, గ్రామ దేవతల ఆలయాలు శిథిలమయ్యాయి. జానపదుల ఆచారాలకు మూలగ్రంథాలు సంస్కృతంలో ఉన్నా, వాటికి విరుద్ధంగా ప్రచారం చేశారు. ఈ పుస్తకంలో ఒక పూర్తి అధ్యాయం గ్రామదేవతల గురించి శాస్త్రీయ వివరాలు అందిస్తుంది.

మిషనరీలు.. సనాతన ధార్మిక పరంపర నుంచి పనిగట్టుకుని తాంత్రికాన్ని చీల్చి వాటి జ్ఞానాన్ని తస్కరించి, వాటిని క్రైస్తవ సామాజిక చట్రంలో ఇరికించి వక్ర వ్యాఖ్యానాలు చేశారు. ఈ మిషనరీ మాయాజాలపు కనికట్టు నుండి భారతీయులను ఈ పుస్తకం మేలుకొలుపుతుంది. అలాగే సంస్కృతం ఆర్య జాతి భాష అని, తెలుగు, తమిళం, కన్నడ మొదలైనవి ద్రావిడ భాషలని, తల్లీబిడ్డల లాంటి భాషా సంబంధాన్ని, ఆయుధీకరించి భాషా వేర్పాటువాదం సృష్టించారు. ఈ పుస్తకం ఈ సిద్ధాంతాల బండారాన్ని బయట పెడుతుంది.

మిషనరీల మతమార్పిడి పర్వం, మంత్ర–తంత్ర శాస్త్రాలు, డెమోనోలేటరీ (మరణించినవారికి గుడులను కట్టే పద్ధతిని, పిశాచాల/దయ్యాల పూజలని పేరు పెట్టారు) లేక భూత పిశాచ పూజలని పేరుపెట్టి, క్రైస్తవంలో ఉండే సాతాను ప్రార్థనలతో పోల్చారు. వీటినేకాక, ఈ పుస్తకం...భాషా సిద్ధాంతాలు, సంస్కృత–ప్రాకృత–దేశ్య భాషాలు, వాటి ప్రభావాలను వివరిస్తుంది. బిషప్ రాబర్ట్ కాల్డ్వెల్, జేగేన్బాల్గ్, రెవెరన్డ్వెట్టైడ్, మొదలైన వారి కుతంత్రాలు ఈ పుస్తకం బయట పెట్టింది. తంత్రశాస్త్రాలకి కూడా మూలం వేదమే అని నశాస్త్రీయంగా వివరించింది. కమ్యూనిజం సిద్ధాంతాలు ఏవిధంగా వలసవాద పాలనా దౌర్జన్యాలను కప్పిపెట్టాయో రచయిత వివరించారు. అలాగే మిషనరీల / బ్రిటిష్ పాలనా కుటిల నీతికి, కమ్యూనిజం సిద్ధాంతాలకి ఉన్న సారూప్యతను కూడా తెలియజేశారు. కోటా వెంకటాచలం, చిలుకూరి నారాయణరావు, డా. వేదవ్యాస, చివుకుల అప్పయ్య శాస్త్రి వ్యాసాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.

రచయిత కెనడా వైమానిక రంగంలో పనిచేస్తూనే.. భారతదేశ వారసత్వం, వలసవాద చరిత్ర, సనాతన ధర్మ శాస్త్రాలు,వర్ణం, కులం, జాతి, అంటరానితనం మొదలైన క్లిష్టమైన అంశాలపై మీద అవిశ్రాంతంగా లోతైన పరిశోధన చేస్తున్నారు. ఆంగ్లంలో వారి ప్రఖ్యాత పుస్తకం 'శివస్య కులం'. డా. రాజీవ్ మల్హోత్రా 'స్నేక్స్ ఇన్ ద గంగా' పుస్తకాన్ని డా.బొమ్మరాజు సారంగపాణితో కలిసి 'గంగలో విష నాగులు' పేరుతో తెలుగులోకి అనువదించారు. పి. రంగారెడ్డితో కలిసి 'కుహనామేధావులు' అనే పుస్తకం రాశారు. వీరి పరిశోధనా గ్రంథం 'వర్ణాశ్రమ విజ్ఞానము' సామవేదం షణ్ముఖశర్మగారి అభినందనలు అందుకుంది. ఇవే కాక హిందూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల గురించి అనేక వ్యాసాలు రాశారు.

– ఎన్. ఆయుష్

ఆర్థిక, భౌగోళిక రాజకీయ శక్తిగా భారత్

ఉద్భవిస్తున్న నూతన ప్రపంచ క్రమంలో భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకొని, ఒక శక్తిగా ఎదగడానికి ఆత్మనిర్భర్ భారత్ అవసరమని ఆర్థికవేత్త, మేధావి ఎస్ గురుమూర్తి అన్నారు. తన జాతీయ ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి ఆర్థిక స్వావలంబన, నూతన ప్రపంచ క్రమంలో సుస్థిర స్థానం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ జూలై 26న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మేధావుల సమావేశంలో మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్, సమకాలీన భౌగోళిక రాజకీయాల మధ్య గల అంతర్గత సంబంధాన్ని వివరిస్తూ, స్వావలంబన అనేది నేటి భావన కాదని, భారతీయ నాగరికతలో,

సమన్వయం, జాతీయ సమైక్యత, నాగరికత చైతన్యం అన్నవి భారతదేశ నిరంతర పురోగతిని నిర్ధారించడానికి, బాహ్య జోక్యం నుండి దేశాన్ని రక్షించడానికి అనివార్యమన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావు మాట్లాడుతూ, 2014కు ముందు అప్పుల్లోనూ, ఇతర దేశాలపై ఆధారపడిన భారత్ నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో శరవేగంగా, ఆత్మనిర్భర్ దిశగా దూసుకుపోతోందని చెప్పారు. 75 ఏళ్ల దేశ స్వాతంత్ర్యాన్ని సూచించే ఈ అమృతకాలంలో భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా

సామాజిక అల్లికలో లోతుగా పాతుకొని ఉందన్నారు.

దేశవ్యాప్తంగా, లూధియానా, ఇతర సంప్రదాయ పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాల వ్యవస్థాపక సంస్కృతి ప్రస్తావిస్తూ, వ్యాపారం, ఆవిష్కరణ, స్వయం ఉపాధి అన్నవి భారతీయ సమాజంలో అనేక తరాలుగా విలసిల్లాయని పేర్కొన్నారు. నేడు భారత్ బలమైన ఆర్థిక, భౌగోళిక రాజకీయ శక్తిగా ఎదుగుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రభావం పెరుగుతున్న కొద్దీ, కొన్ని విదేశీ శక్తులు సమాజంలో అంతర్గత విభజనలను సృష్టించి, దేశాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నాయని అప్రమత్తం చస్తశారు.

ఇటీవలే ఢిల్లీలో జరిగిన నిరసనలను ప్రస్తావిస్తూ, అటువంటి పరిణామాలను విస్తృతమైన భౌగోళిక రాజకీయ నేపథ్యంలో అర్థం చేసుకోవాలని, పౌరులు కూడా దేశంలో అశాంతిని, అస్థిరత్వాన్ని సృష్టించడానికి ఉద్దేశించిన ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక స్వావలంబన, సామాజిక ఎదిగిందన్నారు. 2014 ముందు దేశంలో 75 విమానాశ్రయాలు ఉండగా, నేడు దాని సంఖ్య 150కి పెరిగిందన్నారు. ★



నచికేతుడు

కథ

వాజశ్రవుడు అనే ఋషి ఒక యజ్ఞం చేస్తూ, దానంలో భాగంగా తన దగ్గరున్న ఆవులను ఇవ్వడం ప్రారంభించాడు. అయితే వాటిలో పాలివ్వలేని, ముసలి ఆవులు కూడా ఉన్నాయి. ఇది గమనించిన నిజాయతీ, నిబద్ధత గల ఆయన కుమారుడు నచికేతుడు, "దానం అంటే ఉపయోగకరమైన వస్తువులనే ఇవ్వాలి. పనికిరాని వాటిని ఇస్తే అది నిజమైన దానం కాదు అని అమ్మ చెప్పేది. నాన్నకు ప్రియమైనవాడిని నేను. నన్ను దానంగా ఇవ్వమని నాన్నను అడిగితే ఎలా ఉంటుంది?" అని ఆలోచించాడు.

'నాన్నా! నన్ను దానంగా ఇవ్వండి' అని తండ్రిని అడిగాడు. మొదట తండ్రి పట్టించుకోకపోయినా, కుమారుడు పదేపదే అడగడంతో కోపంతో, "నిన్ను యముడికి ఇస్తాను" అన్నాడు. తండ్రి మాటను శిరసావహించిన నచికేతుడు నేరుగా యమలోకానికి వెళ్లాడు. ఆ సమయంలో యముడు అక్కడ లేకపోవడంతో, నచికేతుడు మూడు రాత్రులు ఆహారపానీయాలు లేకుండా యమ నివాసం ముందే వేచి ఉన్నాడు. తిరిగి వచ్చిన యముడు ఆ బాలుడి సహనానికి, నిష్ఠకు సంతోషించి, "మూడు రాత్రులు అతిథిగా వేచి ఉన్నందుకు మూడు వరాలు కోరుకో" అన్నాడు.

నచికేతుడు మొదటి వరంగా తన తండ్రి కోపం శాంతించి, తాను తిరిగి వెళ్లినప్పుడు ప్రశాంత మనసుతో, ప్రేమతో తనను స్వీకరించాలని కోరుకున్నాడు. రెండవ వరంగా..స్వర్గానికి మార్గం చూపే, దుఃఖాల నుండి విముక్తి కలిగించే పవిత్రమైన యజ్ఞ జ్ఞానాన్ని ఉపదేశించాలని, 3వ వరంగా మరణం తర్వాత మనిషికి ఏమవుతుంది? ఆత్మ ఉనికిలో ఉంటుందా లేదా? అనే అత్యున్నతమైన గూఢ సత్యాన్ని తెలుసుకోవాలని కోరాడు. ఈ 3వ వరానికి యముడు ఆశ్చర్యపోయి, "ఈ రహస్యం దేవతలకు కూడా సులభంగా అర్థం కాదు. దీనికి బదులుగా వందల సంవత్సరాల ఆయుష్షు, సకల భోగభాగ్యాలు, రాజ్యాధికారం, అద్భుతమైన సంపదలు ఇస్తాను తీసుకో" అని ఆశ చూపాడు. కానీ నచికేతుడు వేటికీ ఒప్పుకోలేదు. "ఇలాంటి భోగాలన్నీ క్షణభంగురాలు. మరణాన్ని జయించలేని ఏ సంపదా నాకు వద్దు, నాకు కేవలం శాశ్వతమైన ఆత్మసత్యమే కావాలి" అని నిలబడ్డాడు. ఆ బాలుడి అనన్యమైన జ్ఞానతృష్ణకు, నిశ్చలమైన నిబద్ధతకు సంతోషించిన యమధర్మరాజు అతనికి ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించాడు.

మంచిమాట

మంచి మాట మనసును
గెలుస్తుంది, మంచి పని జీవితాన్ని
గెలుస్తుంది.

మెదడుకు మేత

నోరు లేదు కానీ
మాట్లాడుతుంది, కాళ్లు లేవు కానీ
ప్రయాణిస్తుంది. ఏమిటది?

ంఖ్ళ్ఖ : ణుఙజ

పద్యం

తన కోపమె తన శత్రువు,
తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము,
తన దుఃఖమె నరక మంద్రు తథ్యము సుమతీ

భావం : తన కోపమే తనకు పెద్ద శత్రువుగా మారుతుంది; అది తన ఆలోచనను చెడగొడుతుంది. శాంతంగా ఉండగలిగితే తప్పుడు నిర్ణయాల నుంచి రక్షించుకోగలుగుతాం. దయ, సంతోషం జీవితాన్ని మంచిగా మార్చుతాయి; మనసులోని స్థితి జీవితాను భవాన్ని నిర్ణయిస్తుంది.

శ్లోకం

ఆచార్యో బ్రహ్మోమూర్తిః
పితామూర్తిః ప్రజాపతేః
మాతా పృథివ్యా మూర్తిస్తు
భ్రాతా సోఽ మూర్తి రాత్మనః

భావం : గురువు పరబ్రహ్మ స్వరూపుడు. తండ్రి బ్రహ్మదేవుని స్వరూపం. తల్లి భూదేవి స్వరూపం. అన్న తన స్వరూపం. కాబట్టి... వీరిని ఎన్నడూ తిరస్కరించకూడదు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

చేప	గూడు
పక్షి	అడవి
సింహం	నీరు
ఆవు	కలుగు
ఎలుక	పాలు

ఖణక
-ణఞఞ ఞణఞ-ఞఞ ఞఞ-ంఞంఞ
ఞఞఞ-ఞ్ఞ ఞ; ఞఞ-ఞఞ : ణుఙజఞఞ్ఞ

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

గ్రెగర్ జోహన్ మెండల్

ఆస్ట్రియాకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త గ్రెగర్ జోహన్ మెండల్ 1822లో జన్మించారు. తల్లిదండ్రుల లక్షణాలు పిల్లలకు ఎలా సంక్రమిస్తాయి? ఒక తరం నుంచి మరో తరానికి గుణాలు ఎలా వెళ్తాయి? అనే విషయాలను వివరించడంలో ఆయన చాలా కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా బఠానీ మొక్కలపై చేసిన ప్రయోగాల వల్ల ఎంతో ప్రసిద్ధి చెందారు. మొక్కల ఎత్తు, పువ్వుల రంగు, విత్తనాల ఆకారం వంటి లక్షణాలను అనేక తరాలపాటు పరిశీలించారు. ఈ ప్రయోగాల ద్వారా ఆధిపత్య సూత్రం, విభజన సూత్రం, స్వతంత్ర వర్గీకరణ సూత్రం వంటి జన్యు నియమాలను వివరించారు. ఆయన చేసిన పరిశోధనలు ఆధునిక జన్యుశాస్త్ర అభివృద్ధికి బలమైన పునాది వేశాయి. అందుకే గ్రెగర్ జోహన్ మెండల్‌ను "జన్యుశాస్త్ర పితామహుడు" అని పిలుస్తారు.

జనరల్ నాలెడ్జ్

1. కంప్యూటర్ పితామహుడు ఎవరు?
2. మొక్కలు ఆహారం తయారు చేసుకునే ప్రక్రియను ఏమంటారు?
3. భూమికి సహజ ఉపగ్రహం ఏది?

సమాధానాలు: 1. చార్లెస్ బాబేజ్; 2. కిరణజన్య సంయోగక్రియ; 3. చంద్రుడు.

భక్తాగ్రేసరులు

జ్ఞాన యోగిని ఈశ్వరమ్మ

మహాసిద్ధపురుషుడు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మనుమరాలు ఈశ్వరమ్మ. ఆయన రెండవ కుమారుడు గోవిందయ్యకు సా.శ.1703లో జన్మించిన ఆమె, చిన్నతనం నుంచే వయసుకు మించిన ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించింది. వీధిబడి నుంచే పురాణేతిహాసాలను పుక్కిట పట్టింది. ఆమెకు యుక్తవయసు రావడంతో, తల్లిదండ్రులు పెళ్లిచేయాలనుకున్నారు. కానీ ఐహిక సుఖాలపై వాంఛ లేదంటూ.. కందిమల్లెయపల్లె సమీపంలోని గుహలో తపస్సు చేసింది. ఆమెకు తాతగారు ప్రత్యక్షమై, 'భక్తులను తరింపచేసే తరుణం ఆసన్నమైంది. కార్యోన్ముఖురాలివికా' అని ఆశీర్వరించారనే కథనం ప్రచారంలో ఉంది. కొంతకాలం ఆమె వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించారు. శిష్యులకు శరీరతత్వం, యోగరహస్యాలను వివరించారు. ఆమె త్రికాలజ్ఞాని, ఆత్మసాక్షాత్కారం పొందిన మహనీయురాలుగా భావించిన అనేక మంది జిజ్ఞాసువులు ఆమె వద్ద ఉపదేశం పొందారు. ఈశ్వరమ్మ ఆరాధ్య దేవతగా పూజలందుకుంటున్నారు. ★

వారఫలాలు

3-9 ఆగస్ట్, 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

విద్యార్థులు ఆశించిన అవకాశాలు పొందుతారు. పలుకుబడి కలిగిన వారు పరిచయాలు ఏర్పడవచ్చు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. నూతన వ్యక్తుల పరిచయాలు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. రాజకీయ వేత్తలు, క్రీడాకారులు కొంత ఊరట చెందుతారు. 8,9 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువులతో తగాదాలు. శివాష్టకం పఠించండి..

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆలోచనలు అమలు చేస్తారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయి. ఊహించని కాంట్రాక్టులు లభిస్తాయి. గృహ, వాహనయోగాలు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు అనుకూలిస్తాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతల నుంచి విముక్తి. రాజకీయ, పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం. 6,7 తేదీల్లో ఖర్చులు అధికం. కుటుంబంలో కొన్ని సమస్యలు. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యం కొంత ఇబ్బంది పెట్టవచ్చు. కాంట్రాక్టులు అనుకూలిస్తాయి.. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. రాజకీయవేత్తలు, కళాకారులకు ఆహ్వానాలు అందుతాయి. రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 7,8 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. స్నేహితులతో తగాదాలు. సూర్యారాధన చేయండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ప్రముఖులు పరిచయమై ఉత్సాహంగా గడుపుతారు. కొన్ని శ్రీవేడుకలలో పాల్గొంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. శత్రువులను అనుకూలురుగా మార్చుకుంటారు. వ్యాపారులకు తగినంత లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు ఒత్తిడులు క్రమేపీ తొలగుతాయి. పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం. రచయితలు, క్రీడాకారులకు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 3,4 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. విష్ణుధ్యానం చేయండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆశ్చర్య కరమైన సంఘటనలు ఎదురవుతాయి. వ్యతిరేకులు అనుకూలురుగా మారతారు.. నిర్ణయాలలో మార్పులు. వ్యాపారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగులకు ప్రశంసలు అందుతాయి. కళాకారులు, రాజకీయవేత్తలకు అనుకూల వాతావరణం. క్రీడాకారులు, రచయితలకు శుభ వార్తలు. 4,5 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. అనుకోని ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొత్త వ్యక్తుల పరిచయం. ఆస్తుల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. గృహ నిర్మాణాలకు శ్రీకారంచుడతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు అనుకోని హోదాలు దక్కుతాయి. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు కృషి ఫలిస్తుంది. 6,7 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువులతో విభేదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

సోదరులు, స్నేహితులతో విభేదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు విధుల్లో అనుకూలమైన వాతావరణం నెలకొంటుంది. రాజకీయ, పారిశ్రామికవేత్తలకు ఉత్సాహవంతమైన కాలం. రచయితలకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. 8,9 తేదీల్లో స్వల్పఅనారోగ్యం. కుటుంబంలో కలహాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

స్థిరాస్తుల క్రయవిక్రయాలలో ఆటంకాలు తొలగుతాయి. వ్యాపారులు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతారు. ఉద్యోగులకు ఒత్తిడులు అధికమైన అధిగమిస్తారు. విధి నిర్వహణలో సత్తా చాటుకుంటారు. రాజకీయవేత్తలు, కళాకారులకు అనుకూల సమయం. రచయితలకు కొత్త ఆలోచనలు కలసివస్తాయి. 4,5 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. గాయత్రీ ధ్యానం చేయండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

శ్రమపడినా ఆశించిన ఫలితం అందుకుంటారు. దేవాలయాలు సందర్శిస్తారు. వాహనాలు, భూములు కొంటారు. ప్రత్యర్థులు కూడా స్నేహితులుగా మారతారు. వ్యాపారులు లాభాల దిశగా నడుస్తారు.ఉద్యోగులకు అవాంతరాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు ఆహ్వానాలు అందుతాయి. 3,4 తేదీల్లో సోదరులతో వివాదాలు. ఆరోగ్యసమస్యలు. సూర్యారాధన చేయండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. స్థిరాస్తి విషయంలో సోదరులతో ఒప్పందాలు చేసుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింతగా లాభాలు అందుతాయి. ఉద్యోగులకు కీలక సమాచారం అందుతుంది. కళాకారులు, రచయితలకు నూతనోత్సాహం. 5,6 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో వివాదాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఉద్యోగాయత్నాలు నిరాశ పరుస్తాయి. మంచికి వెళితే చెడుగా మారే సూచనలు. నిర్ణయాలలో ఆచితూచి వ్యవహరించండి. వ్యాపారులకు సాదాసీదాగా ఉంటుంది. పెట్టుబడుల్లో నిదానం అవసరం. ఉద్యోగులకు వివాదాలు నెలకొంటాయి. కళాకారులు, పారిశ్రామికవేత్తలకు గందరగోళంగా ఉంటుంది. క్రీడాకారులకు గందగోళపరిస్థితి. 5,6 తేదీల్లో వాహనసౌఖ్యం. శుభవార్తలు. విష్ణుధ్యానం చేయండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

చిన్ననాటి స్నేహితులను కలుసుకుని మంచీచెడ్డా విచారిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగయోగం. దేవాలయాలు సందర్శిస్తారు. కొన్ని వివాదాలు తేలిగ్గా పరిష్కరించుకుంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. వ్యాపారులకు తగినంత లాభాలు అందుతాయి. ఉద్యోగులకు మార్పులు ఉండవచ్చు. రాజకీయ వేత్తలు, రచయితలకు ఆశ్చర్యకరమైన ఫలితాలు ఉంటాయి. 8,9తేదీల్లో శారీరక రుగ్మతలు. దూర ప్రయాణాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

పదరసం-575

ఆధారాలు

అడ్డం

1. సింహాన్ని ఈ రాజు అంటారు (2)
2. తోయం (2)
4. అధరం (2)
5. ఈ పాదుడు రుష్యశృంగుడి మామగారు (2)
6. నవ్వుతో వేళాకోళం (4)
8. ఈ చక్రవర్తి ఓ దాత (2)
9. సరస్వతీదేవే...తడబడింది (3)
11. నిలువు 2లో నిప్పు (2)
12. వాయసం (2)
13. లోచనం (2)
14. మనసు,బుద్ధి (2)
15. చీలిక, ముక్క (2)
16. శరీరం (2)
17. లగ్నంకు వికృతి (2)
18. మేనత్త కొడుకు (2)
20. మామిడి (2)
22. పవిత్రం (3)
24. కర్ణుడి రాజ్యం..అటు నుంచి (2)
26. రూపాయి చెల్లాచెదరు (3)
28. చిలుక (2)
29. కాలాన్ని తెలిపే యంత్రం (4)
30. మార్గం, వేదం (3)

నిలువు

1. ఐదవ నక్షత్రం (4)
2. భార్గవరాముని తండ్రి (4)
3. కొండ, పర్వతం (2)
4. వంచన (2)
6. ఇతరుల శరీరంలోకి ప్రవేశించే విద్య (4)
7. దండ, మాల (2)
10. పక్కికి ప్రకృతి (2)
11. ఇది ఎప్పుడూ మంచిది కాదట (2)
13. ఇది పెనుభూతమట (4)
14. వస్త్రనేత సాధనం (2)
15. పవనసుతుడు (3)
17. సీతారాముల కవలలు (5)
19. సైనికుడు, జవాను (3)
21. కొప్పు, జట్టు.. (2)
23. ప్రవరుడిని వలచిన అప్సరస (4)
25. దుకాణం (3)
26. కపోతం (3).
27. సక్రమం కానిది (3)



పదరసం - 574 సమాధానాలు

1 మా	త		2 అం	3 బ	రం		4 బో	5 నా	లు
రీ		6 నా		త్తెం		7 గి		గో	
8 చు	ట్ట	రి	9 కం		10 సూ	రి		11 డ	12 గ
డు		13 కే	త	14 నం		15 జ	16 న	వ	రి
	17 మే	ళం		18 ద	గ్గు		న్న		మ
19 కో	టి		20 దా	నం		21 నా	య	22 న	
రి		23 స్రో	దా		24 బ	కం		25 కు	ప్ప
26 క	27 త		28 పు	త్త	డి		30 వే	లు	
	31 రు	32 గా		చి			33 మ	డు	34 గు
35 ఆ	వు	పా	లు		36 వా	మ	న		ర్తు

పొంగల్ కానుకగా రావాల్సిన విజయ్ నటించిన 'జన నాయకుడు' ఆరు నెలలు ఆలస్యంగా జూలై మూడోవారంలో విడుదలైంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో ఈ సినిమా ద్వారా లబ్ధి పొందాలని విజయ్ భావించగా, ఇది విడుదల కాకుండానే విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాడు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసిన ఈ సినిమా, ఫలితాల తర్వాత రావడంతో అవుట్ డేటెడ్ అయిపోయింది. సీఎం విజయ్‌ను దృష్టిలో పెట్టుకుని కొన్ని సన్నివేశాలను రీ-షూట్ చేసి జత చేయడంతో అతుకుల బొంతైపోయింది. మొన్నటి ఎన్నికల్లో గెలిచి, తమిళనాడులో జన నాయకుడు అనిపించుకున్న విజయ్ వెండితెరపై మాత్రం నిరాశపర్చాడనే చెప్పాలి.

దళపతి విజయ్ రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని భావించి, చివరిగా అంగీకరించిన చిత్రం 'జననాయగన్'. అయితే ఈ సినిమాకు బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' స్ఫూర్తి. కానీ చిత్రంగా ఎన్నికల అస్త్రంగా ఈ సినిమాను ఉపయోగించుకోవాలని భావించిన విజయ్...దర్శకుడు హెచ్. వినోద్‌తో పొలిటికల్ సెటైరిక్ ఎపిసోడ్స్‌ను వండివార్చారు. కొన్నేళ్లుగా మార్చి మార్చి అధికారాన్ని పంచుకుంటున్న డీఎంకే, అన్నా డీఎంకేలను విమర్శించడంతో పాటుగా మూడోశక్తిగా తమిళనాడులో తన సత్తా చాటాలని ప్రయత్నించిన బీజేపీని విమర్శించే ప్రయత్నం చేశాడు. ఆ రెండు పార్టీలే ప్రజలను దోచుకోవాలా? మూడో పార్టీకి ఆ అవకాశం ఇవ్వరా? అని థర్డ్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడు అన్నట్టుగా కొన్ని సన్నివేశాలను ఇందులో పెట్టారు. అయితే చిత్రంగా ఇప్పుడు మూడో పార్టీ అధినేతగా విజయ్ తమిళనాడు సీఎంగా అధికారం చేపట్టారు. మరి ఆయన కూడా ముందు రెండు పార్టీల మాదిరి జనాలను దోచుకుంటారో, కాచుకుంటారో చూడాలి.

రాజకీయం కథ ఇలా ఉంటే... ఈ సినిమాలో 'భగవంత్ కేసరి'లోని మహిళా సాధికారికత, బ్యాడ్ టచ్ – గుడ్‌టచ్ అంశాలను యథాతథంగా వాడుకున్నారు. అయితే పొలిటికల్ ఎజెండాకు ప్రాధాన్యం ఇవ్వడం కోసం విలన్ ఎపిసోడ్ మొత్తాన్ని మార్చేశారు. కథ గురించి సింపుల్‌గా చెప్పుకోవాలంటే.... వెట్రి కొండన్ (విజయ్) గిరిజన గ్రామం నుంచి వచ్చిన పోలీస్ అధికారి. అవినీతి అక్రమాలను చీల్చిచండాడే నిజాయతీపరుడు. అలాంటి వ్యక్తి కొందరి కుట్రల వల్ల జైలు పాలవుతాడు. అక్కడ ఉండగానే ప్రతిపక్ష నాయకుడిపై జరిగిన దాడిని అడ్డుకుంటాడు. దాంతో జైలర్ (గౌతమ్ వాసుదేవ మీనన్)కు అతని పట్ల సానుభూతి కలుగుతుంది. తల్లిని చివరిచూపు చూడటానికి వెట్రికి అవకాశం ఇస్తాడు. ప్రమాదంలో చనిపోయేముందు జైలర్ తన కూతురు విజ్జీ (మమితా బైజు)ను ఆర్మీ ఆఫీసర్‌ని చేయవలసిందిగా, వెట్రీ చేతిలో పెట్టి కన్నుమూస్తాడు. చిన్నప్పుడే తల్లి మరణంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విజ్జీని వెట్రీ ఆర్మీ ఆఫీసర్ చేయగలిగాడా? నిజాయతీపరుడైన అతను ఎందుకు

జైలుకు వెళ్లాల్సి వచ్చింది? అధికారం కోసం అర్రులు చాచిన రోజా రంగస్వామి (ప్రకాశ్ రాజ్), దుర్మార్గుడైన హెమ్లర్ (బాబీ డియోల్)తో కలిసి ఎలాంటి దారుణాలకు పాల్పడ్డాడు? దాన్ని వెట్రీ ఎలా ఎదుర్కొన్నాడు? ఆ క్రమంలో అతనికి రిపోర్టర్ కాయల్ (పూజాహెగ్డే) ఎలా సాయం చేసింది? రావణ కాష్ఠంగా మారిన రాష్ట్రంలో వీరు ఎలా శాంతిని నెలకొల్పారు? అనేది సినిమా కథ.

'భగవంత్ కేసరి'లో ప్రతినాయకుడు రాజకీయ నేతలతో చేతులు కలిపి నౌకాశ్రయాకు సంబంధించిన ప్రాజెక్ట్‌ను హస్తగతం చేసుకుని దేశంలో అరాచకాలు సృష్టించాలని అనుకుంటాడు. కానీ ఇందులో రాజకీయ నాయకుల కారణంగా అవమానం పొందిన పోలీస్ అధికారిని, దేశాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నట్టుగా చూపించారు. అతను మతపరమైన అల్లర్లు సృష్టించాలనుకుంటే సస్పెండ్ అయిన పోలీస్ అతన్ని ఎలా ఎదుర్కొన్నాడనేది చూపించారు. అక్కడ సినిమా ట్రాక్ తప్పింది. పొలిటికల్ సెటైర్స్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కథకు, కథనానికి ఇవ్వలేదు. సినిమా విడుదల సమయానికి విజయ్ సీఎం అయిపోవడంతో ఆయన విజయోత్సవ గీతాన్ని తలపించేలా రెండు పాటలను పెట్టారు. అవి కథలో ఏ మాత్రం ఇమడలేదు. 'భగవంత్ కేసరి' సినిమాను యథాతథంగా తీసినా బాగానే ఉండేది, కానీ రాజకీయ ప్రయోజనాల కోసం ఆ కథను కిచిడీగా మార్చేశారు

నటీనటుల విషయానికి వస్తే వెట్రీ పాత్రను విజయ్ చాలా నులువుగా చేసేశాడు. తెలుగులో కాజల్ చేసిన పాత్రను తమిళంలో పూజా హెగ్డే చేసింది. ఇక్కడ కాజల్‌ది సైకియాట్రిస్ట్ పాత్ర అయితే అక్కడ పూజాది ఛానెల్ రిపోర్టర్ పాత్ర. అలానే శ్రీలీల పాత్రను మమితా బైజు పోషించింది. కానీ శ్రీలీల అంత గొప్పగా ఆమె నటించలేకపోయింది. ఇతర ప్రధాన పాత్రలను ప్రకాశ్‌రాజ్, బాబీడియోల్, ప్రియమణి, సునీల్, రేవతి, గౌతమ్ వాసుదేవ మీనన్, నాజర్ తదితరులు పోషించారు. తెర మీద చాలామంది ప్రముఖులే ఉన్నా వారి పాత్రలను సరైన రీతిలో మలచలేదు. అనిరుధ్ సమకూర్చిన ఏ పాటా జనాలను ఆకట్టు కునేలా లేదు. నేపథ్య సంగీతమూ పరమ రొటీన్‌గా ఉంది. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ బాగుంది. ఎడిటింగ్ విషయంలో జాగ్రత్త పడి నిడివి తగ్గించాల్సింది. కార్తితో 'ఖాకీ' లాంటి సినిమాను తీసిన హెచ్ వినోద్ ఈ సినిమా తీశా డంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. పైగా విజయ్ చివరి సినిమా అని ప్రచారం జరిగిన తర్వాత కూడా ఇలాంటిది తీయడం దారుణమే. తమిళనాడులో విజయ్‌కు ఇప్పుడున్న ఇమేజ్ కారణంగా ఈ సినిమా బాగానే ఆడొచ్చేమో కానీ తెలుగులో మాత్రం కష్టమే. 'భగవంత్ కేసరి' సినిమాచూసి అప్పట్లో కాస్తంత పెదవి విరిచిన వారికి దానిని ఎంత బాగా తీశారో ఇప్పుడీ సినిమా చూస్తే అర్థమౌతుంది. నిజజీవితంలో 'జన నాయకుడు' అనిపించుకున్న విజయ్ ఈ సినిమాతో మాత్రం అలా అనిపించుకోలేకపోయారు.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-

వెల : ₹.60/-

వెల : ₹.270/-

వెల : ₹.80/-



వెల : ₹.54/-

వెల : ₹.120



వెల : ₹.80



వెల : ₹.250/-



వెల : ₹.180/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-

వెల :₹.200/-



వెల : ₹.900/-



వెల : ₹.350/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 42